అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 10-01-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 322
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

యూజీసీ ముసాయిదా నిబంధనలు ఉపసంహరించాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్



న్యూఢిల్లీ : ఇటీవల విడుదల చేసిసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు 2025 ముసాయిదాను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం సవవరించిన నిబంధన రాష్ట్రాల ...11లో



7 గంటలు..50 ప్రశ్నలు

ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ విచారణ

తిరిగి పిలుస్తామన్న ఏసీబీ అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో ప్రధాన నిందితుడైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గురువారం సుదీర్ఘంగా విచారించారు. దాదాపు ఏడు గంటల పాటు సాగిన విచారణలో పలు ప్రశ్నలను ఏసీబీ దర్యాప్తు బృందం కేటీఆర్‌పై సంధించింది. ఏసీబీ ఇచ్చిన నోటీసు మేరకు ఉదయం పది గంటల తర్వాత కేటీఆర్ విచారణ కోసం బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. తన వెంట కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు న్యాయవాదిని కూడా తీసుకొచ్చారు. కాగా, ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఒక గదిలో, ఆయన తరపు న్యాయవాదిని పక్క గదిలో ఉంచి విచారణ సాగించారు. ఆ గది నుంచి న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ విషయంలో విదేశీ కంపెనీతో ఎలాంటి ఒప్పందాలు చేసుకున్నారు? అందుకు అనుసరించి న విధానాలు ఏమిటి? ఇందుకోసం రూ.55 కోట్లు సదరు కంపెనీకి బదిలీ చేయటానికి హెచ్ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారా? ఆదేశాలు మౌఖికమా లేక లిఖితపూర్వకమా? తదితర ప్రశ్నలతో కేటీఆర్ విచారణను ఏసీబీ అధికారులు ప్రారంభించినట్టు సమాచారం. విచారణ బృందానికి ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి నాయకత్వం వహించగా.. విచారణాధికారి డీఎస్పీ మాజిద్ ఖాన్‌తో పాటు మరో ఐదుగురు అధికారులు కేటీఆర్‌ను ...11లో

రేవంత్ రాసిచ్చిన ప్రశ్నల్నే అడిగారు

రాజకీయ లబ్ధి కోసమే నాపై కేసు

ఒక్క పైసా అవినీతికి పాల్పడలేదు : విచారణానంతరం కేటీఆర్ వ్యాఖ్య

వివరాలు 11లో

ఆర్బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదు?

అర్వింద్ కుమార్‌కు ఈడీ సూటి ప్రశ్న

16న కేటీఆర్‌ను విచారించటానికి రంగం సిద్ధం

11లో..

అత్యవసర విచారణకు సుప్రీం నో

కేటీఆర్ కేసు 15న చేపడతామని తేల్చి చెప్పిన ధర్మాసనం

10లో..

భూభారతికి గవర్నర్ ఆమోదం

వీలైనంత త్వరగా చట్టాన్ని పట్టాలెక్కిస్తాం

ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలే సర్కార్ లక్ష్యం

ఉద్యోగులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలి : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "భూ భారతి" చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. దీంతో త్వరలో ఈ చట్టానికి సంబంధించిన గెజిట్ విడుదల కానుంది. గవర్నర్ ఆమోదించిన చట్టం బిల్లు కాపీని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం లో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి ...11లో

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తి

ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్ : మంత్రి పొంగులేటి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తయిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ లబ్దిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్ల గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకొచ్చామని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలోగల తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఆయన ప్రారంభిస్తూ...ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu. telangana. gov.inకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారుని ...11లో



గ్రీన్‌ఛానల్ ద్వారా జీతాలు

పంచాయతీ ఉద్యోగులకు ప్రతి నెలా అమలు

దీనికోసం స్పష్టమైన విధానాన్ని అనుసరించాలి : సమీక్షలో సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తున్నారనీ, వీరికి ప్రతి నెలా రూ. 116 కోట్ల జీతాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వీరందరికీ జీతాల చెల్లింపులో ఆలస్యం కాకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని పంచాయతీ రాజ్, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. గ్రీన్ ఛానెల్‌లో వీరికి జీతాలు చెల్లించాలని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మాజీ మంత్రి జానారెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం బిల్లులను త్వరగా చెల్లించాలని ఆయన ఆదేశించారు. గతేడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయనీ, .. వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలన్నారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదల అయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాబట్టుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు.

నేడు కలెక్టర్ల కాన్ఫరెన్స్

రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లే ప్రధాన ఎజెండా

దిశానిర్దేశం చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనుంది. ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సర్క్యులర్ జారీ చేశారు. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ...2లో



ముంచుకొస్తున్న ఆహార కొరత..?

వాతావరణ మార్పులతో పంట దిగుబడులపై ప్రభావం

10 శాతం మేర తగ్గనున్న వరి, గోధుమల దిగుబడి : ఐఎండీ చీఫ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో అనుహ్య పరిస్థితులు ఎదురవుతున్నాయి. వీటి ప్రభావంతో.. పంట (వరి, గోధుమ) దిగుబడులు 6-10 శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది లక్షలాది మందికి ఆహార భద్రతపై ప్రభావం చూపనుందన్నారు. మరోవైపు తీర ప్రాంతాల్లో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయని, దీంతో చేపలు తీరం నుంచి దూరంగా వెళ్లిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఫలితంగా చేపల వేటపైనా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.

"వాతావరణ మార్పులు రైతులు, ఆహార భద్రతపై గణనీయమైన ...10లో

రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్

మిగులు విద్యుత్ ఇతర రాష్ట్రాలకు పంపిణీ

పాలమూరును అన్నపూర్ణ జిల్లాగా మారుస్తాం : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

విద్యుత్ ఉప కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ - వనపర్తి

రాష్ట్రంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, అయినప్పటికీ మిగులు విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు పంపిణీ చేసి రాష్ట్ర రైతాంగానికి ప్రయోజనం చేకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో గురువారం రూ.23.30 కోట్లతో రెండు విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభం, ఏడింటికి శంకుస్థాపన చేశారు. 50 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కన్న కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాలమూరు- రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వెనుకబడిన పాలమూరు జిల్లాను అన్నపూర్ణ జిల్లాగా మారుస్తామని చెప్పారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లల్లో ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వనపర్తి జిల్లాలో విద్యుత్ తీగలు లైన్ మార్పిడి, స్తంభాలు మార్చడానికి ఇప్పటికే రూ.45 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జనవరి 26 నుంచి అర్హులైన ప్రతి రైతుకూ ఎకరాకు ఏడాదికి రూ.12వేలు రైతు భరోసా ఇస్తామన్నారు. భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కూడా అదే రోజు ప్రారంభిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని, ఇంకా కాని వారుంటే అందరికీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎన్ని సమస్యలు ఉన్నా రైతాంగానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు చెప్పారు. ఉచిత విద్యుత్‌ను అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ ఇస్తామని చెప్పారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ఐదేండ్లలో లక్ష కోట్ల నిధులతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. రైతులకు ఇరిగేషన్ ఎంత ముఖ్యమో విద్యుత్ అంతే ముఖ్యమని చెప్పారు. ఈనెల చివరికి జిల్లాలో భారీ రుణ మేళా, జాబ్‌మేళా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనరెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండి ముషారఫ్ అలీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ ఆఫీసు వద్ద కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ల ధర్నా

ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తానంటూ కమిషనర్ హామీ

వివరాలు 11లో

ఛత్తీస్‌గఢ్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

ముగ్గురు మావోయిస్టులు హతం



సుక్మా : ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలకు నక్సలైట్లకు మధ్య గురువారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్టు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు ...11లో

తిరుపతి ఘటనలో ఇద్దరిపై వేటు

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం

గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం

క్షతగాత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శ

వివరాలు 11లో





మైక్రోసాఫ్ట్‌లో కోతలు..!

కొత్త ఏడాదిలో టెకీల్లో ఆందోళన

న్యూఢిల్లీ : గ్లోబల్ దిగ్గజ టెక్నాలజీ కంపెనీ మైక్రోసాఫ్ట్ కొత్త ఏడాదిలో తమ ఉద్యోగులను తీవ్ర కలవరానికి గురి చేస్తోంది. ఆ సంస్థలో ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది. కరోనా తర్వాత వేగంగా పుంజుకున్న ఐటీ రంగంలో తమ ఉద్యోగాలకు ఢోకా లేదని భావించిన వారికి ఇది ఆందోళనకర అంశమే. ఈ కొత్త ఏడాది 2025లో ఉద్యోగాల కోతల కసరత్తును ప్రారంభించినట్టు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవలి వరకు ఆర్థిక మాంద్యం, ఖర్చుల నియంత్రణ, ఏఐ సాకులతో సిబ్బందికి ఎసరు పెట్టిన టెక్నాలజీ కంపెనీలు.. తాజాగా ప్రతిభ లేని వారిని ఇంటికి పంపిస్తున్నామని కొత్త పాటను అందుకున్నాయి. మైక్రోసాఫ్ట్ కూడా ఇదే తరహా ప్రకటన ...10లో

పీఎం-కిసాన్‌కు రైతు ఐడీ లింకు

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ అన్నదాతల్ని పట్టించుకోవటంలేదు. పైగా కనీసమద్దతు ధర (ఎంఎస్పీ)తో న్యాయమైన హక్కులను కల్పించాలని అన్న దాతలు కోరుతుంటే..వారిపై రబ్బరు బుల్లెట్లు, జలఫిరంగులతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. వ్యవసాయ మార్కెట్లను ప్రయివేటు పరం చేసేలా చర్యలు తీసుకోవటమే కాదు. ఇపుడు పీఎం-కిసాన్‌కు రైతు ఐడీ లింకు పెట్టింది. దరఖాస్తులోనే మెలిక పెట్టి..కౌలుదార్ల నోట్లో కేంద్రం మట్టి కొట్టడానికి సిద్ధమైపోయిందని రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

నూతన దరఖాస్తుదారులకు కొత్త మెలిక



- భూమి ఉన్నవారికే అన్ని ప్రయోజనాలు
- తప్పనిసరి చేసిన కేంద్రం
- కౌలుదార్ల నోట్లో కేంద్రమూ మట్టి
- ఇప్పటికే పది రాష్ట్రాల్లో అమలు



న్యూఢిల్లీ : ఇకపై ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్)కు కొత్తగా దరఖాస్తు చేసుకోబోయే రైతులకు కేంద్రం కొత్త షరతును తీసుకొచ్చింది. ఈ స్కీం కింద ప్రయోజనాలు అందుకోవాలంటే కొత్త దరఖాస్తుదారులు తమ పేరు నమోదుకు ఒక ఐడీ(రైతు గుర్తింపు)ను తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ దీనిని తప్పనిసరి చేసింది. ఎందుకంటే, పీఎం-కిసాన్ కోసం ప్రతినెలా దాదాపు రెండు లక్షల కొత్త దరఖాస్తులు వస్తున్నాయని గణాంకాలు చెప్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న రైతుకు భూమి ఉన్నదనీ, దీంతో పీఎం-కిసాన్ నమోదు ప్రక్రియ చాలా సరళీకృతమవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, ఇది కేంద్ర పథకం కింద ప్రయోజనాలను పొందటం సులభతరం చేస్తుందని చెప్పాయి.

ఈ ప్రక్రియ ఈనెల 1 నుంచి పది రాష్ట్రాల్లో అమల్లోకి వచ్చినట్టు వివరించాయి. ఇందులో ఏపీతో పాటు అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, యూపీ వంటి రాష్ట్రాలున్నాయి. పీఎం-కిసాన్ లబ్దిదారులు 11 కోట్ల మంది ఉంటే అందులో 9.25 కోట్ల మంది (అంటే దాదాపు 84 శాతం) ఈ పది రాష్ట్రాల నుంచే ఉండటం ...2లో

సీఎం విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 13 నుంచి 23 వరకు సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతించింది. అయితే, జులై 6 లోగా పాస్‌పోర్టును రిటర్న్ చేయాలని ఆదేశించింది. ఓటుకు నోటు కేసులో సీఎం తన పాస్‌పోర్టును ఏసీబీ కోర్టుకు అప్పగించిన విషయం విదితమే. తాజాగా తాను విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు అనుమతించాలనీ, పాస్‌పోర్టు ఇవ్వాలని ఏసీబీ కోర్టును సీఎం అభ్యర్థించారు. ఆస్ట్రేలియా, దావోస్, సింగపూర్, స్విట్జర్లాండ్ దేశాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. అందుకోసం ఆరు నెలల పాటు పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. దీనికి ఏసీబీ కోర్టు సమ్మతించింది. అయితే, జులై ఆరో తేదీ లోపు పాస్‌పోర్టును మళ్లీ అప్పగించాలని స్పష్టం చేసింది.

సీఎం ఆస్ట్రేలియా పర్యటన రద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దయింది. ఈ మేరకు సీఎంవో కార్యాలయంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 14 నుంచి 23 వరకు సీఎం పర్యటన వివరాలు ఇలా....

ఈనెల 14న ఢిల్లీకి...

- 15, 16 తేదీల్లో ఢిల్లీలో పర్యటన
- 15న ఢిల్లీలో జరిగే ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు
- ఈనెల 17న ఢిల్లీ నుంచి సింగపూర్ ప్రయాణం
- 17, 18 తేదీల్లో సింగపూర్‌లో పర్యటన
- 19న సింగపూర్ నుంచి దావోస్ కు ప్రయాణం
- 23 వరకు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు.

నేడు కలెక్టర్ల కాన్ఫరెన్స్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశం ప్రారంభం కానుంది. రైతుభరోసా విధివిధానాలు ఇప్పటికే ఖరారు కాగా, రేషన్ కార్డులకు సంబంధించిన విధివిధానాలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేల చొప్పున ఎలాంటి వ్యవసాయ భూములు లేని కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఈ సమావేశంలోనే ఖరారు చేసే అవకాశముంది. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఇప్పటికే 95 శాతం పూర్తయ్యింది. ప్రభుత్వం మొదటి ప్రాధ్యాన్యతగా పెట్టుకున్న వితంతువులు, ఇండ్లులేని నిపుపేదలు, అనాధలకు మొదటి విడతలో ఇండ్ల మంజూరుపై సీఎం దిశానిర్దేశం చేసే అవకాశముంది. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికార్లు, డీఆర్‌డీవోలు, డీఎస్‌డీవోలు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సీఎస్ ఆదేశించారు.

పీఎం-కిసాన్‌కు రైతు ఐడీ లింకు

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. అయితే, కేంద్రం చర్యపై రైతు సంఘాల నాయకుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. భూమి ఉన్నవారికే అన్ని ప్రయోజనాలు చేకూరుస్తూ, కౌలుదార్ల నోట్లో కేంద్రం మట్టి కొడుతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎం-కిసాన్ స్కీం కింద అర్హులైన రైతు కుటుంబాలకు ప్రతి నాలుగు నెలలకు మూడు వాయిదాల్లో రూ.2 వేల చొప్పున ఏడాదికి మొత్తం రూ.6 వేలు అందుతుంది. లోక్‌సభ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు 2019, ఫిబ్రవరి 24న ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.



పింఛన్ల పెంపు కోసం వచ్చే నెల 10న చలో ఢిల్లీ

- ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చే కనీస పింఛన్‌ను రూ. 300 నుండి రూ.5000 లకు పెంచాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 10న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో సంబంధిత వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 2011నుండి పింఛన్లలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యావసర సరకుల ధరలు 300 రేట్లు పెరిగాయని గుర్తు చేశారు. ఆ మేరకు పింఛన్లు పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ధరల పెరుగుదల సూచికి పింఛన్లను అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పింఛన్ పథకాన్ని వికలాంగులందరికి వర్తింప చేయాలని కోరారు. రాజస్థాన్ మాదిరిగా పింఛన్ పొందడం వికలాంగుల హక్కుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికల, చంద్రమోహన్, సుల్తాన్, రమేష్ నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

'గొడ్డుకారం'.. కల్పితమే

- అది ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా చేసినది : ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్‌లో గొడ్డుకారంతో భోజనం పెడుతున్నట్టు ఇటీవల సోషల్‌మీడియాలో వచ్చిన వార్తలు కల్పితమేనని, నిజం కాదని ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. నల్లగొండ జిల్లా పరిధిలోని ఎంజీయూలో గురువారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల యూనివర్సిటీలోని కృష్ణవేణి బాలికల హాస్టల్‌లో బాలికలకు గొడ్డుకారంతో భోజనం పెడుతున్నట్టు సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోలు, వీడియోలు కేవలం కల్పితమేనని చెప్పారు. యూనివర్సిటీకి చెందిన ఒక విద్యార్థి ఉద్దేశపూర్వకంగా బాలికలతో ఫొటోలు, వీడియోలు తీయించి అధికారులకు, సోషల్ మీడియాలో పెట్టి యూనివర్సిటీ స్థాయిని దిగజార్చే విధంగా చేసినట్టు వివరించారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంజీయూలో వసతి గృహాల మెస్ నిర్వహణ పూర్తిగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహిస్తామని, ప్రతి నెలా ఒక విభాగం నుంచి సెక్రెటరీని ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎన్నుకుంటారని వివరించారు. విశ్వవిద్యాలయంలో కొందరు విద్యార్థుల విపరీత చర్యల ద్వారా దురదృష్టకర సంఘటనలు జరుగుతున్న దృష్ట్యా ఫేస్ రికగ్నిషన్ హాజరును ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎంజీయూలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు అన్నింటినీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోర్సులుగా మార్చేందుకు ప్రతిపాదనలు, రాబోవు విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులు - గవర్నర్స్ అండ్ పబ్లిక్ పాలసీ, లా, డెవలప్‌మెంట్ స్టడీస్ వంటి కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా యువతను దృష్టిలో ఉంచుకొని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది విశ్వవిద్యాలయం నుంచి మొత్తం రూ.260 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నిధులు తెచ్చుకుని సద్వినియోగం చేస్తామన్నారు.

దోపిడీ రహిత సమాజమే మా లక్ష్యం

రాజకీయాల్లో విలువలు పాటించేది కమ్యూనిస్టులే

- నాయకుల మరణం కుటుంబానికే కాదు వామపక్షాలకూ తీరనిలోటు
- అమరుల ఆశయ సాధనకు కృషి చేయడమే వారికిచ్చే నివాళి : అమరుల సంతాపసభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దోపిడీ రహిత సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రాజకీయాలు వ్యాపారమయంగా మారాయని అన్నారు. డబ్బు, ప్రలోభాలు, అధికార దాహం వంటివే కనిపిస్తున్నాయని చెప్పారు. రాజకీయాల్లో విలువలు పాటించేది కమ్యూనిస్టులేనని వివరించారు. అయితే విలువలు పాటించే కమ్యూనిస్టు నాయకుల మరణం ఆ కుటుంబానికే కాకుండా కమ్యూనిస్టు పార్టీలకు, సమాజానికీ తీరనిలోటని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్, మఖ్దూంభవన్ ఆఫీసు మాజీ కార్యదర్శి డిఎస్ రామచంద్రరావు మరణించడం పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. వారి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు. వారి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాలమల్లేష్, పోటు ప్రసాద్, రామచంద్రరావు సంతాప సభను సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు అమరుల చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కమ్యూనిస్టులు ఏకం కావాలి... సమస్యలపై పోరాడాలి : జూలకంటి

కమ్యూనిస్టులు ఏకం కావాలనీ, ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి దారీ సామ్రాజ్యవాద దేశాల్లో కూడా వామపక్ష పార్టీల నాయకులు గెలుస్తున్నారని చెప్పారు. పెట్టుబడిదారీ విధానం రోజురోజుకూ పతనమ వుతున్నదనీ, సోషలిస్టు విధానం బలపడుతు న్నదని వివరించారు. సమసమాజం రావాలనీ, అసమానతలు లేని సమాజం కావాలని ఆకాంక్షించారు. దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సంపద అందరికీ చేరాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాదంపై కమ్యూనిస్టులు కలిసి పనిచేయాలన్నారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని చెప్పారు. రాజకీయ పార్టీలు ఒక కుటుంబ లిమిటెడ్ కంపెనీల్లాగా మారాయనీ, ధనబలంతో అధికారంలోనికి వస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కూడా బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు సిద్ధం కావాలని చెప్పారు. ఉన్నత ఆశయం కోసం పనిచేసిన అమరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు.



కమ్యూనిస్టుల జీవితాలు త్యాగాలమయం : కూనంనేని

కమ్యూనిస్టు నాయకులుగా పనిచేసిన వారి జీవితాలు త్యాగాలమయ మని అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. బాలమల్లేష్, పోటు ప్రసాద్, రామచంద్రరావు ఎన్ని ఇబ్బందు లున్నా, బూర్జువా పార్టీల నాయకులు ప్రలోభాలకు గురిచేసినా వాటికి లోనుకా కుండా అంకితభావంతో పనిచేశార ని చెప్పారు. అనేక రాజకీయ అవకాశాలు వచ్చినా కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగారని వివరించారు. వ్యక్తిగత జీవితాన్ని వదిలేసి ప్రజల కోసం పనిచేశారని అన్నారు. విద్యార్థి, యువజన సంఘాలతో పాటు బీకేఎంయూ, బీసీ హక్కుల సాధన సమితి నాయకునిగా బాలమల్లేష్ పనిచేశారని వివరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ సమితి సభ్యులుగా ఎదిగారని చెప్పారు. పోటు ప్రసాద్ ఖమ్మంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించా రని అన్నారు. రామచంద్రరావు పార్టీ కార్యాలయంలో ఎంతో సౌమ్యుడిగా వ్యవహరించేవా రని గుర్తు చేశారు. కార్యాల యానికి వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించే వారని చెప్పారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ కావాలి : చాడ వెంకట్‌రెడ్డి

కమ్యూనిస్టుల పునరేకీకరణ కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి చెప్పారు. కమ్యూనిస్టులే దేశానికి భవిష్యత్తు అని అన్నారు. అన్ని ప్రాంతాలకూ కమ్యూనిస్టు పార్టీని విస్తరించడమే అమరులైన నాయకులకు ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు. ప్రస్తుత రాజకీయాల్లో విలువలు పడిపోయాయనీ, అంకితభావం లేదనీ, సేవా భావం అసలే లేదనీ, డబ్బే పాలిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న బాలమల్లేష్, పోటు ప్రసాద్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. మతోన్మాద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా చెప్పారు. బాలమల్లేష్ వదిలిపెట్టిన పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సతీమణి వందన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహ, వీఎస్ బోస్, ఈటి నర్సింహ, భాగం హేమంత్ రావు, బాలమల్లేష్ కుమారుడు నిశాంత్, పోటు ప్రసాద్ కుమారుడు సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులను కాపాడుకోవాలి : కోదండరామ్

పార్టీలో ఈరోజు చేరితే తెల్లారేసరికి పదవులు కావాలనీ, డబ్బు సంపాదించాలన్న కోరిక రాజకీయ నాయకుల్లో పెరిగిందని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. ఏ పని ఎంత లాభం వస్తుందని బేరీజు వేసుకుంటున్నారని చెప్పారు. డబ్బు చుట్టూ తిరిగే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డబ్బులే ప్రధానం కాదనీ, ప్రజలే ప్రధానమని ఆలోచించే కమ్యూనిస్టులు సమజానికి ఎంతో అవసరమని అన్నారు. అలాంటి కమ్యూనిస్టు లను కాపాడుకోవాలని చెప్పారు. సాటి మనిషి పట్ల ప్రేమతో, నిబద్ధతతో, ప్రజల సమస్యల పరిష్కారానికి తిరగడమే కమ్యూనిస్టు కార్యకర్తల లక్షణమని వివరిం చారు. ఆ లక్షణాలు కలిగిన వ్యక్తులు ప్రస్తు తం చనిపోతుండడం బాధాకరమ న్నారు. ఇలాంటి కార్యకర్తలను కాపాడుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని చెప్పారు. కార్యకర్తలు కూడా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహార అలవాట్ల పై ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసం ముందన్నారు. బీపీ, షుగర్ లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఉమ్మడిగా ప్రయత్నించాలని సూచించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన తర్వాతే ఆహారపు అలవాట్లలో మార్పులొచ్చాయని అన్నారు. అంతకు ముందు జొన్నలు, రాగులతో ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బం 9ందులు తలెత్తలేదని గుర్తు చేశారు.

యూజీసీ మార్గదర్శకాలు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్.మూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

నవతెలంగాణ-ఓయూ/విలేకరులు



యూజీసీ నూతన మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. అందులో భాగంగా ఓయూ జరిగిన కార్యక్రమంలో మూర్తి మాట్లాడుతూ.. యూజీసీ నిబంధనలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. ఉన్నత విద్యలో నిరంకుశమైన మార్పులు, ప్రతి ఆరు నెలలకు యూజీసీ గైడ్‌లైన్స్‌లో మార్పులు చేయడం సిగ్గుచేటు అన్నారు. యూజీసీ 2025 డ్రాఫ్ట్ ప్రకారం.. ఉన్నత విద్యలో ఎలాంటి అర్హతా లేకుండా, టీచింగ్ అంటే ఏంటో తెలియని వారిని ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, వీసీలుగా రిక్రూట్ చేస్తుందని తెలిపారు. అలాగే పరిశ్రమ నిపుణులు, పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్స్, పబ్లిక్ పాలసీ, ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన సీనియర్ ప్రొఫెషనల్స్ వీసీలుగా నియమితులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భవిష్యత్‌లో ఉన్నత విద్యలో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని చెప్పారు. ఉన్నత విద్యలో ఇలాంటి మార్పులు చేయడం వల్ల దేశంలో అశాస్త్రీయమైన భావనలు విపరీతంగా ఏర్పడతాయన్నారు. ఈ మార్పులు యూజీసీ గైడ్‌లైన్స్‌లా లేవని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నిబంధనలుగా అవి కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గదర్శకాలను తక్షణం వెనక్కి తీసుకోవాలని లేనియెడల దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, రవి నాయక్, ఉపాధ్యక్షులు కష్ణ, మల్సూర్, అజయ్ కుమార్ విద్యార్థులు సహజ,స్పందన, సందీప్, వివేక్ , పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మొదటి గేటు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. వీసీ నియామకాల్లో ఇండస్ట్రీయల్ సెక్టార్ వాళ్లను తీసుకరావడాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో యూజీసీ నూతన డ్రాఫ్ట్ మార్గదర్శక ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజినీకాంత్ మాట్లాడారు. మెదక్ పట్టణంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన మార్గదర్శకాలు ఫెడరలిజానికి ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయన్నారు. ఆ నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

24 నుంచి 26 వరకు... హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

- మూడ్రోజుల వేడుకకు వేదికగా హైటెక్ సిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' ఈనెల 24 నుంచి 26 వరకు హైటక్ సిటీలోని సత్వ నాలెడ్జి సెంటర్, టీ హబ్‌లో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు విజయకుమార్, కిన్నెర మూర్తి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలో భాష, సంస్కృతి, సాహిత్యం నుంచి మొదలుకుని వాతావరణ మార్పుల వరకు 20కి పైగా వివిధ అంశాలకు సంబంధించి సెమినార్లు, వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు, తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించనున్న ఫెస్టివల్‌లో లిథువేనియా, సింధీ భాషలపై ప్రత్యేక చర్చాగోష్టులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ వేడుకలకు వివిధ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ ముఖ్యులు హాజరవుతారని తెలిపారు. రాజ్‌దీప్ సర్దేశాయ్, అరుణారాయ్, హర్షమందిర్, షబనా ఆజ్మీ, సినీ నటులు సిద్దార్థ తదితరులు ప్రత్యేక ఈవెంట్లలో పాల్గొంటారని వెల్లడించారు.

ఔట్ సోర్సింగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరిపించాలి


ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో అవసరం లేకున్నా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పేషీ ద్వారా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను సృష్టించి అక్రమంగా నియమించారనీ, దీనిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం ఆ సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. కోట్లాది రూపాయల డబ్బులు చేతులు మారాయని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో ఔట్ సోర్సింగ్ పేరుతో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు భర్తీ చేశారని తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆర్‌సీఏ1/1217/2024 నవంబర్14న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో నియామకాలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ఏదైనా ఒకశాఖలో ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు నియామకాలను జరపాలంటే అనుమతి పొందిన ఏజెన్సీ ద్వారా చేస్తారని గుర్తు చేశారు. ఆ ప్రోసిజర్‌ను పాటించకుండా గురుకుల శాఖ ద్వారా నియామకాలు జరపడంపై అనేక అనుమానాలున్నాయని తెలిపారు. ఒక్కొక్క పోస్టుకు రూ.2లక్షల నుండి రూ.5లక్షల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు గిరిజన శాఖలో కొంతమంది అధికారులు ప్రమేయం ఉందని తెలిపారు. ఆశాఖ ముఖ్యకార్యదర్శి బంధువు ద్వారా శాఖధికారులపై ఒత్తిడి చేసి ఇదంతా చేశారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. కింద స్థాయిలో విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు కూడా ఏజెన్సీల ద్వారా నియామకాలు జరపకుండా ,ప్రత్యక్షంగా నింపితే వారికి వేతనాలు ఏ ఖాతా నుండి చెల్లింపు చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు ఈ ఉద్యోగాలు పొందిన వారిని జాయిన్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారనే పేరుతో ఐదు పోస్టులు మంజూరు చేయడాన్ని బట్టి చూస్తే దీనిలో రాజకీయ నాయకుల ప్రమేయం, కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్టు తేటతెల్లమవుతుందని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన గురుకులాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఆశారాంతో ప్రాణహాని

- నా కుటుంబ భద్రత పైనే తీవ్ర ఆందోళన
- బెయిల్ మంజూరుపై బాధితురాలి తండ్రి ఆవేదన


(ఫైల్)

లక్నో : బాలికపై లైంగికదాడి కేసులో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారాంకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆశారాం విడుదలపై షాక్‌కు గురైనట్టు చెప్పింది. తన కుటుంబం భద్రత గురించే తీవ్ర ఆందోళన ఉన్నదనీ, దీంతో తనకు నిద్ర పట్టటం లేదని బాధితురాలి తండ్రి తెలిపాడు. ఆశారాం జైలులో ఉన్న సమయంలోనే ఈ కేసుకు సంబంధించిన నలుగురు సాక్షులు హత్యకు గురయ్యారు. మరో ఇద్దరు సాక్షులు కనిపించకుండా పోయారు. అలాగే ఆశారాం జైల్లో ఉన్నప్పుడే జమ్ము, జోధ్‌పూర్, ఢిల్లీ, సురసాగర్‌ల్లో తనపై తప్పుడు కేసులు బనాయించినట్టు బాధిత బాలిక తండ్రి తెలిపారు. ఇప్పుడు ఆయన బయటకు వస్తే తమ కుటుంబం బతికిబట్టకట్టే అవకాశం ఉంటుందా? అని ఆయన ప్రశ్నించారు. మైనర్లపై నేరాలకు సంబంధించిన కేసుల్లో దోషులకు ఉరిశిక్ష విధించేవిధంగా చట్టాలు ఉన్నాయని చెబుతున్నా.. ఆ చట్టాలన్నీ ఆశారాం విషయంలో ఎందుకు అమలు కావటం లేదో అర్థం కావటం లేదన్నారు. న్యాయస్థానాలు ఆశారాం పట్ల మెతక వైఖరిని కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బాధిత బాలిక కుటుంబానికి భద్రత పెంచినట్టు యూపీ పోలీసులు వెల్లడించారు. తీర్పు అనంతరం తానే స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, వారి కుటుంబాన్ని కలిశానని పోలీసు అధికారి సంజయ్ కుమార్ సాగర్ తెలిపారు. ఇది హైప్రొఫైల్ కేసు అయినందును బాధిత కుటుంబ భద్రతను తరచూ పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఆశారాంకు న్యాయస్థానం కొన్ని ఆంక్షలతో కూడిన మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిన విషయం విదితమే. ఈ ఏడాది మార్చి 31 వరకు ఆయన బెయిల్‌పై బయటే ఉండనున్నారు. జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో బాధిత బాలికపై 2013లో లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు కాగా.. న్యాయస్థానం ఆశారాంకు జీవిత ఖైదు విధించింది.

ఏరియా కమిటీ నుంచి ప్రజా ఉద్యమ కెరటంగా..

- 1995లో పటాన్‌చెరు ఏరియా కమిటీ
- 1997లో తొలి మెదక్ జిల్లా మహాసభలు
- ట్రేడ్‌యూనియన్, విద్యార్థి ఉద్యమ విస్తరణతో పునాది
- ఉద్దండ నాయకుల్ని ఓడించిన ఎర్రజెండా
- అసెంబ్లి పోరులోనూ గౌరవప్రద ఓట్లు పొందిన వైనం
- ఎర్రజెండా నీడన చారిత్రాత్మక వేతన ఒప్పందాలు
- లక్షలాది కార్మిక కుటుంబాలకు అండాదండ
- రైతులు, గ్రామీణ పేదల కష్టనష్టాల్లోనూ..
- ప్రజా ఉద్యమ క్షేత్రంగా కేవల్ కిషన్ భవన్
- ప్రజలకు ఏ కష్టమొచ్చినా మేమున్నాం : చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"కార్మిక వర్గం సర్వశక్తులతో బహుముఖ విప్లవకర పోరాటం సాగించకపోతే పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించానికి అవసరమైన సన్నాహాలు చేయజాలవు" అన్న లెనిన్ స్ఫూర్తితో చిన్న ఏరియా కమిటీగా పురుడుపోసుకున్న సీపీఐ(ఎం) బలమైన ప్రజా ఉద్యమ కెరటంగా విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంది. హైదరాబాద్ జిల్లా కమిటీలో అంతర్భాగంగా ఉన్న పటాన్‌చెరు ప్రాంత ఉద్యమం 1995లో ఏరియా కమిటీగా ఏర్పడింది. అనేక ఆటంకాలు, అవరోధాలెదురైనా తట్టుకుని ట్రేడ్‌యూనియన్, విద్యార్థి ఉద్యమంపై కేంద్రీకరిండం ద్వారా ప్రజా క్షేత్రంగా బలమైన రాజకీయ పార్టీగా విస్తరించింది. పారిశ్రామిక వాడల్లో జరిగిన ఎన్నికల్లో ఉద్దండులైన నాయకుల్ని సైతం ఓడించిన ఎర్రజెండా.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజల ఆదరణతో గౌరవప్రదమైన ఓట్లు పొందింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంటూనే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలకు ఆతిథ్యమిస్తుంది.

భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడిన తర్వాత పాత మెదక్ జిల్లాలో సీపీఐతోనే ఎక్కువ మంది నాయకులు వెళ్లారు. ఇద్దరు ముగ్గురు మాత్రమే సీపీఐ(ఎం)తో నడిచారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా కమిటీ పరిధిలో ఎంవీ భాస్కర్‌రావు నాయకత్వంలో బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం ప్రాంతాల్లో బీహెచ్‌ఈఎల్, ఏపీ స్కూటర్ ఫ్యాక్టరీ కేంద్రంగా ఉద్యమాలు నడిపారు. 1984లో ఓంకార్ విచ్ఛిన్నం తర్వాత విక్రంకుమార్ కూడా విచ్ఛిన్నం వెనకాలే వెళ్లారు. ఉన్న కొద్ది మంది నాయకులతోనే 1985 నుంచి 1995 వరకు హైదరాబాద్ జిల్లాలో కొనసాగారు. ట్రేడ్‌యూనియన్ రంగంలో విస్తరించేందుకు కేంద్రీకరించి పనిచేసిన నాయకత్వం పార్టీని విస్తరిస్తూ వచ్చారు. తొలిసారిగా 1995లో పటాన్‌చెరు తాలూకా కమిటీ పేరిట పార్టీ స్వతంత్ర్య కమిటీ ఏర్పడింది. ట్రేడ్‌యూనియన్‌లో పార్టీ నిర్మాణాన్ని విస్తరిస్తూ ఎదిగిన ఆ పార్టీ 1997లో సంగారెడ్డిలో సీపీఐ(ఎం) తొలి జిల్లా మహాసభలు జరుపుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అప్పటి 46 మండలాల్లోనూ పార్టీని విస్తరింప చేస్తూ శాఖల్ని ఏర్పాటు చేసుకుంది. గ్రామ, పట్టణ, మండల, జిల్లా కమిటీలతో పాటు ఆయా రంగాల్లో పార్టీ శ్రేణుల్ని తయారు చేసుకుంటూ వచ్చింది. ఎర్రజెండా అంటే సీపీఐ(ఎం).. సీపీఐ(ఎం) అంటే ఎర్రజెండా.. అన్నట్టుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుంది. కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, వృత్తిదారులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు ఇలా సకల జనుల కష్టసుఖాలను తెలుసుకుంటూ సమస్య ఏదైనా స్పందించే స్థాయికి వచ్చింది. స్పందించడమే కాదు.. బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఫలితాలను కూడా సాధించి పెట్టిందనడంలో అతిశయోక్తిలేదు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా కేవల్ కిషన్ భవన్‌కు వెళ్లాలన్న బలమైన అభిప్రాయం సామాన్యుల్లోనే కాదు మధ్య తరగతి ప్రజల్లోనూ వినపడుతుంది.

ట్రేడ్‌యూనియన్, విద్యార్థి ఉద్యమంపై కేంద్రీకరణ

సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా కమిటీలో భాగంగా పటాన్‌చెరు ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలు జరిగేవి. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం తొలిసారి 1995లో చిన్నపాటి కమిటీగా ఏర్పడిన పటాన్‌చెరు ఏరియా పార్టీ కమిటీని నేరుగా హైదరాబాద్ నుంచి రాష్ట్ర కేంద్ర నాయకత్వం గైడ్ చేస్తూ వచ్చింది. ముఖ్యంగా ట్రేడ్ యూనియన్స్, విద్యార్థి ఉద్యమంపై కేంద్రీకరించి పని చేశారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో వందలాది కంపెనీలేర్పడ్డాయి. ప్రభుత్వ రంగంలోని బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్ వంటి ప్రభుత్వ రంగంతో పాటే ప్రయివేట్ రంగంలో వందల సంఖ్యలో పరిశ్రమలు విస్తరించాయి. పెట్టుబడిదారులు కార్మికుల్ని శ్రమ దోపిడికి గురి చేస్తున్న పరిస్థితుల్ని అధ్యయనం చేసిన సీపీఐ(ఎం) పారిశ్రామిక ప్రాంతాల్లో ట్రేడ్‌యూనియన్ల ఏర్పాటుకు పూనుకుంది. కార్మికుల్ని సమీకరించడం, చైతన్య పర్చడం, హక్కులు, జీతభత్యాల కోసం పోరాడటం నేర్పింది. వందలాది కంపెనీల్లో సీపీఐ(ఎం) పోరాడి చేసిన చారిత్రాత్మక వేతన ఒప్పందాల ఫలితంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షలాది కార్మిక కుటుంబాలు ఎర్రజెండాను ప్రాణంగా భావిస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. మరో పక్క విద్యార్థి రంగంలోనూ కేంద్రీకరించి పనిచేసింది. 'చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు' అన్న నినాదంతో విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం నింపి వర్గ పోరాటాల వైపు నడపడంతో సీపీఐ(ఎం) నాయకత్వం సఫలీకృతమైంది. ఫలితంగా ఆ పార్టీని నడిపిస్తున్న కీలకమైన నాయకత్వమంతా కూడా విద్యార్థి ఉద్యమం నుంచి వాళ్లే కావడం విశేషం. "మెతుకు సీమ పోరుబాట" పేర ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా సుదీర్ఘ పాదయాత్ర చేసిన సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే సింగూరు జలాలు ఈ ప్రాంతానికి దక్కాయి.

కాంట్రాక్టు లేబర్ సమస్యలపై మూడు సార్లు సమ్మెలు జరిగితే అప్పట్లో లక్ష మంది కార్మికులు పాల్గొనడం అదో గొప్ప పోరాటంగా చెప్పాలి.

ఉద్దండుల్ని ఓడించిన సీపీఐ(ఎం) నేతలు

ట్రేడ్ యూనియన్‌లో బలమైన శక్తిగా ఎదిగిన సీపీఐ(ఎం) పరిశ్రమల్లో జరిగే అనేక ఎన్నికల్లోనూ విజయబావుట ఎగరేస్తూ వస్తోంది. ముఖ్యమైన అనేక కంపెనీల్లో 30 ఏండ్ల నుంచి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న చుక్క రాములు అనేక కంపెనీల్లో కార్మికుల పక్షపాతిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తూ వస్తున్నారు. కార్మిక నాయకునిగా పేరుగాంచిన అనాటి నాయిని నర్సింహారెడ్డితో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి లాంటి ఉద్దండ అధికార పార్టీ నాయకులు సైతం ఎర్రజెండా ముద్దు బిడ్డల చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇప్పటికీ అదే ఒరవడితో అనేక పరిశ్రమల్లో ఎర్రజెండా ఎగురుతూనే ఉంది. పారిశ్రామిక ప్రాంతాల్లోనే కాకుండా ప్రజా పునాదిని పెంచుకున్న సీపీఐ(ఎం) సాధారణ ఎన్నికల్లోనూ పోటీ చేసింది. తొలిసారిగా 1999లో పటాన్‌చెరు నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా చుక్క రాములు పోటీ చేసి 14000 ఓట్లు పొందడం రాష్ట్రంలో అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత 2004 ఎన్నికల్లోనూ అక్కడి నుంచే పోటీ చేసి మంచి ఓట్లు పొందారు. 2009లో మహాకూటమిలో భాగంగా పోటీ చేసిన సీపీఐ(ఎం) ఆ తర్వాత సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణ ఖేడ్‌లోనూ పోటీ చేసి జనం ఆదరణ పొందింది.

ప్రజా పునాది విస్తరణ

ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా ప్రజా పునాదిని పెంచుకుంటూ వచ్చిన సీపీఐ(ఎం) కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత మూడు జిల్లాల్లోనూ వేర్వేరు కమిటీలుగా పనిచేస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా పార్టీ ఐదు నియోజకవర్గాల్లోనూ అనేక ప్రాంతాల్లో పార్టీని విస్తరింపజేసింది. పార్టీ నాయకత్వం, క్యాడర్, పూర్తి కాలం కార్యకర్తలతో బలమైన పార్టీగా ఎదుగుతోంది. నిమ్జ్ భూ నిర్వాసితుల పక్షాన సుదీర్ఘంగా పోరాడింది. న్యాయ పోరాటం చేసి బాధిత రైతులకు మెరుగైన పరిహారం ఇప్పించడంలో సీపీఐ(ఎం) పాత్ర ఆ ప్రాంత ప్రజలు మరవలేనిది.

అదే విధంగా సామాజికంగా జరుగుతున్న వివక్షతకు వ్యతిరేకంగా దళితులపై జరిగిన దాడులపై స్పందించి బాధితుల పక్షాన పోరాడింది. భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పీడితుల వైపు నిలబడింది. గ్రామీణ, పట్టణ పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం కోట్లాడి కేసుల పాలైంది. అనేక ప్రాంతాల్లో పేదలకు స్థలాలు, ఇండ్లు ఇప్పించడంతో ఇప్పటికీ ఆ పేదలు ఎర్రజెండా పుణ్యమే అంటూ తలుచుకుంటున్నారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా మా జెండా ఉంటది

సరళీకృత ఆర్థిక విధానాలు-మతోన్మాదాన్ని తిప్పికొట్టేందుకు 'రాజకీయ-నిర్మాణ' దక్షత కలిగిన ప్రగతిశీల వామపక్ష పార్టీగా సీపీఐ(ఎం) ప్రజలకే సమస్య వచ్చినా మా జెండా అండగా ఉంటుంది. కార్మికులు, కర్షకులు, రైతులు, పీడిత ప్రజల పక్షాన మేం పోరాడుతున్నాం. పోరాడి ప్రజలకు అనేక హక్కులు సాధించగలిగాం. సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. పార్టీ రాష్ట్ర మహాసభలు చేసే నిర్దేశాన్ని అందుకుని మరింత విస్తరించేందుకు పార్టీ కృషి చేస్తోంది. మహాసభల్ని జయప్రదంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలి.

-చుక్క రాములు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కి.మీ.కు మార్చాలి

- భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేం
- ఆర్డీఓ కార్యాలయం ముందు భూ నిర్వాసితుల ధర్నా
- రైతుసంఘం, సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ-చౌటుప్పల్

ఓఆర్ఆర్ నుంచి ట్రిబుల్ ఆర్ వరకు అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు మార్చాలని, భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమిని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. రైతు సంఘం, సీపీఐ(ఎం) నాయకులు మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్ల పైబడి మార్చాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ నుంచి 28 కిలోమీటర్ల వరకు చేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే లాభం ఏమిటని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతులకు భూములు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. భూములు ఇవ్వడానికి ఏ ఒక్క రైతూ సిద్ధంగా లేడని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులు 80 శాతం భూమి ఇచ్చేందుకు అంగీకారం



తెలపాలని, కానీ 20శాతం మంది రైతులు కూడా అంగీకారం తెలపలేదన్నారు. రైతుల అంగీకారం లేకుండా అశాస్త్రీయంగా ముందుకు వెళ్తే నిర్వాసితులు తిరగబడ్తారని హెచ్చరించారు. ప్రాణ ఇవ్వడానికైనా సిద్ధమేకానీ భూములు మాత్రం వదలబోమని రైతులు మొర పెట్టుకుంటున్నారని చెప్పారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు రాగీరు కృష్ణయ్య, గుజ్జ సింగిల్‌విండో చైర్మెన్ దోడ యాదిరెడ్డి, చీరిక సంజీవరెడ్డి, భూనిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక లింగంగౌడ్, దబ్బటి రాములుగౌడ్, ఉష్కాగుల రమేశ్‌గౌడ్, సందగల్ల మల్లేశ్‌గౌడ్, చింతల ప్రభాకర్‌రెడ్డి, జాల వెంకటేశ్‌యాదవ్, శ్రీశైలం, మైసయ్య, తొర్పునూరి మల్లేశ్‌గౌడ్, ఏనుగు ప్రతాప్‌రెడ్డి, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాగవల్లి దశరథగౌడ్, సుర్కంటి రాంరెడ్డి, వల్లూరి బోగయ్య, మంద జనార్దన్‌రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

రేపటినుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు శనివారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. శనివారం నుంచి 17 వరకు ఏడురోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. శనివారం నుంచి 16 వరకు ఆరురోజులపాటు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులుంటాయి.

ఈనెల 18న పాఠశాలలు, 17న జూనియర్ కాలేజీల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి.

మేధో వైకల్యం ఉంటే

మాతృత్వం పొందకూడదా?

బాంబే హైకోర్టు ప్రశ్న



ముంబయి : 21 వారాల గర్భిణిగా ఉన్న యువతికి మేధో వైకల్యం ఉన్నదని తేలితే ఆమెకు మాతృత్వం పొందే హక్కు లేదని ఎలా చెబుతారని బాంబే హైకోర్టు ప్రశ్నించింది. ఆ యువతికి మేధో వైకల్యం ఉన్నప్పటికీ మతిస్థిమితం లేని వ్యక్తి కాదని హైకోర్టు నియమించిన మెడికల్ బోర్డ్ నిర్ధారించింది. దీనిపై జస్టిస్ ఆర్వీ ఘుగే, జస్టిస్ రాజేష్ పాటిల్‌తో కూడిన డివిజన్ బెంచ్ స్పందిస్తూ 27 సంవత్సరాల యువతికి మేధో వైకల్యం ఉన్నదని, అయితే ఆమె ఇంటెలిజెన్స్ కోషెంట్ (తెలివితేటలను తెలిపే సాధనం...ఐక్యూ) 75గా ఉన్నదని, పైగా ఆమె గర్భాశయంలో అసాధారణతలు లేదా క్రియాత్మక మార్పులు ఏవీ లేవని తెలిపింది. 'ఎవరూ అత్యంత మేధావులు, తెలివితేటలు కలిగిన వారు కారు. మనమంతా మానవులం. ప్రతి వారిలోనూ భిన్నమైన తెలివితేటలు ఉంటాయి' అని కోర్టు వ్యాఖ్యానించింది. తెలివితేటలు సగటు స్థాయి కంటే తక్కువగా ఉన్నంత మాత్రాన ఆమెకు తల్లి అయ్యే హక్కు లేదని చెప్పడం సరికాదని స్పష్టం చేసింది. సగటు కంటే తక్కువ స్థాయిలో తెలివితేటలు కలిగిన వారికి తల్లిదండ్రులయ్యే హక్కు లేదని అంటే అది చట్ట విరుద్ధమేనని చెప్పింది. మహిళ మానసిక స్థితి సరిగా లేదని, ఆమె అవివాహితురాలని, కాబట్టి గర్భవిచ్ఛిత్తికి అనుమతించాలని కోరుతూ మహిళ తండ్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే గర్భవిచ్ఛిత్తికి అంగీకరించడానికి ఆ మహిళ నిరాకరించింది. గర్భాన్ని కొనసాగించాలని కోరుకుంది. దీనిపై జనవరి 3న స్పందించిన న్యాయస్థానం మహిళ గర్భంలోని పిండాన్ని పరీక్షించి, నివేదిక అందజేయాలని జేజే ఆస్పత్రి మెడికల్ బోర్డును ఆదేశించింది. మహిళ తన గర్భాన్ని కొనసాగించవచ్చునని, అదే సమయంలో గర్భవిచ్ఛిత్తి కూడా సాధ్యమేనని మెడికల్ బోర్డు నివేదించింది. మహిళ ఓ పురుషుడితో వివాహేతర సంబంధాన్ని కొనసాగించిందని, అయితే వారిద్దరూ మేజర్లే అయినందున అది నేరం కాదని కోర్టు అభిప్రాయపడింది. మహిళతో సంబంధాన్ని కొనసాగించిన వ్యక్తిని సంప్రదించి వివాహం చేసుకునేలా ఒప్పించడానికి ప్రయత్నించాలని తల్లిదండ్రులకు సూచించింది. బిడ్డ ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని న్యాయస్థానం తెలిపింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

ప్రభుత్వోద్యోగులు కారు

జస్టిస్ చంద్రచూడ్‌పై ఫిర్యాదును తోసిపుచ్చిన లోక్‌పాల్



న్యూఢిల్లీ : హైకోర్టులు, సబార్డినేట్ కోర్టుల జడ్జీలు తమ పరిధిలోకే వస్తారని, అయితే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రభుత్వోద్యోగులు కానందున వారికి మినహాయింపు ఉన్నదని లోక్‌పాల్ రూలింగ్ ఇచ్చింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదును తోసిపుచ్చుతూ లోక్‌పాల్ ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

జస్టిస్ చంద్రచూడ్ ఒక రాజకీయవేత్తకు, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిం చడం కోసం అవినీతికి పాల్పడ్డారని, తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గత అక్టోబర్ 18న లోక్‌పాల్‌కు 382 పేజీల ఫిర్యాదు అందింది. అయితే దీనిని లోక్‌పాల్ తోసిపుచ్చింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తన పరిధిలోకి రారని తెలిపింది. సుప్రీంకోర్టు పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడినది కాదని, అది రాజ్యాంగంలోని 124వ అధికరణ కింద ఏర్పడిందని, కాబట్టి దాని న్యాయమూర్తులు ప్రభుత్వోద్యోగుల నిర్వచనం కిందికి రారని లోక్‌పాల్ రూలింగ్ ఇచ్చింది. పైగా సుప్రీంకోర్టుకు పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం లేదని, అంతేకాక దానిని నియంత్రించడం లేదని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ అధ్యక్షత వహిస్తున్న లోక్‌పాల్ తెలియజేసింది. సుప్రీంకోర్టు వ్యయాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి భరిస్తారని, అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులపై ఆధారపడదని తెలిపింది. అయితే తన పరిధిలోని హైకోర్టులు, ఇతర న్యాయస్థానాల జడ్జిలకు ఈ రూలింగ్ వర్తించదని లోక్‌పాల్ స్పష్టం చేసింది.

అవి పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడినవి కాబట్టి తన పరిధిలో ఉంటాయని తెలిపింది. ఫిర్యాదు దారుడు చట్టం అనుమతించిన పద్ధతుల్లో ఇతర పరిష్కార మార్గాలు అన్వేషించు కోవచ్చునని, ఫిర్యాదులోని ఆరోపణలపై తాము స్పందించ బోమని లోక్‌పాల్ తెలియజేసింది.

దేశసేవకు ఇదేనా గుర్తింపు ?

- బీఎస్ఎఫ్‌లో పాతికేండ్ల సర్వీస్
- వీఆర్ఎస్ తీసుకొని 16 నెలలు గడిచినా అందని పెన్షన్
- పీడీఎఫ్ ఫైలు డ్యామేజ్ అయిందంటూ కుంటిసాకులు

న్యూఢిల్లీ : ఆయన పేరు హవల్దార్ గౌతమ్ బచ్చర్. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో పాతిక సంవత్సరాల 17 రోజుల పాటు పనిచేశారు. 2023 జూలై 31న స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. వీఆర్ఎస్ తీసుకున్న వారికి సాధారణంగా ఒకటి రెండు నెలల సమయంలోనే పెన్షన్ రావడం మొదలవుతుంది. అయితే ఈ మాజీ హవల్దార్‌కు నేటికీ పెన్షన్ చేతికి అందలేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయో జనం శూన్యం. బీఎస్ఎఫ్‌కు చెందిన 31వ బెటాలియన్ ఆయన పెన్షన్ కేసును సంబంధిత విభాగానికి పంపింది. అక్కడి నుండి మరో కార్యాలయానికి వెళ్లింది. వారు ఆ ఫైలును వెనక్కి తిప్పిపంపారు. అందుకు వారు చూపిన కారణం వింటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పీడీఎఫ్ రూపంలో పంపిన ఫైలు డ్యామేజీ అయిందని, అందువల్ల ప్రక్రియను ముందుకు తీసికెళ్లడం సాధ్యపడడం లేదని వారు తెలియజేశారు. ఈపీఎఫ్ఓకు చెందిన 'భవిష్య పోర్టల్'లో మాజీ హవల్దార్ పీడీఎఫ్ ఫైలు కన్పించడం లేదు. ఫలితంగా ఆ మాజీ సైనికుడు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. బీఎస్ఎఫ్, తపాలా శాఖ, ప్రధానమంత్రి...ఇలా అన్ని విభాగాలకు, పాలకులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా మాజీ హవల్దార్ గౌతమ్‌కు నేటికీ ఊరట లభించలేదు. సమస్య పరిష్కారం కోసం బీఎస్ఎఫ్ 31వ బెటాలియన్ కమాండెంట్ 'భవిష్య పోర్టల్' సాంకేతిక బృందాన్ని సంప్రదించారు. అయినా ఒరిగిందేమీ లేదు.



తనకు పెన్షన్ జారీ చేయడంలో జరుగుతున్న జాప్యానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గౌతమ్ కోరుతున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 30న ఆయన ప్రధాని మోడీకి ఓ లేఖ రాస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. పెన్షన్ అనేది అలవెన్సు కాదని, అది ప్రాథమిక హక్కు అని ఆయన ఆ లేఖలో తెలియజేశారు. దేశం కోసం రక్షణ, పౌర సేవలు అందించిన ఓ సైనికుడికి లభించిన గౌరవం ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'పెన్షన్ చేతికి అందకపోవడంతో అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాను. దేశానికి సేవ చేసినా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాను. పెన్షన్ మంజూరులో ఎందుకీ జాప్యం? దీనిపై న్యాయ విచారణ జరిపించాలి' అని గౌతమ్ డిమాండ్ చేశారు.

ఈ-పోర్టల్‌లో ఫైలు కన్పించకపోతే అది తన తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఏ సమస్యనైనా తక్షణమే పరిష్కరించవచ్చునని, పీడీఎఫ్‌ను తయారు చేసి మరోసారి అప్‌లోడ్ చేస్తే సమస్య వెంటనే తొలగిపోతుందని అంటూ 'ఈ పని ఎవరు చేస్తారు? ఎవరు బాధ్యత వహిస్తారు? పీడీఎఫ్ ఫైలు తయారు చేయడానికి ఎంత సమయం పడుతుంది? భవిష్య పోర్టల్‌లో దిద్దుబాట్లు ఎవరు చేస్తారు? పాత పీడీఎఫ్‌ను తొలగించి కొత్తది తయారు చేస్తే సరిపోతుంది. కావాల్సిన సమాచారాన్ని బీఎస్ఎఫ్ ఇచ్చింది' అని అన్నారు.గత కొద్ది రోజుల వ్యవధిలో బీఎస్ఎఫ్‌లో ఇలా జరగడం ఇది రెండో సారి. హవల్దార్ రాకేష్ కార్ బీఎస్ఎఫ్‌లో 24 సంవత్సరాల 8 నెలలు పనిచేసి ఆరోగ్య కారణాలతో వీఆర్ఎస్ తీసుకున్నారు. అయితే పెన్షన్ పొందడంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. వీఆర్ఎస్ తీసుకున్న 90 రోజుల్లోగా పెన్షన్‌కు సంబంధించిన లాంఛనాలన్నీ పూర్తి చేయాల్సి ఉండగా ఆ నిబంధన అమలు కావడం లేదు.

వారణాసిలో తెరుచుకున్న శివాలయం

- దశాబ్దాల క్రితం మూతపడిన సిద్ధేశ్వర్ మహదేవ్ ఆలయం



వారణాసి : వారణాసిలోని ఓ శివాలయాన్ని సోమవారం తెరిచారు. ఇందులో విశేషమేముందని అంటారా? అది అనేక దశాబ్దాలకు పైగా మూతబడే ఉంది. పైగా ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో ఉంది. అలాంటి సిద్ధేశ్వర్ మహదేవ్ ఆలయాన్ని పోలీసులు, అధికారుల సాయంతో తిరిగి తెరిచారు. ఆ ఆలయ యాజమాన్యం తనదేనని, మతపరమైన ప్రార్థనలకు వీలుగా దానిని తెరిచేందుకు అనుమతించాలని సనాతన్ రక్షక్ దళ్ అనే సంస్థ గత నెలలో అధికారులను కోరింది. ఆ అభ్యర్థనకు అనుగుణంగా ఆలయాన్ని తిరిగి తెరిచారు. దేవాలయానికి వేసిన తాళాలను గ్యాస్ కట్టర్‌తో తొలగించారు. లోపల దెబ్బతిన్న మూడు శివలింగాలు కన్పించాయి. పెద్ద ఎత్తున శిథిలాలు, మట్టి కూడా ఉంది. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని త్వరలోనే పునరుద్ధరించబోతున్నారు. ఈ దేవాలయానికి వందేండ్లకు పైగా తాళం వేసే ఉన్నదని కాశీ డీసీపీ గౌరవ్ బన్స్వాల్ తెలిపారు. లోపల ఉన్న కళాఖండాలను కాపాడేందుకు వీలుగా శిథిలాలను జాగ్రత్తగా తొలగిస్తున్నామని ఆయన చెప్పారు. కాగా దేవాలయాన్ని తెరిచే సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రజల నుంచి ఎలాంటి ప్రతిఘటనా ఎదురు కాలేదనీ, వారంతా సహకరించారని జిల్లా మేజిస్ట్రేట్ అలోక్ వర్మ తెలిపారు.

నవతెలంగాణ

ఏదైనా తిరిగి రావచ్చు గాని
వృథా చేసిన కాలం తిరిగి రాదు - మహాత్మా గాంధీ

శుక్రవారం 10 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్ష!

అమెరికా లేదా స్వేచ్ఛా ప్రపంచ రక్షణ కోసం పనామా కాలువను తిరిగి తమకు అప్పగించాలని, డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్, కెనడాలు తమకు కావాలని, మెక్సికో గల్ఫ్ పేరును అమెరికాగా మారుస్తానని తద్వారా ఆ ప్రాంతంపై తమ ఆధిపత్యం, ప్రపంచ నాయకత్వం మరింతగా ప్రతిబింబిస్తుందని డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. మంగళవారం నాడు విలేకర్ల సమావేశంలో చెప్పిన ఈ మాటలు సామ్రాజ్యవాద కాంక్ష వెల్లడితప్ప మరొకటి కాదు. అమెరికాకు తగులుతున్న ఎదురుదెబ్బల పూర్వరంగంలో

> ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకంగా ఉండటమే గాక కేవలం 57వేల మంది జనాభా మాత్రమే ఉన్న ప్రపంచంలోని అతి పెద్ద దీవి గ్రీన్‌లాండ్‌పై అమెరికా కన్ను పడటానికి హైటెక్, విద్యుత్ బాటరీల తయారీకి అవసరమైన ముడిసరుకు అక్కడ పుష్కలంగా ఉండటమే కారణం. భవిష్యత్ విద్యుత్ వాహనాలదే అని తేలిపోయిన కారణంగానే ఆ ప్రాంతం మీద అమెరికా కార్పొరేట్ల కన్నుపడింది.

ప్రమాద ఘంటికలను గుర్తు చేసింది. స్వీయ రక్షణ సాకుతో ప్రపంచమంతటా 80దేశాల్లో 800కు పైగా చిన్నా పెద్ద మిలిటరీ కేంద్రాలను ఏర్పాటు చేసిన అమెరికా ఆ ముసుగులో ఆధిపత్యం చెలాయించటానికి పూనుకున్న పూర్వరంగంలో ఈ మాటలు ఆశ్చర్యం కలిగించటం లేదు. అంతరంగాన్ని బయటపెట్టాయి. అయితే అది ఆచరణ సాధ్యమా అంటే కాదని వేరే చెప్పనవసరం లేదు. అయినప్పటికీ ట్రంప్ ఎందుకు ఇలా మాట్లాడుతున్నట్లు? రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా పెద్దన్నగా ఉన్నప్పటికీ ఎక్కడా అది పైచేయి సాధించిన ఉదంతం లేదు. చిన్న దేశాలైన వియత్నాం నుంచి ఆఫ్ఘనిస్తాన్ వరకు ఆక్రమించి చివరకు పారిపోయి ప్రాణాలు దక్కించుకోవటాన్ని చూశాము. ఎదురు దెబ్బలు తగులుతున్న పూర్వరంగంలో అనేక దేశాలు అమెరికాను ఖాతరు చేయటం లేదు. ఆ ఉక్రోషంతో మరోసారి అమెరికాకు అగ్రస్థానం తెస్తా అనే నినాదంతో రెండోసారి అధికారానికి వచ్చిన ట్రంప్ అమెరికన్లను ఆకట్టుకొనేందుకు చూస్తున్నాడు.


కెనడా రక్షణకు తాము బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నామని, అక్కడి నుంచి వచ్చే దిగుమతులు తమను దెబ్బతీస్తున్నందున తమ దేశంలో ఒక రాష్ట్రంగా ఉండాలన్న



ట్రంప్ ప్రతిపాదనను కెనడా ప్రధాని ట్రూడూ తిరస్కరించాడు. అందుకు ఏమాత్రం అవకాశం లేదన్నాడు. డెన్మార్క్ కూడా అదే చెప్పింది, తమ భవిష్యత్‌ను గ్రీన్‌లాండర్స్ మాత్రమే నిర్ణయించు కుంటారన్నది. ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకంగా ఉండటమే గాక కేవలం 57వేల మంది జనాభా మాత్రమే ఉన్న ప్రపంచంలోని అతి పెద్ద దీవి గ్రీన్‌లాండ్‌పై అమెరికా కన్ను పడటానికి హైటెక్, విద్యుత్ బాటరీల తయారీకి అవసరమైన ముడిసరుకు అక్కడ పుష్కలంగా ఉండటమే కారణం. భవిష్యత్ విద్యుత్ వాహనాలదే అని తేలిపోయిన కారణంగానే ఆ ప్రాంతం మీద అమెరికా కార్పొరేట్ల కన్నుపడింది. ట్రంప్ ద్వారా తమ వాంఛను వెల్లడించాయి పైకి మాత్రం చైనా, రష్యా నౌకల రాకపోకలను తెలుసుకొనేందుకు అది తమకు మిలటరీ రీత్యా ఎంతో అవసరం అని ట్రంప్ చెప్పాడు. గ్రీన్ లాండ్ కోసం అవసరమైతే మిలిటరీ, ఆర్థిక బలాన్ని వినియోగిస్తామన్నాడు. అమెరికాలో విలీనం కావాలని గ్రీన్‌లాండర్స్ ఓటింగ్ నిర్వహించాలని కూడా చెప్పాడు. అక్కడ పెద్ద అమెరికా అంతరిక్ష కేంద్రం కూడా ఇప్పటికే ఉంది.ట్రంప్ ప్రకటనకు ముందు అతగాడి కుమారుడు ఒక ప్రయివేట్ జెట్‌లో వ్యక్తిగతం పేరుతో గ్రీన్‌లాండ్ పర్యటన జరిపాడు.

పనామా కాలువ హంకాంగ్‌కు చెందిన సికె హచిసన్ కంపెనీ ఆధీనంలో ఉంది, రెండు వైపులా ఉన్న రేవులను నిర్వహిస్తున్నది. అమెరికా నౌకలకు ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నదని, అది చైనా కంపెనీ అని ట్రంప్ ఆరోపించాడు. దీన్ని పనామా అధ్యక్షుడు జోస్ రావుల్ ములినో ఖండిస్తూ చైనా జోక్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశాడు. పసిఫిక్-అట్లాంటిక్ సముద్రాలను కలుపుతూ 1910దశకంలో ఈ కాలువను అమెరికా నిర్మించింది. 2000 సంవత్సరం జనవరి ఒకటి నుంచి పనామా ఆధీనంలోకి వచ్చింది. దాన్ని తమ మిలిటరీ కోసం నిర్మించినందున తమకు తిరిగి కావాలని గతంలో కూడా ట్రంప్ అన్నాడు. తిరిగి తీసుకొనే సమయం వచ్చిందన్నాడు. తానేం మాట్లాడినా అమెరికన్లు గుడ్డిగా నమ్ముతారనే భ్రమలో ఉన్న కారణంగానే 2021లో అమెరికా అధికార కేంద్రం కాపిటోల్ భవనంపై జరిగిన దాడిలో హిజబుల్లా తీవ్రవాదులు పాల్గొన్నట్లు ఆరోపించాడు. వైట్‌హౌస్‌లో ఇంకా అడుగు పెట్టక ముందే ఇలా మాట్లాడుతున్నాడంటే జనవరి 20 తరువాత ఏమంటాడో తెలియదు. నియంత హిట్లర్ ప్రపంచానికి ఎలా ముప్పు తెచ్చాడో డోనాల్డ్ ట్రంప్ తీరుతెన్నులను చూస్తే అదేపని చేసేట్లు అనిపిస్తోంది. యావత్ భూమండలాన్ని చాపమాదిరి చుట్టి చంకలో పెట్టుకోవాలని చూసిన ఆ నాజీ చివరకు దిక్కులేని చావు చచ్చాడు. ఈ పిచ్చివాడిని ఏం చేయాలో కాలమే నిర్ణయిస్తుంది.

నాస్తికత్వం - మేధావుల లక్షణమంటున్న పరిశోధనలు



డాక్టర్ దేవరాజు మహారాజు

నిజానికి అబద్ధానికీ తేడా తెలుసుకోలేని వారు, సరైనదేదో సరికానిదేదో తెలుసుకోలేరు. వాళ్లు స్వతహాగా ఆలోచించే శక్తిని కోల్పోయారన్నమాట! దేశంలో ప్రజల్ని ఆ విధంగా తయారు చేసి, తమ ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగించవచ్చని ప్రస్తుత ఆరెస్సెస్- బీజేపీ ప్రభుత్వం అనుకుంటోంది. పరిశీలనకు, విశ్లేషణకు అతికొద్దిమంది మాత్రమే పూనుకుంటారు. జనబాహుళ్యం వాడుకలో ఉన్న అబద్ధాలను నమ్మి దేవుళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఒక విషయం గమనించండి. దేవుళ్ల చిత్రపటాలు, ప్రతిమలు, శిల్పాలు దుకాణంలో ఉన్నంత వరకు వాటికి శక్తులేవీ ఉండవు. కానీ, వాటిని దేవాలయాల్లో, ఇండ్లలో ప్రతిష్ఠించుకోగానే వాటికి ఏవో శక్తులున్నట్టు భావిస్తుంటారు. దేవతా విగ్రహాల చిత్రపటాల శక్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా నిరూపించబడ్డాయా?

"మనుషుల్ని చంపి, మతాన్ని రక్షించడంకంటే - మతాన్ని చంపి మనుషుల్ని రక్షించడమే మేలు" అని అన్నాడు బుద్ధుడు. ఆమాటను ఇప్పటి జనం గుర్తుంచుకోవడం లేదు. "హంనే ఘర్ కి సలామతీ కెలియే... ఖుదా కొ ఘర్ సే నికాల్ రఖా హై" అన్నాడొక ఆధునిక ఉరుదూ కవి. (ఇంటి క్షేమం కోసం మేం, దేవుణ్ణి ఇంట్లోంచి బయటికి పంపించాం! అని అర్థం)

ఎవరో ఒక శిల్పి చెక్కిన శిల్పానికి శక్తి ఉంటుందా? ఎవరో ఒక చిత్రకారుడు గీసిన చిత్రానికి శక్తి ఉంటుందా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఇవి ఇప్పటివి కావు. అనాది కాలంవి లేక అతి ప్రాచీనమైనవి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ - అని మూఢ విశ్వాసం సడలిపోకుండా చేస్తుం టారు. రాగల తరాలవారు కూడా ఆ విశ్వాసాన్ని కొనసాగిస్తూ ఉండాలని, అదే మన సనాతన సంప్రదాయం, ఆచారం - అని చెపుతూ ఉంటారు. పైగా పాటించకపోతే కీడు కలుగుతుందని భయపెడతారు. అధిక

> ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న బాలబాలికలందరూ ఆస్తికులే. కానీ, వారు యవ్వన దశలోకి వచ్చాక - అంటే తెలివి తేటలు కాస్త పెరిగాక దైవ భావనపై సందేహం వెలిబుచ్చుతూ ఉంటారు. ప్రగతి పథాన నడుస్తున్న 137 ప్రపంచ దేశాల్లో మత విశ్వాసం సన్నగిల్లుతున్నట్టువారు వారి అధ్యయనంలో తేల్చారు. ఆ దేశాల్లోని సగటు మనుషుల్లో మేధోస్థాయి పెరగడమే ఇందుకు కారణమని, ప్రొఫెసర్ రిచర్డ్‌లిన్ ప్రకటించాడు. ఈయన మరొక విషయం కూడా స్పష్టం చేశాడు. సంస్కృతి, సంప్రదాయమనే- అంధ విశ్వాసాల్లో మునిగిపోయి, బయటి ప్రపంచాన్ని చూడలేక, నూతిలో కప్పల్లా జీవించే వారు కొందరుంటారనీ, వారిలో ప్రశ్నలుండ వని కాదుగానీ, వారు వాటిని లోపలే అణిచిపెట్టు కుని, తమను తాము మోసం చేసుకుంటూ - ప్రశాంతంగా బతుకుతున్నామని ఆత్మద్రోహం చేసుకుంటూ ఉంటారనీ.. అంటాడు.

సంఖ్యాకులు ఈ విషయం లోతుగా ఆలోచించారు. 'ఏదో పెద్దలు చెప్పింది పాటిస్తే సరిపోతుంది కదా' - అని అనుకుంటారు. 'ఎందుకు మన మెదడు పాడుచేసుకోవడం'? అని అనుకుంటారు. కానీ, అలా అనుకోవడం వల్లనే వారు తమ మెదళ్ల పాడు చేసుకుంటున్నా రన్న సత్యాన్ని గ్రహించలేకపోతున్నారు. ఎవడి మెదడు వాడు ఉపయోగించుకోకుండా, మరొకరి మెదడు చెప్పినట్టు చేయడం తెలివిగల పనా? ఆ మరొకడి మెదడు బూజు పట్టి ఉంటే- అదే బూజును నువ్వు కొనసాగిస్తున్నట్లే కదా?

అందుకే చూడండి! పూజలు, ఆచారాలు, సంప్రదాయాలు, ప్రార్థనా స్థలాల సందర్శనాలు... అన్నీ 'ఫార్మా లిటీ'గా మారిపోయాయి. ఎవరికీ దేని మీదా భక్తీ శ్రద్ధా ఉండటం లేదు. అవి ఉన్నట్టు ప్రదర్శించుకునే వారు కొంద రుంటారు. వారైనా ఎందుకుంటారంటే వారి జీవితం ఆ పూజల మీద ఆధారపడి ఉంటుంది - గనక! షాపింగ్ మాల్ వెళ్లామా? కావల్సింది కొనుక్కున్నామా? తిరిగి వచ్చామా? అన్నట్లు ఈ రోజుల్లో జనం గుడికి వెళ్లామా? గంట కొట్టామా? దక్షిణ సమర్పించుకున్నామా? శఠగోపం పెట్టించుకున్నామా? తీర్థ ప్రసాదాలు తీసుకున్నామా ? వెనక్కి తిరిగొచ్చామా?- అన్నట్లు ఉంటున్నారు. తప్పిస్తే, అలా ఎందుకు చేస్తున్నామని మనసుపెట్టి ఆలోచించడం లేదు. తాతల నుండి వస్తున్న ఆచారం కదా అని సర్దిచెప్పుకుంటూ ఉంటారు. తాతలనాటి జీవనవిధానానికీ, మారిన పరిస్థి తుల్లో ఇప్పటి జీవన విధానానికి అసలు పోలికే లేదన్నది మాత్రం ఆలోచించరు. దీన్నే గొర్రెదాటు పోకడ - అంటారు.



ఈ విశ్వానికి ఏ సృష్టికర్త లేదు. అది 13.77 బిలియన్ (పదమూడు వందల డెబ్బయి ఏడు కోట్ల) సంవత్సరాల క్రితం ఒక మహా విస్ఫోటనంతో దానికి అదే ఆవిర్భవించింది! ఈ విశ్వ ఆవిర్భావ సిద్ధాంతాన్ని ప్రపంచ శాస్త్ర వేత్తలంతా రుజువులతో బలపరిచారు. ఈ వాస్తవాన్ని విశ్వసించకుండా కల్పించుకున్న అతీతశక్తులకు దాసో హమ నడం అవసరమా? నిజాన్ని అర్థం చేసుకుని, దాన్ని స్వీకరించే స్థాయి మనుషులకు ఎప్పుడొస్తుందీ? భౌతికంగా పుట్టి, భౌతికంగా జీవించి, భౌతికంగానే తనువు చాలించే మనిషికి కల్పించుకున్న మతాలు, కృత్రిమంగా ఏర్పరుచు కున్న కులాలు ఇంకా అవసరమా! వాటికి అతీతంగా ఎదిగి సత్యాన్ని గుర్తించి మనుగడ సాగించనవసరం లేదా?

మేధస్సుకు-నాస్తికత్వానికీ మధ్య గల సంబంధం మీద కొందరు పరిశోధకులు దృష్టి సారించారు. విలువైన ఫలితాల్ని వెల్లడించారు. మేధావుల్లో ఎక్కువమంది నాస్తికులు కావడానికి అవకాశాలున్నాయని యునైటెడ్ కింగ్ డమ్ లో జరిగిన పరిశోధనలు చెపుతున్నాయి. మేధావుల్లో ప్రశ్నించే మనస్తత్వం ఉండడం వల్ల నాస్తికత్వ - వ్యక్తిత్వం ఏర్పడుతుందని అంటున్నారు. బ్రిటన్‌లోని అల్‌స్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రిచర్డ్ లిన్ (UNIVERSITY OF ULSTER : RICHARD LYNN(1930 - 2023) U.K) అతని పరిశోధకుల బృందం ఈ అంశంపై పరిశోధనలు చేసింది. ఫలితాలను వారు 'ఇంటిలిజెన్స్' అనే ఇంటర్నేషనల్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించారు. మనిషి మెదడుకూ నాస్తికత్వానికిగల సున్నితమైన బంధాన్ని పరిశోధకులు ఒడిసి పట్టుకున్నారు. ఈ పరిశోధకులు చెప్పింది ఏమిటంటే - మామూలు మనుషులతో పోలిస్తే మేధావుల్లో, ఆలోచనాపరుల్లో, పరిశోధకుల్లో 'ఐక్యూ' ఎక్కువగా ఉంటుంది. ఐక్యూ - ఎక్కువగా ఉన్న వారు ప్రశ్నలు ఎక్కువగా సంధిస్తారు.

ప్రశ్నించగలవారు విశ్వాసాలకు దూరంగా ఉంటారు. పైగా, అంధవిశ్వాసాల్ని తీవ్రంగా నిరసిస్తారు. రాయల్ సొసయిటీ నిర్వహించిన సర్వే ఫలితాలను ఆధారం చేసుకుని, ప్రొఫెసర్ రిచర్డ్ లిన్ పరిశోధకుల బృందం ఈ విశ్లేషణలు చేసింది. ప్రొఫెసర్ లిన్ తనకుతాను సైంటిఫిక్ రేసిస్ట్‌గా ప్రకటించుకున్నాడు. ఈ సర్వేలో 68.5 శాతం మంది ప్రజలు తాము అస్తికులమని చెప్పుకున్నారు. కానీ, అందులో దేవుణ్ణి గట్టిగా నమ్ముతున్న వారు కేవలం 3.3 శాతమే! ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న బాలబాలికలందరూ ఆస్తికులే. కానీ, వారు యవ్వన దశలోకి వచ్చాక - అంటే తెలివి తేటలు కాస్త పెరిగాక దైవ భావనపై సందేహం వెలిబుచ్చుతూ ఉంటారు. ప్రగతి పథాన నడుస్తున్న 137 ప్రపంచ దేశాల్లో మత విశ్వాసం సన్నగిల్లుతున్నట్టువారు వారి అధ్యయనంలో తేల్చారు. ఆ దేశాల్లోని సగటు మనుషుల్లో మేధోస్థాయి పెరగడమే ఇందుకు కారణమని, ప్రొఫెసర్ రిచర్డ్‌లిన్ ప్రకటించాడు. ఈయన మరొక విషయం కూడా స్పష్టం చేశాడు. సంస్కృతి, సంప్రదాయమనే- అంధ విశ్వాసాల్లో మునిగిపోయి, బయటి ప్రపంచాన్ని చూడలేక, నూతిలో కప్పల్లా జీవించే వారు కొందరుంటారనీ, వారిలో ప్రశ్నలుండవని కాదుగానీ, వారు వాటిని లోపలే అణిచిపెట్టుకుని, తమను తాము మోసం చేసుకుంటూ - ప్రశాంతంగా బతుకుతున్నామని ఆత్మద్రోహం చేసుకుంటూ ఉంటారనీ.. అంటాడు.

అయితే ప్రొ॥లిన్ బృందం చేసిన పరిశోధనలను గోర్డాన్ లించ్ అనే మరో ప్రొఫెసర్ విమర్శించాడు. ఈయన లండన్ బర్క్‌బెన్ కళాశాలకు చెందిన వాడు. ఆయన చెప్పేది ఏమంటే - ఇలాంటి పరిశోధనలకు సామాజిక, ఆర్థిక, చారిత్రక ప్రభావాలనెన్నింటినో పరిగణించాల్సి ఉంటుందనీ - ఆ పని ఈ ప్రొ॥లిన్ పరిశోధక బృందం సరిగా చేయలేదని ఆరోపించాడు. ఈయన అంటున్నది కూడా ఆలోచించాల్సిన విషయమే. ఆ దిశలో కూడా పరిశోధనలు జరగాల్సే ఉంది.

ఏదిఏమైనా, ఎవరి నేపథ్యం ఎలాంటిదైనా .. దైవ విశ్వాసానికీ, ప్రశ్నించేతత్వానికీ సంబంధం ఉందన్న ప్రొ॥ రిచర్డ్ లిన్ బృందం పరిశోధనల్ని కొట్టి పారెయ్యలేం - ఎందుకంటే, వారు సాధించిన ఫలితాల్లో నిజం ఉంది. వారు చెప్పిన విషయాలు మనం నిత్యజీవితంలో - మనచుట్టూ ఉన్నవారిలో కూడా చూస్తున్నాం. బాల్యం, యవ్వనం, మధ్య వయసు, వద్ధాప్యం- దశలలో అభిప్రాయాలు ఆలోచనా విధానం మారుతూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. ఆలోచన పెరిగి, వివేకవంతులవుతున్న కొద్దీ ప్రతి విషయాన్ని ప్రశ్నించి నిగ్గుతేల్చుకునే లక్షణం పెరుగుతూ వస్తున్న విషయం, మన పరిశీలనలో మనకు కనిపిస్తున్నదే!

ఇంతదాకా సాధించిన విజయాలన్నీ మనిషి తన స్వశక్తితో సాధించుకున్నవేనన్నది ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ ఉండాలి. అంధవిశ్వాసాల్ని అంతం చేసుకుంటూ, మనిషి తనను తాను స్థిరపరుచుకునే అవసరం ఇప్పుడు అత్యవసరంగా ఉంది. మనిషే మనిషి విలువను ఎప్పుడూ దిగజార్చుకోగూడదు. ఉబికివస్తున్న ప్రశ్నల గొంతుల్ని తొక్కిపెట్టకూడదు. సమాజంలో జీవితాలు దుర్భరమైపోతుంటే, జనం గొంతెత్త లేని నిస్సహాయతలో మిగిలి పోగూడదు. శక్తిని కూడగట్టుకుని-మనిషి ఎప్పుడూ దేనికీ బలహీనుడు కాడు - అని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. తప్పకుండా ఉంది. -

మానవ జీవితాలన్నీ నదులైతే,
మానవవాదం - ఒక మహా సముద్రం!

సముద్రంలో ప్రవేశించడానికి ముందు నది భయంతో వణికిపోతుంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసు కుంటుంది. తను దాటి వచ్చిన పర్వతాలూ, మైదానాలు, అడవులూ, గ్రామాలు కనిపిస్తాయి. ముందుకు చూస్తే అనం తమైన సముద్రం కండ్ల ముందుంటుంది. ఇంకొంచెం ముందుకుపోతే, ఇక అంతే- సముద్రంలో భాగమై పోవడమే. తప్పదు-వెనక్కి వెళ్లే అవకాశం కూడా ఉండదు. నదులు తమను తాము త్యాగం చేసుకోవాల్సిందే! కుల, మతాల, ప్రాంతీయ, జాతుల అస్తిత్వాన్ని కోల్పోవాల్సిందే! ఒక్కసారి మానవత్వపు సముద్రంలో కలిసిపోగానే భయం ఎగిరిపోతుంది సంకోచాలన్నీ ఇగిరిపోతాయి. ఆచార వ్యవహారాలన్నీ కరిగిపోతాయ్- సమానత్వం ఒక వైజ్ఞానిక భావన! ఏ నది ఏ దిశ నుండి వచ్చి కలుస్తే మాత్రం ఏమిటీ? హ్యూమన్ డిఎన్ఎ-అంతా ఒక్కటైనప్పుడూ? కంటికి కనిపించని డిఎన్ఏ-ఒక మహా సముద్రం. మానవ జాతి నదులన్నీ మానవత్వపు సంద్రంలో కలవక తప్పదు -

సముద్రమంటే సత్యం ! సముద్రమంటే జ్ఞానం!!
మానవ జీవితాలన్నీ నదులైతే,
మానవవాదం ఒక మహా సముద్రం -

ఇలా సింబాలిక్‌గా కాకుండా, నేరుగా సూటిగా చెప్పాడు ఉరుదూ కవి జఫర్ ఆజాద్

"జబ్ తక్ కరేగా యాద్ ఉస్ నాఖుదా కొ
ఆఖిర్ కబ్ తక్ దేఖేగా ఏ తస్ వీరే
ఇంతెజార్ మె ఎ జిందగీ బర్‌బాద్ మత్‌కర్
తోడ్ దే సభీ ఉస్కే ఇష్క్‌కి జంజీరే-'

(ఇంకా ఎంతకాలం దైవ విశ్వాసపు జ్ఞాపకాల్లో బతుకు నాశనం చేసుకుంటావూ
అతనితో ఉన్న అన్ని బంధనాల్ని తెంపేసుకో)

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

మెయిల్ @ నవతెలంగాణ

అధికారమా..ఆలోచించు!

నిండు ప్రయాణికులతో ఆకాశంలో ఎగురుతున్న విమానాన్ని సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత విమాన పైలెట్‌దే అయినా దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత గ్రౌండ్ కంట్రోల్ ఇంజినీర్లదే.అలాగే కిక్కిరిసిన ప్రయాణికులతో గమ్యాన్ని చేరుకుంటున్న ట్రెయిన్‌ని సురక్షితంగా స్టేషన్‌కి చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్‌దే అయినా సరైన పట్టాల మార్గాన్ని నిర్దేశించాల్సిన బాధ్యత స్టేషన్ మాస్టర్‌పైనే ఉంటుంది. ఈ రెండు సందర్భాల్లోనూ మార్గదర్శనం చేయాల్సిన అధికారులు ఏమైనా పొరపాట్లు చేసినా, లేదా అలసత్వం వహించినా, జరిగే పరిణామాల, ఫలితాలు అతి దారుణంగా వుంటాయి.చరిత్రలోనే ఇది తిరుగులేని సత్యం. ఇదంతా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే ప్రభుత్వంలో పాలకులు, అధికారుల బాధ్యత సమన్వయం అలాగే సహకారంతో కూడుకున్నది. సర్కార్‌ను నడిపేవారు సరిగ్గా లేకపోతే అధికారులు కూడా బాధ్యతారహిత్యంతో వ్యవహరిస్తారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో రాజకీయంగా చూస్తే చాలా ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. పదేండ్లుగా పాలన సాగించిన వారు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారి ప్రభుత్వంలోనే పనిచేసిన ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులు ఆ అవినీతి మరకలంటించుకున్నారు. ఒక్కోసారి పాలకుల అహంకార ధోరణికి కూడా అధికారులు విషమ పరిస్థితులను ఎదుర్కొనే వరకు తీసుకెళ్తారు అటువంటి పరిస్థితుల్లో అధికారుల కర్తవ్యమేమిటి? ఈ ప్రశ్నకు ప్రజల ఐఏఎస్‌గా పేరుపొందిన ఎస్.ఆర్.శంకరన్ జీవితంలో జరిగిన ఒక సంఘటన సమాధానమిస్తుంది. కర్తవ్యాన్ని బోధిస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శంకరన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న రోజుల్లో దళితులు,పేదవర్గాల ఉన్నతికి నిరంతరం శ్రమించాడు. ఆ రోజుల్లో తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్యం, వెట్టిచాకిరీ బలంగా ఉండేది. ఈ వ్యవస్థపై ఉక్కుపాదం మోపాడు శంకరన్. అప్పటికే అమలు పరచబడ్డ The Bonded Labour System (Abolition) Act-1976 గురించి పీడిత వర్గాల ప్రజల అవగాహన కల్పించాడు. వెట్టిచాకిరీ చేయవద్దని పిలుపునిచ్చాడు. వారిని ఆ వైపు ముందుకు సాగేలా ధైర్యాన్నిచ్చాడు. సంఘంలోని ఉన్నత వర్గాలకు ఇది మింగుడు పడలేదు. ఫలితంగా వారంతా ఉమ్మడిగా ఈవిషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి దఅష్టికి తీసుకువెళ్లారు. రాజకీయ కోణంలో ఈ విషయాన్ని పరిశీలించిన అప్పటి ముఖ్యమంత్రి శంకరన్‌ను తీవ్రంగా మందలించాడు. దీంతో ఆయన విధానంతో విభేదించిన శంకరన్ చట్టం అమలు విషయంలో తాను రాజీపడేది లేదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. అంతటితో ఆగక దీర్ఘకాలం సెలవు తీసుకున్నాడు. అదే సమయంలో ఆయన నీతి,నిజాయితీ, నిబద్ధతను గుర్తించిన త్రిపుర ముఖ్యమంత్రి శంకరన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సాదరంగా అహ్వానించాడు. అందుకు సమ్మతించిన శంకరన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధుల్లో చేరి ఆరేండ్లపాటు తన బాధ్యతలని సక్రమంగా నిర్వహించాడు. త్రిపుర ప్రజల మన్ననలనందుకున్నాడు. ఇనిన దశాబ్దాల తర్వాత కూడా ఆ రాష్ట్రంలో శంకరన్ గురించి తలచుకుంటున్నారంటే ఆయన పేదలకు చేసిన సేవ. అందుకే ఆయన పేదల ఐఏఎస్‌గా పేరుగాంచారు.

ఇక చర్చిస్తున్న విషయానికొస్తే కొద్దిమంది ఉన్నతాధికారులు (అందరూ కాదు) ప్రభుత్వ నిర్వహణలో తమ పాత్ర ఔన్నత్యాన్ని, తమ విద్యార్హతల గొప్పదనాన్ని మరిచిపోయి వివిధ కారణాల వల్ల పాలకులకు సరైన మార్గదర్శనం చేయలేక అభాసు పాలవుతున్నారు.పైన చెప్పుకున్నట్టు తర్వాత సంభవించే పరిణామాలకు బాధ్యులవుతూ చట్టపరమైన సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. అంతేకాదు, పరిస్థితులు ప్రతికూలించనప్పుడు "పాలకుల ఒత్తిళ్ల ప్రభావం వల్ల సరైన మార్గదర్శనం చేయలేకపోయామని" సంజాయిషీ ఇచ్చుకొంటున్నారు. మరికొన్ని సందర్భాల్లోనైతే తమది ఏమాత్రం తప్పు లేదని, తప్పంతా ఏలినవారిదేనని వాదిస్తున్నారు. ఇది ఎంతమాత్రం సమర్థనీయంకాదు. ఎందుకంటే ఒత్తిళ్లను కూడా తట్టుకొని, తప్పులు లేకుండా, సమర్థవంతంగా పనిచేస్తేనే కదా ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఒకవేళ పాలకులు మొండిగా మౌఖిక అదేశాలిస్తే వాటిని పాటించాల్సిన అవసరం లేదు. లేదంటే లిఖిత పూర్వక అదేశాలను కోరవచ్చు. అప్పుడు ఫలితాలకు ప్రధాన బాధ్యత అదేశాలిచ్చిన పాలకులదే. ఈ విధానం దేశానికి కూడా ఎంతో ప్రయోజనకరం.అందుకే శంకరన్‌లాంటి ఐఏఎస్‌ల్లా ముక్కుసూటిగా నడవాలి. ప్రజల కోసం అంకితభావంతో పనిచేయాలి.

- బసవరాజు నరేందర్‌రావు, 9908516549

'యూజీసీ' ప్రతిపాదనలు - విద్య కాషాయీకరణకు అడుగులు!



టి.నాగరాజు
9490098292

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విశ్వవిద్యాలయాలు, కళాశాలలో ఉపాధ్యాయులు అకాడమిక్ సిబ్బంది నియామకాలు, ప్రమోషన్స్ కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణ పేరుతో యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు-2025 పేరుతో జనవరి 6న ఒక డ్రాఫ్ట్‌ను విడుదల చేసింది. దీనిపై ఫిబ్రవరి 5నాటికి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుని నూతన మారదర్శకాలను తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ ముసాయిదాలోని యూజీసీ ప్రతిపాదనల్ని పరిశీలిస్తే రాజ్యాంగ విలువల్ని బలహీనపరిచే విధంగా ఉన్నాయి. భారతదేశ ఉన్నత విద్యారంగంలో ఇవి ప్రమాదకర సంకేతాలుగా కనిపిస్తున్నాయి. అంతేకాదు, ఫెడరలిజం, బహుళత్వం, విద్యా సమగ్రతలను దెబ్బతీసే విధంగా ఉన్నాయి. విద్యను మరింత కేంద్రీకరణ, కార్పొరేటీకరణ చేసే దిశగా బీజేపీ సర్కార్ విధానాల్ని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే కేరళ, తమిళనాడు వంటి ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు వీసీల నియామకంపై గవర్నర్లతో విభేదాలున్నాయి. ఇప్పుడు సవరించిన నిబంధనలతో వీసీల ఎంపిక ఛాన్సలర్‌గా ఉన్న రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాల్ని అందిస్తున్నాయి. ఇది సమాఖ్య స్ఫూర్తి ఖూనీ అవడానికి, తమ భావజాల వ్యక్తులను నియమించుకోవడానికి దోహదం చేసే అవకాశాలున్నాయి. ఫెడరలిజం ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించడమే కాదు, విద్యలో రాష్ట్రాల హక్కులను, స్వయం ప్రతిపత్తిని అణిచేసే విధంగా ఉన్నాయి.పూర్తిగా కేంద్రం చెప్పుచేతల్లో ఉండి నిర్ణయాధికారం చేసే ప్రతిపాదనలు సిద్ధం కాబోతున్నాయి!

భారత రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య యూజీసీ నిబంధనల ద్వారా కేంద్రం రాష్ట్రాల హక్కులను లాక్కొంటుంది. నూతన జాతీయ విద్యావిధానం-2020ని అమలు చేయడం ద్వారా ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న రాష్ట్రాల్లోనూ ఇది బలవంతంగా అమలు చేసే కుట్రక్కూడా తెరలేపుతుంది. ఇప్పటికే తమిళనాడు, కర్నాటక, కేరళ లాంటి రాష్ట్రాలు ఎన్‌ఈపిని అమలు చేయకుండా రాష్ట్ర విద్యావిధానంతో ముందుకు సాగుతున్నాయి. ఈ నిబంధనల పేరుతో విద్యా సంస్థలను, నియామకాలను గ్రేడింగ్‌చేసే విధానాన్ని ముందుకు తీసుకొస్తుంది. ఎన్‌ఈపీకి లింక్‌చేసి రాష్ట్రాలను వారి ప్రాంతీయ ప్రాధాన్యతలు, భాషాహక్కులు, విద్యాతత్వాలకు విరుద్ధమైన విధానాలను అచరించేలా యూజీసీ బలవంతం చేస్తుంది. ఇది సమాఖ్య సూత్రాలను తిలోదకాలిచ్చే విధానాలకు పూనుకుంటుంది. ఎన్‌ఈపి అమలులో భాగంగా కేంద్రం తీసుకున్న నాలుగేండ్ల డిగ్రీ కార్యక్రమం అమలు చేయడానికి తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాలు నిరాకరిస్తున్నాయి. ఎందుకంటే ఈ విధానం ద్వారా అందరికీ సరిపోయే సమాన విద్యను అందించేందుకు సాధ్యం కాదు. మనదేశంలో విభిన్న సామాజిక, రాజకీయ, భాషా, సాంస్కృతిక సందర్భాలు ఒక్కటిగా లేవు. అందుకే ఇది విద్యను బలవంతంగా కేంద్రీకరించి, వారు తీసుకొస్తున్న విధానాలను రాష్ట్రాలపై రుద్దడమనేది ఈ నిబంధనల్లో ఉంది. ఇది ఉన్నత విద్యనుండి పేదలను దూరంచేసే కుట్ర తప్ప వేరేకాదు. అంతేకాదు, విద్యా కేంద్రీకరణ వల్ల కేంద్రం పెత్తనం పెరిగి అసమానతలకు దారితీసే అవకాశమూ లేకపోలేదు.



ముసాయిదాలో స్పష్టతలేని అంశాలు

మరోపక్క విద్యను మరింత కార్పోరేటీకరణ చేసేందుకు పరిశ్రమల నుండి నిపుణులను, ప్రభుత్వరంగ అనుభవజ్ఞులను వైస్ ఛాన్సలర్స్‌గా తీసుకురావాలనే ప్రతిపాదన ఉన్నతవిద్యలో ప్రమాదకరమైన కార్పోరేటీకరణను సూచిస్తుంది. ఈ నిబంధన విద్యారంగంలో కార్పోరేట్ సంస్కృతిని పరిచయం చేసి అకాడమిక్ అర్హత పరిశోధన అంశాల ప్రచురణ, భోదన అనుభవం లాంటి అంశాలకు ఎలాంటి క్రెడిట్ ఇవ్వదు. పరిశోధనల నుండి ప్రభుత్వం తన భాధ్యతలను ఉపసంహరించుకుని "ఏంజెల్ లేదా వెంచర్ ఫండ్స్" పేరుతో వివిధ ప్రయివేటు, కార్పోరేట్ వ్యక్తులకు విద్యలోకి మార్గం సుగమం చేస్తుంది. ఇది మొత్తం విద్యా వ్యవస్థను మార్కెట్‌మయం చేస్తుంది. అసలు "ఏంజెల్ లేదా వెంచర్ ఫండ్స్" అంటే ఏమిటి అనేది కూడా ఈ ముసాయిదాలో స్పష్టత లేదు. ఉపాధ్యాయులను రిక్రూట్ చేసే క్రమంలో రిజర్వేషన్ల గురించి కూడా ఈ ముసాయిదాలో కనీస ప్రస్తావన లేదు. ఈ నిర్ణయాలతో "ఆధునీకరణ" ముసుగులో యూజీసీ విద్యాసంస్థల పగ్గాలను టెక్నో క్రాట్లు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ చేయడానికి ఈ ప్రతిపాదనలు పూనుకుంటాయి.ఈ నిబంధనల్లో "ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్" (ఐకెఎస్)ను ప్రమోట్ చేయాలనే పేరుతో విద్యలో సంఘ్‌పరివార్, సంస్కృతి ఆధిపత్యాన్ని అమలుచేసే కుట్ర దీనిలో దాగి ఉంది.

పెరగనున్న అసమానతలు

ఈ నిబంధనల్లో విద్యాసంస్థలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నియామకాల్లో రిజర్వేషన్స్ గురించి ప్రస్తావన లేదు. నేడు విద్యారంగంలో పెరుగుతున్న ప్రయివేటీకరణ మూలంగా అట్టడుగు వర్గాలకు విద్య అందుబాటులో ఉండటం లేదు. వారికి విద్యనందించేందుకు సంస్కరణలుండాలి కానీ వారిని మరింత దూరం చేసే విధంగా ఈ నిబంధనలున్నాయి. ఐఐటి వంటి సంస్థల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు, కుల ఆధారిత వివక్ష, ఆర్థికంగా బలహీన వర్గాలు, వైకల్యాలున్న విద్యార్థులను చేర్చుకునే నిబంధనలున్నప్పటికీ అమలు కావడం లేదు. నియామకాలు, ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులను వ్యవస్థాగతంగా మినహాయిస్తూ ఈ ఖాళీలను భర్తీ చేయకుండా వదిలేస్తున్నారు. యూజీసీ ప్రతిపాదించిన నిబంధనల్లో ఈ అంశానికి సంబంధించి ప్రమోషన్ల విషయంలో క్లాజ్ 38లో భోదన, పరిశోధనపై ప్రత్యక్ష సంబంధం లేని కార్యకలాపాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు లేకుండా విస్మరిస్తూ విద్యారంగంలో సవరణ అధిపత్యాన్ని కొనసాగిస్తుంది. ఇప్పటికే అడ్మిషన్లు, నియామకాలు, విద్యార్థుల సంక్షేమంలో కులవివక్ష లేకుండా జవాబుదారీతనం ఉండేలా ప్రతిపాదనలు చేయడంలో యూజీసీ విఫలమైంది. విద్యాసంస్థల్లో రోహిత్ వేముల వ్యవస్థీకృత హత్యలాంటి ఘటనలు జరగకుండా, చర్యలు తీసుకోకుండా, సమస్యలు పరిష్కరించడానికి బదులుగా పరిశోధన ప్రాధాన్యతలను నిర్లక్ష్యం చేస్తున్నది. పైగా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను, ఉద్యోగాలకు సాంకేతిక వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచాలనే పేరుతో కార్పోరేట్ ప్రపంచానికి సిద్ధం చేయడానికి "కార్పొరేట్ ఫినిషింగ్ స్కూల్" నమూనాను రూపొందిస్తున్నది. ఇది మరింత అసమానతలను పెంచి ఇలాగే కొనసాగేలా చేస్తుంది. ఇది పనిభారం పెంచడానికి, ఉద్యోగాలను తగ్గించే ఒక ప్రమాదకరమైన వ్యూహానికి తోడ్పడుతుంది.

> ఇప్పటికే అడ్మిషన్లు, నియామకాలు, విద్యార్థుల సంక్షేమంలో కులవివక్ష లేకుండా జవాబుదారీతనం ఉండేలా ప్రతిపాదనలు చేయడంలో యూజీసీ విఫలమైంది. విద్యాసంస్థల్లో రోహిత్ వేముల వ్యవస్థీకృత హత్యలాంటి ఘటనలు జరగకుండా, చర్యలు తీసుకోకుండా, సమస్యలు పరిష్కరించడానికి బదులుగా పరిశోధన ప్రాధాన్యతలను నిర్లక్ష్యం చేస్తున్నది. పైగా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను, ఉద్యోగాలకు సాంకేతిక వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచాలనే పేరుతో కార్పోరేట్ ప్రపంచానికి సిద్ధం చేయడానికి "కార్పొరేట్ ఫినిషింగ్ స్కూల్" నమూనాను రూపొందిస్తున్నది. ఇది మరింత అసమానతలను పెంచి ఇలాగే కొనసాగేలా చేస్తుంది. ఇది పనిభారం పెంచడానికి, ఉద్యోగాలను తగ్గించే ఒక ప్రమాదకరమైన వ్యూహానికి తోడ్పడుతుంది.

విద్య రాష్ట్ర జాబితాలోనే ఉండాలి

కేంద్రం ఇప్పటికే జాతీయ నూతన విద్యావిధానం -2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది. విద్య కేంద్రీకరణ, కార్పోరేటికరణ, వ్యాపారీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తున్నది. ఈ విద్యావిధానానికి సంబంధించి రూపకల్పన విషయంలో నియంత్రణ అవసరం. అలాగే రాష్ట్రాల జాబితాలోనే విద్య ఉండటమనేది ప్రాధాన్యతగా ముందుకు రావాల్సిన అంశం. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు, కేరళ రాష్ట్రాలు విద్యపై చేస్తున్న కృషి అందరికీ ఆదర్శం. ఇదే సందర్భంలో ఈ రాష్ట్రాలపై గవర్నర్లతో విద్యావ్యవస్థపై ఎంతదాడి జరుగుతుందో చూస్తున్నాము. వాస్తవానికి రాష్ట్రాలు తమ ప్రత్యేక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థికాంశాలకు అనుగుణంగా విద్యావిధానాలు రూపొందించుకోవాలనే ప్రాముఖ్యతను రాష్ట్రాలు నొక్కిచెబుతున్నాయి. యూజీసీ ముసాయిదా పేరుతో తీసుకుంటున్న ఈ చర్యలు పరిపాలనపరమైన సమస్య కాదు, ఇది భారత రాజ్యాంగ నిర్మాణంపై దాడిగా చూడాలి. ఇప్పటికే రాష్ట్రాలు విద్యలో తమ హక్కులు తిరిగిపొందేందుకు, విద్యలో స్వయం నిర్ణయాధికారం, విద్యా స్వతంత్రతను కోరుకుంటున్నాయి. భారతదేశంలో విశ్వవిద్యాలయాలు సైద్ధాంతిక నియంత్రణ, కార్పోరేట్ శక్తులకు లాభదాయక సాధనాలుగా, హిందూత్వ ప్రచార సాధనాలుగా మారకుండా ఉద్యమించాలి. ఉన్నత విద్యను కాపాడుకునేందుకు విద్యావేత్తలు, విద్యార్థులు యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరమైతే ఉన్నది.

రూ 1.10 లక్షల విలువచేసే శవపేటిక వితరణ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో వల్లాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్ తల్లిదండ్రులు తాటికొండ నారాయణ, గౌరమ్మల జ్ఞాపకార్థం వల్లాపురం, అమ్మపేట గ్రామపంచాయతీలలో మృతదేహాలను భద్రపరుచు ఏసి బాక్స్, ప్రజల సౌకర్యార్థం వారి కుమారులు అనంతయ్య, రమేష్, వెంకటేశ్వర్లు (తాటికొండ బ్రదర్స్) రూ.1,10 వేలు విలువ గల శవపేటిక (ఫ్రీజర్)ను వితరణ చేయగా తహసీల్దార్ కె.సునీతఎల్జిబెత్, ఎంపిడిఓ ఎస్.శ్రీధర్ స్వామి సమక్షంలో గ్రామపంచాయతీ కార్యాలయంకు గురువారం అందజేశారు. గ్రామపంచాయతీలకు ఫ్రీజర్‌ను అందజేసిన తాటికొండ బ్రదర్స్‌ను ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తాటికొండ విజయ, ఆర్ఐ పి.ప్రసన్నకుమార్, గ్రామపంచాయతీ సెక్రటరీ గజ్జెల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో రూ.24.55 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టరాగమయి గురువారం శంకుస్థాపన చేశారు. క్యాటిన్ షెడ్‌కు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గొల్లగూడెం నాయకులు, మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు

నవతెలంగాణ-కొణిజర్ల/ఏన్కూర్



ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు డిమాండ్ చేశారు. గురువారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆశావర్కర్లతో కలిసి స్థానిక వైద్య బృందానికి, వైద్యాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశా వర్కర్లు శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను ఆశా కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బానోత్ అమల, మండల కార్యదర్శి పి.అనురాధ, స్వాతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్ మూవీకి అడ్వాన్స్ బుకింగ్ లేనివాళ్లు రావద్దు

- నగర ఏసీపీ రమణమూర్తి

నవతెలంగాణ-ఖమ్మం



'గేమ్ ఛేంజర్' సినిమా శుక్రవారం రిలీజ్‌కు అవుతున్న నేపథ్యంలో ఉదయం 4 గంటలకు సినిమా ఎక్స్‌ట్రా షో సంబంధించిన ఆన్‌లైన్ టిక్కెట్లు లేకుండా సినిమా థియేటర్ల పరిసరాలలోకి ఎవరు రావద్దని ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాదు థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలలో భాగంగా టిక్కెట్లు లేని వారిని థియేటర్లు పరిసరాలకు అనుమతించడం లేదని, అదేవిధంగా థియేటర్లు వద్ద బాణసంచా కాల్చడం నిషేధమని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణానికి ప్రజలు, సినీ అభిమానులు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



జాతీయ స్థాయికి 'త్రివేణి' విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 7 నుండి 9 వరకు మూడు రోజుల పాటు జద్చర్ల పోలేపల్లి సెజ్ ఎన్ఎంఐఎంఎస్ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థి మిల్లెట్స్ ఆవశ్యకత అనే అంశం పై సెమినార్‌లో 9వ తరగతికి చెందిన హరిచందన రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ బహుమతిని జద్చర్ల ఎంఎల్ఏ జనంపల్లి అనిరుధ్ అందజేశారు. విద్యార్థిని జిల్లా సైన్స్ అధికారి జగదీష్, జిల్లా ఎన్సీఎస్సీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, త్రివేణి స్కూల్ సెంట్రల్ సైన్స్ ఆఫీసర్ సుబ్బారావు, గైడ్ టీచరు షరీఫ్, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్ ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మండల కేంద్రంలో రైతు దీక్ష

- తెలంగాణ రైతు సంఘం పిలుపు

నవతెలంగాణ-కూసుమంచి

వ్యవసాయ పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్- హర్యానా సరిహద్దులోని ఖనేరీ లో 45 రోజుల నుండి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జత్ సింగ్ దాల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని కోరుతూ... రైతునేతకు మద్దతుగా నేడు (శుక్రవారం) మండల కేంద్రంలో ఒక్కరోజు రైతు దీక్ష చేపడుతున్నట్టు తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బిక్కసాని గంగాధర్, తోటకూరి రాజశేఖర్ గురువారం ఒక ప్రకటన తెలియజేశారు. ఈ రైతు దీక్షకు రైతులు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.



ఏపీఎంగా బీరవల్లి రాంబాబు బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-కల్లూరు

ఐకెపి ఏపీఎంగా బీరవల్లి రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఏపీఎం వెంకట్రామారావు బదిలీపై ఏన్కూర్ వెళ్ళగా మదర్‌లో ఏపీఎంగా పనిచేస్తున్న బీరవల్లి రాంబాబు కల్లూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ మహిళా సంఘాలలో ఐక్యతను నిలుపుతానన్నారు. సిబ్బంది సైతం విధులు పట్ల శ్రద్ధ వహించేలా కృషి చేస్తానని తెలిపారు.

భూక్యా వీరభద్రంను అభినందించిన తాండ్ర పెద్ద బ్రహ్మాం

- పార్టీ అభివృద్ధికి విరాళం అందజేత

నవతెలంగాణ-వైరాటౌన్




ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమంలో భాగంగా గురువారం వైరా మున్సిపాలిటీ ఆ పార్టీ సీనియర్ నాయకులు, వైరా మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తాండ్ర పెద్ద బ్రహ్మాం పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రంకు స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంటింటి సిపిఐ(ఎం) కార్యక్రమంలో భాగంగా తాండ్ర పెద్ద బ్రహ్మాం, అనసూర్యమ్మ దంపతులు 1000 రూపాయలు విరాళం అందజేసి పార్టీ అభివృద్ధిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, భూక్యా విజయ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ ఇవ్వని ప్రభుత్వాలు

- వడ్ల బోనస్ కూడా పడటం లేదు
- అన్నదాతల ఆవేదన

నవతెలంగాణ-ముదిగొండ



దేశానికి అన్నం పెట్టే రైతన్నకు వెన్నుదన్నుగా ఉండాల్సిన ప్రభుత్వాలు, రైతన్న వెన్ను విరిసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన విధానాలు ఆచరణలో ఆమోదయోగ్యంగా లేవని రైతుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆమోదంతో ఆయా ప్రాంతాలలో రైతులకు సర్వీస్ అందిస్తున్న బ్యాంకులలో రుణాలు తీసుకున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ మాఫీ శాతాన్ని రైతుల ఖాతాలో జమ చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ మాఫీ 4 శాతం. సుమారు నాలుగు సంవత్సరాల నుండి రైతులకు అందటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ మాఫీ 3 శాతం. ఆ నిధులు కూడా అన్నదాతలకు చేరటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే వడ్డీ మాఫీ శాతం నిధులు అందక రైతులు ఆందోళన పడుతున్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో వడ్డీ మాఫీ శాతం నిధులకు కొర్రీలు పెట్టింది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా కెసిఆర్ ప్రభుత్వం వెంట నడిచింది. కెసిఆర్ ప్రభుత్వంపై ప్రజలు, రైతుల్లో వ్యతిరేకత పెరిగి ప్రభుత్వాన్ని గద్దె దించటంతోపాటు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల అమల్లో మాటల ఘణం,ఆచరణ శూన్యమన్నట్టు పథకాల పరిస్థితి కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, పూర్తిస్థాయిలో ఏ గ్యారెంటీని అమలు చేయలేదని ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుంది. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం కంటి తుడుపు చర్యగానే వ్యవహరించిందని రైతుల్లో సర్వత్ర నిరసన వ్యక్తమవుతుంది. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశలో కొంతమంది రైతులకు బోనస్ అందించింది. రెండో దశలో వడ్ల బోనస్ పడటం లేదని రైతులు చెప్తున్నారు. రూ.రెండు లక్షల లోపు, ఆపైన ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఎస్బిఐ, డిసిసిబి (సొసైటీ)లలో అధిక మొత్తంలో ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదు. రైతుల రుణమాఫీ జాబితాను తప్పులు తడకగా చేసి ప్రభుత్వానికి అందించడంలో బ్యాంకుల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శలున్నాయి. ఆడిట్‌ను సక్రమంగా చేయకుండా, రైతు రుణమాఫీ జాబితాను ప్రభుత్వానికి అందించి బ్యాంకుల అధికారులు తప్పిదం చేశారని వాదనలు వినపడుతున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం, రైతు రుణమాఫీని నాలుగు దశలుగా అమలు చేసిన మండలంలో వివిధ బ్యాంకుల్లో రూ.2 లక్షలు మాఫీ కాకుండా పెండింగ్‌లోనే ఉండటం విశేషం. రెండు లక్షలు, ఆపైన ఉన్న రైతులు రుణమాఫీ కోసం చిక్కుల్లో పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వీస్ అందించే (ఎఫ్ఎసిఎస్) యడాప్ట్ బ్యాంకులు 18 ఉన్నాయి. వీటిలో ఆయా సర్వీస్ బ్యాంకుల పరిధిలో ఉన్న మండలాల్లో వివిధ గ్రామాల్లో రైతు రుణమాఫీలో కొందరు రైతులు ఆధార్, పాస్ బుక్కులలో రైతుల పేర్లు, ఇంటి పేరులలో తప్పులు,సరి చేయకుండా ఆడిట్ పూర్తయిన రైతుల పేర్ల జాబితాను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో అప్లోడ్ చేయకపోవడం, మొదట్లో తీవ్ర జాప్యం జరిగిందని, అందువల్లనే రైతు రుణమాఫీ పూర్తిగా జరగలేదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వర్షాకాలం పంటల సీజన్ ముగియటంతో రుణమాఫీ కానీ రైతులు బ్యాంకులు,కలెక్టరేట్,వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రుణమాఫీ అయిన రైతులకు బ్యాంకుల నుండి నూతనంగా రుణాలు అందటం లేదని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఎసిఐ ఉన్న బ్యాంకులో రైతులకు రుణమాఫీ కాలేదు. కమర్షియల్ బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తే తప్ప,రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మనగడి కష్టదాయకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రూ.2 లక్షల రుణమాఫీ కానీ రైతులకు మాఫీతోపాటు, రైతు భరోసా, మహిళలకు 2,500 వ్యవసాయ కార్మికులకు 12 వేలు, పెన్షన్స్ పెంచి అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రభుత్వానికి ఎదురుగాలి తప్పదు.

నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేయాలి

- తొలి ఏడాది 11 వేలకు పైగా పోస్టులు భర్తీ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలోని డైట్ కళాశాల ద్వారా నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేసి సమాజానికి అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఏడవ డివిజన్ టేకులపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటివ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 70 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యను అభివృద్ధి చేయలేక పోయామని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని, దీనివల్ల అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని తెలిపారు. జీవితంలో ఎదిగి ఒక స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఒక ఉపాధ్యాయుడు మార్గం చూపే ఉంటారని మంత్రి అన్నారు. మనం ప్రస్తుతం మంత్రులుగా, ఉన్నతాధికారులుగా ఉండటానికి మన గురువులు మూలమని అన్నారు. ప్రస్తుత డైట్ కళాశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప టీచర్లుగా తయారు కావాలని అన్నారు. నైపుణ్యత ఉన్న ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల విద్యా ప్రాముఖ్యత, ప్రమాణాలు తగ్గుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో పిల్లలకు పూర్తి పరిజ్ఞానంతో సంపూర్ణ విద్య అందించేలా డైట్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు బయటకు రావాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి సంవత్సరం ఖాళీ అవుతున్న టీచర్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తి చేస్తామని అన్నారు. డైట్ కళాశాల కాంపౌండ్ గ్రీనరీతో పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలని అన్నారు. డైట్ కళాశాలలో ఎటువంటి మొక్కలు నాటాలో ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థుల సహకారంతో గ్రీనరీ పెంచాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల శ్రేయస్సు కోసం సమన్వయంతో పని చేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి. శ్రీజ మాట్లాడుతూ ప్రస్తుత యువతలో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గుతుందని, ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారు అయ్యారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని ప్రోత్సహించాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా డైట్ కళాశాల పరిపాలన భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం మంచి పరిణామం అని అన్నారు. భవిష్యత్తు తరాల పిల్లలను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డిఈఓ సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్ వే, జాఫర్ బావి అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్ బావి పునరుద్ధరణతో పాటు, పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్ వే ఏర్పాటుకు కలెక్టర్ ఖిల్లా మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి ఖిల్లా పైకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే ఏర్పాటుకు అనువుగా ఉండే మార్గం, ఎక్విప్మెంట్, ఖమ్మం ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాటుపై పరిసరాలను తిరిగి కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జాఫర్ బావిని, బావి వైపు జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ డా. శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖిల్లాపై పర్యాటకులకు ఆహ్లాదం కలిగే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, అర్బన్ తహసీల్దారు రవికుమార్, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగించుకోండి

- అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-కల్లూరు



నిరుపేద కుటుంబాల్లో జన్మించే శిశువులకు పోషక లోపాలను సరి చేయటం కోసమే అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి పోషకాహార అందించడమే లక్ష్యంగా అంగన్ అంగన్వాడి కేంద్రలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మండల పరిధిలోని పుల్లయ్య బంజర ఒకటవ అంగన్వాడి కేంద్రానికి నూతన భవనం రూ.10.50 లక్షలు నిర్మించగా గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లయ్య బంజర, కప్పల బంధం, బత్తులపల్లి, గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు 5.40 లక్షలు రూపాయలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి అంగవైకల్యం లేకుండా ఎలాంటి లోపాలు రాకుండా గర్భిణీ స్త్రీల దగ్గర నుండే పోషక ఆహారాన్ని అందించి చిన్నారులను ఆరోగ్యంగా జీవించేందుకు అంగన్వాడి సెంటర్లు దోహదపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఏసిడిపిఓ రత్నమ్మ, కల్లూరు సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అంగన్వాడీ సిబ్బంది ఎమ్మెల్యే రాగమయిని, ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజా దేవిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరి, తహసిల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర రావు, ఏసిడిపిఓ మెహ్రూనిస్సా బేగం, ఎస్సై హరిత, పంచాయతీరాజ్ ఏఈ రాజా, గ్రామ కార్యదర్శి సుధారాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు, భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, బత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి-ప్రాణదాతలు కండి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం



ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి ప్రాణదాతలుగా మారాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ అన్నారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్ అధ్యక్షతన భగత్ సింగ్ బ్లడ్ డోర్స్ క్లబ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ భగత్ సింగ్ బ్లడ్ డోర్స్ క్లబ్ ద్వారా 4 వేల మందికి రక్త దానాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ రక్త దానం కార్యక్రమం 2017 మార్చి 23న భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రారంభించామని, సుమారు 8 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా 4 వేల మందికి రక్తదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించామని, దీనికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు భగత్ సింగ్బడ్ డోన్స్ క్లబ్‌కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. దీన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించేందుకు అందరు సహకారం కావాలని అన్నారు. భగత్ సింగ్ బ్లడ్ డోన్స్ క్లబ్ కన్వీనర్ కో కన్వీనర్లు రావులపాటి నాగరాజు, కొంగర నవీన్ మాట్లాడుతూ అడిగిన వెంటనే రక్తదానం చేసిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఒక ఖమ్మం జిల్లాలోనే కాక ఇతర జిల్లాలో హైదరాబాదు లాంటి చోటు కూడా రక్తం అందించామని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఎవరు రక్తమడిగిన అందించామని అన్నారు. భవిష్యత్తులో అందరు సాయంతో దీన్ని ముందుకు తీసుకెళ్తామని, అందరి సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాగరాజు, కొంగర నవీన్, సత్తెనపల్లి నరేష్, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఊర్లకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలి

- పండుగ నేపథ్యంలో మరింత పోలీస్ పహారా
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం



సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పోలీస్ పహారా మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రజలు సైతం తమకు సహకరించాలని కోరారు. ఊరికి వెళ్లే ప్రజలు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు విలువైన వస్తువులను తమ వెంట తీసుకుని వెళ్లాలని లేదా.. బ్యాంకు లాకర్‌లో అయినా దాచి పెట్టుకోవాలని సూచించారు. దొంగతనాల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, రాత్రి వేళల్లో వీధుల్లో పెట్రోలింగ్, బీట్ గస్తీ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.. దొంగతనాల నివారణకు రాత్రిపూట కాలనీలతో పాటు కమిషనరేట్ పరిధిలోని బస్టాండ్, ఆటో అడ్డా, రైల్వే స్టేషన్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించామని తెలిపారు.



అమరజీవి కాజా రాధాకృష్ణమూర్తి వర్ధంతి సభ

నవతెలంగాణ-వైరాటౌన్

వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కాజా రాధాకృష్ణమూర్తి 18వ వర్ధంతి సభను వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడు గ్రామంలో సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి గుమ్మా నరసింహారావు అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మల్లెంపాటి రామారావు కాజా రాధాకృష్ణమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ నాయకులు కిన్నెర మోతీ కాజా రాధాకృష్ణమూర్తి స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కాజా రాధాకృష్ణమూర్తి కొరియర్‌గా, బోడేపూడి వెంకటేశ్వరావు ప్రధాన అనుచరుడిగా పని చేశారని కొనియాడారు. కాజా రాధాకృష్ణమూర్తి నిబద్ధత, గొప్పతనాన్ని గురించి, కమ్యూనిస్టు పార్టీ విలువలను, నేటి సామాజిక పరిస్థితులను, ముంచుకొస్తున్న మతోన్మాదం ప్రమాదాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, వైరా పట్టణ కమిటీ సభ్యులు కొంగర సుధాకర్, ఇమ్మడి సుదీర్, శాఖా కార్యదర్శి గుమ్మా నరసింహారావు, కామినేని రవి, పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యా సాగర్‌రావు, దెవబత్తిని నరసింహారావు, పుచ్చకాయల కృష్ణ ఇమ్మడి వీరభద్రం, పుచ్చకాయల వెంకటేశ్వర్లు కాజా కృష్ణ, సంక్రాంతి కృష్ణమూర్తి, దుద్దుకూరు వీరమ్మ, ఆర్.విజయ, పి.వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, పాపకంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రవి మరణం బాధాకరం

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని అరేంపుల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) కార్యకర్త పెరుమళ్ళపల్లి రవికుమార్(52) మరణం చాలా బాధాకరమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. రవి కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. రవికుమార్ మృతదేహంపై జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడారు. చురుకైన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. రవి విద్యార్థి, యువజన సంఘాల్లో చురుకుగా పని చేశాడన్నారు. అనేకమంది యువతీ, యువకుల స్కాలర్షిప్ సమస్యల పరిష్కారం చేయటం, హాస్టల్స్‌లో చేర్పించుట, ప్రైవేట్ కాలేజీలలో ఫీజులు తగ్గించటం ఇలా అనేక సమస్యలపై పని చేశాడని తెలిపారు. జర్నలిస్టుగా కూడా సేవలు అందిస్తూ అనారోగ్యంతో రవి మరణించడం బాధాకరమన్నారు. రవి తండ్రి ఇసాకయ్య అరేంపుల సర్పంచ్ గా, అన్న పెరుమళ్ళపల్లి మోహన్‌రావు ఖమ్మం రూరల్ జడ్పీటీసీగా పనిచేసిన చరిత్ర వారి కుటుంబానికి ఉందన్నారు. రవి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. మృతునికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. రవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా నాయకులు బండి రమేష్, వై.విక్రమ్, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, బుగ్గవీటి సరళ, భూక్య వీరభద్రం, మెరుగు సత్యనారాయణ, ఉరడీ సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, మడుపల్లి గోపాలరావు, నందిపాటి మనోహర్, నందిగామ కృష్ణ,షేక్ నాగుల్‌మీరా, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పెండ్యాల సుమతి, పాపిట్ల సత్యనారాయణ, వల్లూరి సీతారాంరెడ్డి, రవి తదితరులు ఉన్నారు.



హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్

• వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను విస్మరిస్తూ పాలన సాగిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలోని పాటివారిగూడెంలో బుధవారం ఉపాధిహామీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని, మహిళలకు నెలకు 2500 రూపాయలు అందజేస్తామని, పేదల ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని, స్థలం లేని వారికి ఇల్లు నిర్మించి ఇస్తామని, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని, అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని, రైతుబంధు రెండు విడతల్లో ఎకరాకు 15 వేలు అందజేస్తామని ఇలాంటి ఎన్నో వాగ్దానాలు చేసి, అధికారం చేపట్టాక హామీలు అమలు చేయకుండా మేనమేషాలు లెక్కేస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయకపోతే రైతులు, కార్మికులను సమీకరించి పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఉపాధి హామీ కార్మికులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమ్మరి నాగమణి, వీరమ్మ, చెరుకూరి రామకృష్ణ, అనంతనేని వీరయ్య, చెరుకూరి వెంకట నరసయ్య, జంగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ - బోనకల్



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఈ ప్రచారాన్ని పార్టీ మండల కార్యదర్శి కిలారు సురేష్ లాంచనంగా ప్రారంభించారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, మహిళలకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారికి రూ.12,500 ఇవ్వాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం కోసం అనేక హామీల వర్షం కురిపించిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు మినహా ఏ హామీలను అమలు చేయడం లేదన్నారు. హామీలను అమలు చేయకుండా రోజుకు ఒక ప్రకటనతో ప్రజలలో ముఖ్యమంత్రి, మంత్రులు గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశం ఉందన్నారు. సిపిఎం క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన ప్రజా సమస్యల ఆధారంగా ఆరు నెలల పాటు ప్రజా పోరాటాలు, ఆందోళనలు నిర్వహించనున్న ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గుగులోత్ పంతు సిపిఎం మండల కమిటీ సభ్యులు దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్, సభ్యులు లావూరు వెంకటేశ్వర్లు అజ్మీర గోపి మాజీ ఎంపీటీసీ తాళ్లూరి బాబు, సిపిఎం నాయకులు ఎర్రగాని నాగరాజు, నన్నే సాహెబ్, లావూరి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తానని ఘరానా మోసం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఎర్రుపాలెం మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి పుల్లారెడ్డి విదేశాల పేరుతో ఘరానా మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. పలువురు యువకుల నుండి డబ్బులు వసూలు చేసి ముఖం చాటేశాడు. బాధితులు తెలిపిన వివరాల మేర కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడు గ్రామానికి చెందిన వంగల శ్రీనివాసరావు, అదే మండలానికి చెందిన చింతలనర్వ గ్రామ నివాసి ఎనమద్ది రవితేజలను లక్కిరెడ్డి పుల్లారెడ్డి విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పరిచయం చేసుకుని ఒక్కొక్కరి వద్ద నుండి సుమారు నాలుగు లక్షల రూపాయలు పుల్లారెడ్డి తన అకౌంట్‌కి నెఫ్ట్ ద్వారా (ఎర్రుపాలెం ఎస్బిహెచ్) బ్యాంకు ఎకౌంటుకు డబ్బులు జమ చేయించుకున్నాడు.తాత్కాలిక 15 రోజులు పాస్ పోర్టు ఇచ్చి అల్మేనియా పంపించడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అయిన శ్రీనివాసరావు ఎట్టకేలకు ఇండియా చేరుకున్నాడు. వీరిద్దరే కాకుండా పలువురి వద్ద నుండి ఇదే రీతిగా విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసినట్లు తెలిపారు. ఆంధ్రలో వసూళ్లకు పాల్పడిన లక్కిరెడ్డి పుల్లారెడ్డి పై బాధితుల ఫిర్యాదు మేరకు ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ వెంకటేష్ విచారణ చేస్తున్నట్లు తెలిపారు

మందలపు సుబ్బారావుకు మంత్రి తుమ్మల నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామంలో గురువారం జరిగిన స్వర్గీయ మందలపు సుబ్బారావు దశదిన కార్యక్రమంలో వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సుబ్బారావు చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పించారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. టీజీఐడీసీ ఛైర్మెన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సుబ్బారావు దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు (ఎన్నీ), చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, శివా వేణుబాబు, ఇమ్మనేని ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం పాల్గొన్నారు.

తల్లి జ్ఞాపకార్థం తనయుని దాతృత్వం

- సత్తుపల్లి పాతసెంటర్ యూపీఎస్‌కు

రూ. 5లక్షలు ప్రకటించిన డాక్టర్ దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తనతల్లి ఆరోగ్యమ్మ జ్ఞాపకార్థం సత్తుపల్లి పట్టణంలోని పాతసెంటరు యూపీఎస్‌కు రూ. 5లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆరోగ్యమ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ తాను పాఠశాలకు ప్రకటించిన రూ. 5లక్షలు పాఠశాల పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. వాటిద్వారా వచ్చే వడ్డీ డబ్బుతో పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవచ్చని పాఠశాల యాజమాన్య బాధ్యులకు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, కమల్‌పాషా, మానుకోట ప్రసాద్, విజయసారధిరెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

గిరిజన గురుకులలో అవుట్ సోర్సింగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరిపించాలి

• ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం



గిరిజన గురుకుల విద్యాసంస్థలలో అవుట్ సోర్సింగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు సాయి శేషు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాలలో అవసరం లేకున్నా, అవసరం ఉందనే పేరుతో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పెషి ద్వారా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను సృష్టించి అక్రమంగా నియమించారని, ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలకు జరిగాయని, కోట్లాది రూపాయల డబ్బులు చేతులు మారాయని, ఈ అక్రమాలపై సమగ్రమైన విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థలలో ఔట్ సోర్సింగ్ పేరుతో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు భర్తీ చేశారని, గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆర్.సి.నెం:ఏ1/1217/2024 నవంబర్14వ తేదీన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో నియామకాలను చేశారని అన్నారు. సాధారణంగా ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ఏదైనా ఒకశాఖలో ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు నియమకాలను జరపాలంటే అనుమతి పొందిన ఏజెన్సీ ద్వారా చేస్తారని, కానీ ఈ ప్రొసిజర్ పాటించకుండా గురుకుల శాఖ ద్వారా నియామకాలు జరపడం అంటేనే అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఒక్కొక్క పోస్టుకు 2 లక్షల నుండి 5లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయని, ఈ అవినీతి, అక్రమాలకు అన్ని గిరిజన శాఖలో కొంతమంది అధికారులు ప్రమేయం ఉందని, వీరికి అశాఖ ముఖ్యకార్యదర్శి బంధువు ద్వారా శాఖాధికారులపై ఒత్తిడి చేసి ఇదంతా చేశారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కింద స్థాయిలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ కూడా ఏజెన్సీల ద్వారా నియామకాలు జరపకుండా ప్రత్యక్షంగా నింపితే వారికి వేతనాలు ఏ ఖాతా నుండి చెల్లింపు చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్నారని, ప్రిన్సిపాల్స్ ఈ ఉద్యోగాలు పొందిన వారిని జాయిన్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారనే పేరుతో 5పోస్టులు మంజూరు చేయడాన్ని బట్టి చూస్తే దీనిలో రాజకీయ నాయకులు ప్రమేయం, కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు తేటతెల్లం అవుతుందని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన శాఖలో గురుకులాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశించి, దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నగర నాయకులు వినోద్, మనోజ్, త్రినాథ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అక్యూ పంచుర్, కేరళ పేరిట నకిలీ వైద్యం

• జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలో నకిలీ వైద్యం పేరిట అక్యూ పంచుర్ అని, కేరళ వైద్యం అని, హెర్బల్ క్లినిక్ అని అర్హత లేని వారు రిజిస్ట్రేషన్ లేకుండా ఖమ్మంనగరంలో బోర్డులు పెట్టకుండా వైద్యం పేరిట పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని, ప్రజలు వారి ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతి బాయి అన్నారు. గురువారం ఖమ్మంలోని ట్రంక్ రోడ్డులో అక్యూ పంక్చర క్లినిక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న డాక్టర్‌గా చెప్పబడుతున్న వై.నరేష్ కుమార్ అనే వ్యక్తికీ అర్హతలు లేవని, అతను ఎక్కడా రిజిస్ట్రేషన్ చేయలేదని, అతనికి వైద్యం చేయవచ్చని ఏ సర్టిఫికెట్ లేదని గ్రహించి అతనిని హెచ్చరించారు. అక్కడ ఉన్న రోగులను పరిశీలించి ఎందుకు ఇక్కడకు వచ్చారు అని అడిగితే నరాలను నొక్కి చికిత్స చేస్తాడని చెపితే వచ్చామని తెలిపారు. ఇదే వైద్యంతో మడ్డి శ్రీనివాస్ (53)సంవత్సరాల, పాతలింగాల కామేపల్లి మండలంలో వ్యక్తి చనిపోయాడని అక్కడ ఎస్ఐ ఫిర్యాదు ఇచ్చారని, ఇతను తమిళనాడు రాష్ట్రంలో పుట్టి తెలంగాణలో అనేక జిల్లాలో ప్రజలను మోసం చేస్తున్నట్టు గ్రహించి హెచ్చరించి స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ అతనిపై క్రిమినల్ కేసు బుక్ చేయాలని కోరారు. అనంతరం క్లినిక్‌ని సీజ్ చేశారు. అలాగే ఎన్టీఆర్ సర్కిల్‌లో కేరళ వైద్యం పేరిట ఉన్న క్లినిక్‌ని తనిఖీ చేసి అర్హత, లేని వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యం ఫణంగా పెట్టి దోచుకొంటున్నట్లు గ్రహించి సీజ్ చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రి ఎన్సీడి క్లినిక్ సందర్శించి అసంక్రమణ వ్యాధుల చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి నిరుపేదలు వస్తారని, వారిని పరీక్షించి సరైన మందులు ఇచ్చి చికిత్సలు అందించాలని తెలిపారు. మందుల స్టోర్, ల్యాబ్‌ను పరిశీలించి, కేటాయించిన స్టాఫ్ నర్సులు ఇక్కడే పనిచేసే విధంగా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌తో చెప్పారు. అనంతరం సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను పరిశీలించి ఈ-ఔషధి ఎప్పటికప్పుడు అప్ డేట్ జరగాలని, ప్రతి ఆరోగ్య కేంద్రానికి సరిపడా మందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని పంపించాలని, మనం ఇచ్చే మందులు పేద రోగులకు అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చందు నాయక్, డాక్టర్ డి.రామారావు, డెమో సాంబశివరెడ్డి, ఎన్ హెచ్ఎం డీపీవో దుర్గ, ఎన్సీడి కోఆర్డినేటర్ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జత్ సింగ్ దలైవాల్‌కు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా సంఘీభావం ప్రదర్శనలు

• తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రైతులు పండించిన పంటలుకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ పంజాబ్ హర్యానా సరిహద్దులో ఖనేరీలో 46 రోజుల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జత్ సింగ్ దలైవాల్‌కు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా గురు, శుక్ర, శనివారాల్లో సంఘీభావంగా రైతులు ప్రదర్శన, దీక్షలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం వైరా మున్సిపాలిటీ పరిధిలో గండగలపాడులో రైతు నేత జగ్జత్ సింగ్ దలైవాల్ ప్రాణాలు కాపాడాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మూలంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు నేత జగ్జత్ సింగ్ దలైవాల్ ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, గ్రామ కార్యదర్శి కామినేని రవి, పల్లె బోయిన కష్ణ, మచ్చా మణి, మల్లెంపాటి వీరభద్రం, కొంగర సుధాకర్, పల్లెబోయిన వెంకటేశ్వరరావు, కిన్నెర మోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరజీవి పూర్ణకంటి దేవయ్య సంస్మరణ సభ

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి పూర్ణకంటి దేవయ్య సంస్మరణ సభను సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి గుమ్మ నరసింహారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణకంటి దేవయ్య చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు పూలదండ వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి మాట్లాడుతూ జీవితాంతం నిబద్ధతతో పనిచేసే గొప్పతనం కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఉందన్నారు. తుదిశ్వాస విడిచే వరకూ వరకు పార్టీ పట్ల విశ్వాసంతో పూర్ణకంటి దేవయ్య ఉన్నారని, పార్టీ ఇచ్చిన పిలుపులో భాగస్వామ్యం అవుతూ చివరి వరకు దేవయ్య పనిచేశారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా విస్తృతంగా ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా దేవయ్యకు నిజమైన నివాళులు అర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు మల్లెంపాటి రామారావు, కొంగర సుధాకర్, పారుపల్లి కృష్ణారావు, మల మాగంటి తిరుమలరావు, కామినేని రవి, మల్లెంపాటి ప్రసాదరావు, వెంకటరామయ్య, బొడ్డు నారాయణ, పూర్ణకంటి రామారావు, పూర్ణకంటి ఏసుదాస్, కిన్నెర మోతయ్య, దేవబత్తిని నరసింహారావు, పాపకంటి రాంబాబు, పల్లెబోయిన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని రేమిడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ చల్లా కోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని,ప్రతి ఒక్క వ్యక్తి ఒక మొక్కను నాటా లని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలికపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ నాళ్ళ భానుచందర్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి సలహాలు సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఎరమల వెంకటరామిరెడ్డి, ఇనపనూరి పుల్లమ్మ, పుప్పాల రాంబాబు, చిన్న, చిట్టి, ఫణికుమార్, మోదుగు సతీష్, షేక్ వజీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఆడిటోరియం విద్యుద్దీకరణకు వితరణ

• పూర్వ విద్యార్థుల సహకారం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

1979-1981 సంవత్సరం మధ్య కాలంలో బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు బచ్చస్ గ్రూప్ పేరుతో కళా శాల ఆడిటోరియం విద్యుద్దీకరణ నిమిత్తం 15 వేల రూపాయలను కళాశాల ప్రధానాచార్యులు రవికుమార్‌కు పూర్వ విద్యార్థులు వేమిరెడ్డి జగన్మోహనరెడ్డి, వెంకటేశ్వర్లు, జూపూడి లక్ష్మణరావు, పూర్ణచంద్రరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు కళాశాల ప్రధానాచార్యులుకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం రాబోయే రోజులలో మెరిట్ అవార్డ్స్ కూడా అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంలో కళాశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి జగన్మోహనరెడ్డి వ్యక్తిగతంగా 15 వేలరూపాయలు అందజేశారు. ఖమ్మం జిల్లాలోని బనిగండ్లపాడు కళాశాల మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ సిబ్బంది కృషి వలన విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయటం హర్షనీయమని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు రెంటాల రవికుమార్, ఎకాడమీ గైడెన్స్ అండ్ మానిటరింగ్ ఆఫీసర్ గడ్డమడుగు రామారావు, సీనియర్ అధ్యాపకులు తిరుపతిరెడ్డి, విశ్వేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో ప్యానల్ ఇన్స్పెక్షన్

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్యానల్ ఇన్స్పెక్షన్ నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలో ఎల్ఐపి, ఇంప్లిమెంటేషన్ ఎలా ఉన్నది అనే అంశములో 7 సబ్జెక్ట్స్‌లో ఏడుగురు టీం మెంబెర్స్ పరిశీలించారు. ఎంఈఓ ప్యానెల్ టీం లీడర్‌గా ఉన్నారు. విద్యార్థుల ప్రొవిషన్స్, మెనూ ఇంప్లిమెంటేషన్, హెల్త్ అండ్ ఫీజికల్ ఎడ్యుకేషన్, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. ప్యానెల్ రిపోర్ట్‌ను జిల్లా విద్యాశాఖధికారి ఏటూరి సోమశేఖర్ శర్మకు పంపించినట్లు ఆయన తెలిపారు.

నేడు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శు క్రవారం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు ఎర్రుపాలెం మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సకినవీడు గ్రామంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి మండలం నుండి భారీ చేరికలకు రంగం సిద్ధం చేశారు.

చదువు ఎంత ముఖ్యమో, మెనూ అమలు కూడా అంతే ముఖ్యం


ఎంఈఓ దామాల పుల్లయ్య

నవతెలంగాణ - బోనకల్

విద్యార్థులకు చదువు చెప్పటం ఎంత ముఖ్యమో మెనూ అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య అన్నారు మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రతిభను ఆయన పరిశీలించారు. అనేక ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. విద్యార్థులు కూడా అందుకు అనుగుణంగా ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ పాసంగులపాటి వెంకట పద్మావతి, పలు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు బాణాపురం విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ముదిగొండ



ఈనెల 10 నుండి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యు,19 క్రికెట్ పోటీల్లో పాల్గొనున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు క్రీడాకారులను సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ఎంపిక చేశారు.ఈ క్రికెట్ పోటీల ఎంపికలో మండల పరిధిలో బాణాపురం హైస్కూల్‌కు చెందిన విద్యార్థినిలు ఐషాని, శ్రీనిధి, స్పందన, వేదిత, దేవి, స్పందన మంచి ప్రతిభ కనపరచడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇవి రామిరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతోపాటు, హెచ్ఎం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం చెన్నంగులగడ్డలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం తెల్పిన వివరాలు ప్రకారం... బత్తుల సంతోష్ అనే వ్యక్తి చెన్నంగులగడ్డలోని ఆవుల సంపత్ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించటానికి 40 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కారేపల్లి పోలీసుల సాయంతో వలపన్ని పట్టుకున్నారు. బియ్యంను స్వాధీనం చేసుకోని ఆవుల సంపత్, బత్తుల సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఖమ్మంరూరల్ మండలానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అందజేశారు. మొత్తం 26మంది లబ్దిదారులకు రూ.6.69 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల కేక్ కటింగ్

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు మేనల్లుడు లేళ్ల కార్తీక్, నిఖిత దంపతుల కుమారుడు వియాన్స్ పుట్టినరోజు సందర్భంగా ఎస్సీ, బీసీ అంగన్వాడీ కేంద్రాలలో రియాన్స్ నాయనమ్మ లేళ్ల మోనా కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లలచే గురువారం కేక్ కటింగ్ చేయించారు. గతంలోనే ఎస్సీ అంగన్‌వాడి కేంద్రం నందు కిటికీ డోర్స్ మరమ్మత్తులు, పెయింటింగ్స్ వేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు మరమ్మత్తులు, పెయింటింగ్స్ వేయించారు. కార్యక్రమంలో కర్నాటి రామకోటేశ్వరరావు సతీమణి స్వాతి, ఆమె కుమార్తె కావ్య, అంగన్వాడీ కేంద్రాల టీచర్స్, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలో అఖిల భారత యాదవ మహాసభ ఖమ్మం జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అఖిలభారత యాదవ మహాసభ క్యాలెండర్‌ను ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ ఆవిష్కరించారు.



పోడు భూముల సమస్యపై ఎమ్మెల్యేకి వినతి

నవతెలంగాణ-కరకగూడెం

మండల పరిధిలోని మోతే గ్రామానికి చెందిన వ్యవసాయ రైతులు పోడు భూముల సమస్యపై పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. 35 సంవత్సరాల నుండి సుమారు 40 కుటుంబాలు కలిసి సాగు చేస్తున్నటువంటి భూమిని ఫారెస్ట్ భూమి అంటూ గత కొంత కాలం నుండి బీట్ ఆఫీసర్స్ ఇబ్బందికి గురి చేస్తున్నారని పాయంకి రైతులు తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ఫారెస్ట్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకి మోతే రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిలకలగండి హుండీ ఆదాయం @ 1,81,558

నవతెలంగాణ-అశ్వారావుపేట



మండల పరిధిలోని వినాయకపురంలో గల చిలుకలు గండి ముత్యాలమ్మ దేవాలయం హుండీ ఆదాయం రూ.1 లక్షా 81 వేల 558లుగా నమోదు అయింది. ఈ దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 23 సెప్టెంబర్ 2024 నుండి 09 జనవరి 2025 వరకు ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయం నూతన చైర్మెన్ నరాల శ్రీను తెలిపారు. ఈ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు బెయిల్ సింగ్, ఈవో బి.సూర్యప్రకాశరావు, దేవాలయం అర్చకులు మేడూరి సాంబశివ ప్రసాద్ శర్మ, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

చలి తీవ్రతకు వ్యక్తి మృతి

నవతెలంగాణ-బూర్గంపాడు

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బాణోతు బాలు (65) అనే వ్యక్తి గత 8 సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులు అతని కోసం బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర గాలించినా ఫలితం లేదని పేర్కొన్నారు. మృతుడు గత కొంత కాలంగా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్ర వారం ఉదయం సారపాక బస్టాండ్ సమీపంలో మృతి చెంది ఉన్న అతనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా సోషల్ మీడియా వేదికగా విషయం తెలుసుకున్న భాదిత కుటుంబ సభ్యులు మృతుడిని గురించి సారపాక చేరుకున్నారు. మృతుడు కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహనికి పోస్టుమార్టం నిర్వహించి భాదిత కుటుంబసభ్యులకు అప్పగించారు.



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కొత్తగూడెం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు సుజాత సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఐదుగురి బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశామని, విద్యార్థులు డ్రాప్ ఔట్ కాకుండా హాజరు శాతం ఎక్కువ వుండే విధంగా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అత్యున్నత చదువులుకు వెళ్లి ఉన్నత ఉద్యోగాలు సాధించి పాఠశాలకు తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు అబ్రహం, పాపయ్య, సురేష్, శేషగిరి రావు, మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీకేడీవీఎస్ డిగ్రీ కళాశాలలో రంగోలి పోటీలు

- ఆకట్టుకుంటున్న ముగ్గులు
- విద్యార్థినీలను అభినందించిన ప్రిన్సిపాల్ శేషుబాబు

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో గల వీకేడీవీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం రంగోలి పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషుబాబు పర్యవేక్షణలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు (రంగవల్లులు) చిత్రీకరించారు. రంగోలి పోటీలలో ఇంటర్ విద్యార్థినీలు 29 మంది, డిగ్రీ విద్యార్థినీలు 45 మంది మొత్తం 74 పాల్గొన్నారు. ఆసక్తికరంగా ఉన్న ముగ్గులతో ఇంటర్‌లు నలుగురు, డిగ్రీ విద్యార్థినీలు ఆరుగురు ప్రతిభ కనబరిచారు. వీరికి కోకో కోలా కంపెనీ కూల్ డ్రింక్స్‌ను బహుమతులుగా అందజేసారు. వీరిని ప్రిన్సిపాల్ శేషుబాబు అభినందించారు.

భద్రాచలం డిపో 45వ వార్షికోత్సవ సంబరాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం ఆర్టీసీ డిపో ఏర్పడి నేటితో 44 సంవత్సరాలు పూర్తి చేసుకొని 45వ సంవత్సరంలో అడుగుడిన సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు డిపో ఎదుట డీఎం తిరుపతి సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు గత స్మృతులను గుర్తుచేసుకొన్నారు. ఈ సందర్భంగా 09-1-1981న భద్రాచలం డిపోని ప్రారంభించిన ఉద్యోగులైన వెంపటి రాజు, బొర్రా వెంకట నరసింహారావు, బత్తుల విశాలాంధ్ర బాబులను డిపో మేనేజర్ తిరుపతి ు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ గౌతమీ, ఎం.ఎఫ్ శ్రీనివాస్, డీసీ అల్లం నాగేశ్వరావు, ఎస్ఎం వీర వెంకన్న, విశ్రాంత ఉద్యోగులు ఎంవిఎస్ఎస్ నారాయణ, వై.వెంకటరావు, పి.వెంకటరావు, మాధవరావు, కంట్రోలర్స్, విశ్రాంత ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

సోలార్ కార్మికులతో వెట్టి చాకిరి ఆపాలి

- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి బి.మధు
- సీఐటీయూ, టీయూసీఐ సంఘాల ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు



కోర్టుల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన వేతనాలు ఇవ్వకుండా, పనులు చూపకుండా సోలార్ కార్మికులతో యాజమాన్యం వెట్టి చాకిరి చేస్తోందని తక్షణం ఆపాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మాణం చేసింది. ఈ సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధహక్కులు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఫ్యాక్టరీల చట్టాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట సోలార్ కార్మికులు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం కృష్ణయ్యకు సీఐటీయూ, టీయూసీఐ ప్రతినిది బృందం వినతి పత్రం అందజేసింది. అనంతరం సీఐటీయూ నేతలు మధు, నభి, టీయూసీఐ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి, మల్లెల వెంకటేశ్వర్లు ఉమ్మడిగా డీజీఎం పర్సనల్ మోహన్ రావు, బీహెచ్ఈఎల్ సూపర్వైజర్ క్రాంతి, యూనియన్ల నాయకులతో చర్చలు జరిపారు. సోలార్ కార్మికులకు సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఇస్తున్న వేతన జీవో ప్రకారం సోలార్ కార్మికులకు ఇవ్వాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. లాభాలలో వాటా స్పెషల్ ఇన్సెంటివ్ రూ.5వేలు సోలార్ కార్మికులకు ఇవ్వాలన్నారు. సెక్యూరిటీ గార్డులకు మూడు షిఫ్టుల డ్యూటీ కేటాయించాలన్నారు. సోలార్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి క్యాటగిరి వారిగా పనులు కేటాయించాలన్నారు. సోలార్ ప్లాంట్‌లో మ్యాన్ పవర్ తగ్గటం వలన దొంగతనాలు జరుగుతున్నాయని దానికి తగ్గట్టుగా సెక్యూరిటీ గార్డుల సంఖ్య పెంచాలని కోరారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించి బోనస్ ఇవ్వాలని కోరగా పర్సనల్ మేనేజర్ గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ను రద్దుచేసి కొత్తగా సెంట్రల్ జీవో అమలు తదితర హక్కులు అమలు చేసే విధంగా టెండర్ కోడ్‌లో పెట్టి టెండర్ పిలవాలని బీహెచ్ఈఎల్ సూపర్వైజర్‌కి తెలిపారు. ఈ విషయాన్ని కార్పొరేట్ పై అధికారుల చేతిలో ఉన్నందున కొంత సమయం ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోలార్ యూనియన్ ఇరు సంఘాల కార్మిక నాయకులు, సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, సంజీవ్ రామకృష్ణ, ప్రేమ్ సింగ్, రాజు, శ్యాం బాబు, దల్సింగ్ గణేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.





భద్రాద్రిలో ప్లాస్టిక్ ఫ్రీ ఛాలెంజ్ ప్రారంభం

- ప్లాస్టిక్ ఫ్రీ ఛాలెంజ్ సెల్ఫీ స్టాండ్‌ని ప్రారంభించిన ఈవో

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

2018 నుంచి భద్రాచలం పట్టణంలో, దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న జేడీ ఫౌండేషన్‌ని భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి అభినందించారు. ఈ మేరకు ముక్కోటి సందర్భంగా జేడీ ఫౌండేషన్ అధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వారి సహకారంతో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నిషేధం చాలెంజ్ అనే సెల్ఫీ పాయింట్‌ని దేవస్థానం ప్రాంగణంలో ఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిషేధానికి దేవస్థానం కూడా సహకరిస్తుందని ఇప్పుడున్న కాలానికి అనుగుణంగా వినూత్న పద్ధతిలో ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన ఆకట్టుకుందని తెలిపారు. దేవస్థానం గోశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ సెల్ఫీస్టాండ్‌ని పలువురు భక్తులు ప్రజలు అధికారులు సెల్ఫీలు తీసుకుని ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ కన్వీనర్ మురళీమోహన్ ఈవో, అధికారులకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హన్సి, కడాలి నాగరాజు, యూసఫ్ మియా, అంబికా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి



- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి/గుండాల

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆళ్ళపల్లి, గుండాల మండలంలో పర్యటించారు. ఆళ్ళపల్లిలోని ఏహెచ్ఎస్ ఆనంతోగులో ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లకు, కేజీబీవి టీచర్లకు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేల్ వర్తింపచేయాలని, గురుకుల పాఠశాలల్లో పని వేళలు మార్చాలన్నారు. ఇ కుబేర్‌లో పెండింగ్ ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. అన్ని రకాల గురుకుల పాఠశాలలో రెండు డిప్యూటీ వార్డెన్ పోస్ట్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ ఆరు సంత్సరాల కాలంలో ఉత్తమ పనితీరు కనపరిచారని ఉపాధ్యాయులు, అధ్యాపకలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపిస్తామని తెలిపారు. అదేవిదంగా గుండాల మండలంలో టీటీడబ్ల్యూ ఆర్‌జేసీ బాయ్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల సిబ్బంది, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి హతీరామ్, ఆళ్ళపల్లి ప్రధాన కార్యదర్శి సురేశ్, మండలం అధ్యక్ష, కార్యదర్శులు పి.బాలస్వామి, రూప్ సింగ్, కార్యదర్శులు సురేశ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : మండలంలోని సులానగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సందర్శించారు. ముందుగా ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకునే, విద్యార్థులు ఉపాధ్యాయులతో పాటు ప్రార్థనలో పాల్గొని విద్యార్థుల ప్రార్థనా తీరును పరిశీలించి, ఉపాధ్యాయులను అభినందించి, మాట్లాడారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల కోయగూడెంను సందర్శించి, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు వాసం వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్ సింగ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మాన్సింగ్, హరికుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాపం పండింది...అవినీతి బయటపడింది

ఏసీబీకి చిక్కిన మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ కృష్ణ

సహకరించిన అటెండర్

- ఇరువురిని పట్టుకున్న అధికారులు

నవతెలంగాణ-ఇల్లందు



విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రిన్సిపాలే సమాజానికి తలవంపులు తెచ్చారు. ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉన్నత చదువులు చదివి మైనార్టీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి తోటి ఉపాధ్యాయులికి వేతనాలు ఇప్పించడానికి ఆమెనే లంచం అడిగాడు. దీంతో ఏసీబీ రంగ ప్రవేశం చేసి అవినీతి బకాసురుడి ఆట కట్టించారు. ప్రభుత్వం నుండి సుమారు రూ.లక్ష వేతనం వస్తున్నప్పటికీ అవినీతికి కక్కుర్తి పడడం పట్ల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... పట్టణంలోని 24 ఏరియాలో గత 5 సంవత్సరాల క్రితం మైనార్టీ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు సుమారు 200 మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు గత నాలుగేళ్లక్రితం భీమనపల్లి కృష్ణ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌గా తెలుగు ఉపాధ్యాయురాలు సంధ్య రాణి శాలరీ చేయడానికి ప్రిన్సిపాల్ కృష్ణ రూ.10 వేలు డిమాండ్ చేశారు. వాటి కోసం పది రోజులుగా ఆమెను ఇబ్బంది పెడుతుండటంతో సంధ్య ఏసీబీ అధికారులను ఆశ్రయిం చింది. వారి సూచన మేరకు రూ.2 వేలు ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంది.

ఈ మేరకు ప్రిన్సిపాల్‌కు డబ్బులు ఇచ్చేందుకు వెళ్లగా ఆయన అటెండర్ కిచ్చెల్లి రామకృష్ణకు ఇవ్వమని చెప్పాడు. టీచర్ సంధ్య అటెండర్‌కు డబ్బులు ఇవ్వడంతో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ బృందం దాడి చేసి పట్టుకున్నారు. ప్రిన్సిపల్‌ను అతనికి సహకరించిన అటెండర్‌ను సాక్షాదారాలతో పట్టుకొని కేసు నమోదు చేశారు. సమాజానికే తలవంపులు తెస్తూ అవినీతికి పాల్పడుతున్న ప్రిన్సిపాల్ ఇక విద్యార్థులకు ఏం నేర్పుతారని తల్లి దండ్రులు మండిపడుతున్నారు. ప్రిన్సిపాల్‌ను డిస్మిస్ చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



సెంట్రల్ లైటింగ్ పనులకు జారే శంకుస్థాపన

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు నిరణం కోసం రూ.5 కోట్లతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మండలంలో సెంట్రల్ లైటింగ్ రావడం చాల సంతోషంగా ఉందని, పనులు మెత్తం అయిపోయిన తరువాత మండల కేంద్రం ప్రధాన రహదారి అంత వెలుగుల్లో వుంటుందని, ట్రాఫిక్ సమస్య కూడా చాల తక్కువగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాల్లో వచ్చినటువంటి సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులుతో కలసి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, పర్స వెంకట్, మండల యువజన అధ్యక్షులు వేముల నరేష్, రమణ, దుబాకుల రాము, వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ బోడ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి

నవతెలంగాణ-మణుగూరు



ఈ ఏడాది నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. గురువారం మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగశ్రీ, ఉపాధ్యాయులతో సమావేశమై ఫలితాల సాధన కోసం చేస్తున్న కృషిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన ఫలితాల సాధన కోసం రెండు నెలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రమించాలన్నారు. ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటూ పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రయివేట్, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ప్రధానో పాధ్యాయులు విద్యార్థుల అపార్(ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అపార్ ఐడీని అప్డేషన్లో ఎదురయ్యే సమస్యలను, సాంకేతిక ఇబ్బందులను నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లాను అపార్ ఐడీ అప్డేషన్లో ముందు స్థానంలో నిలిపేందుకు ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ప్లానింగ్ కో ఆర్డినేటర్, స్టాటిస్టికల్ అధికారి సతీష్, హెచ్‌ఎం నాగశ్రీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత, స్ట్రాంగ్ టీచర్స్ బ్రహ్మయ్య, బాలాజీ, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.



మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని మొద్దులగూడెంలో బొంతు కృష్ణ, దొడ్డా కృష్ణ, మట్టకొయ్య రామయ్యలను మెచ్చా పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో కోట కేశవరావు-వెంకమ్మ దంపతుల మనవరాలు శ్రీనివాస్‌రావు-కావ్య దంపతుల కుమార్తె అన్నప్రాసన వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అక్కడ నుండి మల్కారం గ్రామంలో జొన్నకూటి ప్రసాద్-కృష్ణవేణి దంపతుల కుమార్తె ఒణీల వేడుక కుమారుడి పంచల వేడుకలో పాల్గొన్న మెచ్చా చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మండల కేంద్రం దమ్మపేటలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాస్‌రావు తండ్రి యార్లగడ్డ సుబ్బారావు, అక్క యార్లగడ్డ సత్యవతిల దశ దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, అంకత ఉమా మహేశ్వరరావు, జలగం వాసు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డ రమేష్, ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసు బాబు, మాజీ ఎంపీటీసీ రావూరి వీరయ్య, మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, రూప్ సింగ్, మాధవ రావు, కన్నయ్య, నాగేశ్వరరావు, బాల శ్రీను, అబ్దుల్ జిన్నా, తిరుపీధుల జేమ్స్, రాములు, మల్లేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేయెుద్దు

- మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



దక్షిణ అయోధ్యగా పేరు పొందినటువంటి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు గుడి అడ్రస్సు వివరాలు తెలియజేస్తూ అధిక ధరలు వసూలు చేయరాదని ఆటో డ్రైవర్లకు భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘ వెంకట పుల్లయ్య సూచనలు చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. భద్రతా నియమాలు పాటిస్తే ప్రాణాలకు ముప్పు తప్పే అవకాశం ఉంటుందని, తప్పకుండా అందరూ హెల్మెట్ ధరించాలన్నారు. భద్రత నిబంధనలు పాటించాలని ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు.

తానం రవీందర్ 4వ వర్ధంతి

నవతెలంగాణ-ములకలపల్లి



తానం రవిందర్ ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలు ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో రవీందర్ 4 వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి తన సోదరుడు తానం రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు తానం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మధు, రవికుమార్‌లు మాట్లాడుతూ మండలంలో ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సమస్యల పై నిరంతరం పోరాడుతూ గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉండే వారని అన్నారు. పోడు భూముల పోరాటాల్లో అనేక సార్లు సీపీఐ(ఎం) నాయకత్వం పై కేసులు పెడితే అనేక సార్లు జైలు జీవితం గడిపారని గిరిజన గ్రామాల అభివృద్ధికి అయన కృషి చేశారని గుర్తుచేశారు. దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాడని గిరిజన, గిరిజనేతర ప్రజలను ఐక్యం చేసి అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కోంద్రు రాఘవయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, కీసరి గంగరాజు, తాటి ముత్యాలు, మంచాల సారయ్య, దుబ్బ వెంకటేశ్వర్లు, చిట్టెమ్మ, రాధ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి పనితీరు భేష్

- మచ్చలేని నేతను మరోసారి గెలిపిస్తాం : ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఇల్లందు

ఉపాధ్యాయులంతా ఐక్యతతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిచామని గత ఆరేండ్లుగా ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని, ఎన్నో విజయాలు సాధించామని ఉపాధ్యాయులు అన్నారు. ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి పనితీరు భేష్‌గా ఉందని మచ్చలేని నేత అంటూ ఆనందం వ్యక్తం చేశారు. మరోసారి వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. మండలంలోని కొమరారం, రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాలలను గురువారం టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి, పి.జయరాజుతో కలిసి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సందర్శించారు. ఉపాధ్యాయులంతా ఆప్యాయంగా పలకరించి తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో ఉత్తమ పనితీరు కనపరిచారని ఉపాధ్యాయులు, అధ్యాపకలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అవినీతి మచ్చలేని నాయకుడిని ఎన్నుకున్నందుకు గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో పెండింగ్‌లో ఉన్నటువంటి డీఏలను విడుదల చేయాలని, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టి టీచర్లకు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేల్ వర్తింపచేయాలని, గురుకుల పాఠశాలల్లో పని వేళలు మార్చాలని, ఇకుబేర్‌లో పెండింగ్ ఉన్న బిల్లులను చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అన్ని రకాల గురుకుల పాఠశాలలో రెండు డిప్యూటీ వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని తదితర సమస్యలను వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయుల సేవకై పనిచేస్తానని అన్నారు. ఈ సందర్శనలో టీఎస్ యుటిఎఫ్ ఇల్లందు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కృష్ణవేణి, కోశాధికారి కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



నాథ్ సీడ్స్ రైతుల ఇంట సిరుల పంట

- ఎన్సిహెచ్ 2561

నవతెలంగాణ-చంద్రుగొండ

అధిక దిగుబడి అత్యధిక రాబడిలో రైతుకు ఆసరాగా నిలుస్తూ నాణ్యమైన, నమ్మకమైన లాభాలు అందిస్తున్న మిర్చి రకం ఎన్‌సిహెచ్ 2561 నాథ్ బయోజేన్స్ ఇండియా లిమిటెడ్ వారి మిరప విత్తనాలు సంచలనం సృష్టిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ రైతులకు సిరుల పంట కురిపిస్తుందని ఆ సమస్త జనరల్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గుర్రాయి గూడెంలో ఎన్‌సిహెచ్ 2561 రకం మిర్చి సాగుపై వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఆ సమస్త మేనేజర్ గోకినపల్లి ఊసయ్య మాట్లాడుతూ మొక్కలు కొమ్మలు ధృడంగా వ్యాప్తి చెందటం ఈ విత్తనాల లక్షణం అన్నారు. ముఖ్యంగా ఈ రకం విత్తనాలు వైరస్‌ను పూర్తిగా తట్టుకొని అధిక దిగుబడులు సాధిస్తుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బీ.రవి, సైదేశ్వర రావు, భైరు వేణుగోపాలరావు, సాయి లక్ష్మీ ఏజెన్సీస్ వారు పాల్గొన్నారు.



ఎకో పార్క్‌ను వీక్షకులు సందర్శించవచ్చు

- నియమాలు పాటించాలి
- ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం


కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీ నందు గల ఎకో పార్క్‌ను సందర్శకులు వీక్షించేందుకు అన్నిరకాలుగా తీర్చిదిద్దామని, ఎకో పార్కు నందు చిన్నారులు ఆడుకొనుటకు జారుడు బల్ల, ఉయ్యాల, ఊగుడు బల్ల వంటి ఆట వస్తువులను అమర్చామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. వీక్షకులు వీక్షించుటకు బయోడైవర్సిటీ పార్క్, హనీ బీ కీపింగ్, బుద్ధవనం, తాళ్లవనం, బర్డ్ వాచింగ్ టవర్, వీక్షకులు సేద తీరడానికి గుడిసె, ఇతర వస్తువులు ఉన్నాయన్నారు. ఎకో పార్క్ సందర్శించుటకు వీక్షకులు పలు నియమాలు పాటించాలని సూచించారు.

నిబంధనలు ఇవే..

జీకే ఓసి చెక్ పోస్ట్ వద్ద గేట్ పాస్‌ను తీసుకోవాలి. పూర్తి వివరాలను నమోదు చేసిన తర్వాతనే లోనికి ప్రవేశించాలి. వీక్షణ తరువాత తిరిగి వెళ్లేటప్పుడు చెక్ పోస్ట్ పెద్ద రిటన్ చేయగలరు. పార్కు నందు గల పువ్వులు కోయరాదు. మొక్కలను తుంచరాదు. పార్కు నందు గల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవలెను. పార్కు నందు వంటలు చేయరాదు. ప్లాస్టిక్ వస్తువులను సంచులను పార్కులోనికి తీసుకురాకూడదు. ఆట వస్తువులను పాడు చేయరాదు. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండవలెను. నీటి కుంటల దగ్గరకు వెళ్ళరాదు. పార్కు దాటి ఇతర ప్రదేశాలకు వెళ్లరాదు. పార్కు నందు మత్తు పానీయాలు, ధూమపానం సేవించరాదు. చెట్లను ఎక్కరాదు. వాహనాలను నిర్దేశించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేయవలెను. వాష్ రూమ్ లను పరిశుభ్రంగా ఉంచవలెను. సమయపాలన పాటించవలెను. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సందర్శనం. సెక్యూరిటీ సిబ్బంది సూచనలను తూచా తప్పకుండా పాటించవలెను.ఆదివారం వీక్షకులు సందర్శించవచ్చని ప్రకటనలో వెల్లడించారు.

అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ సంగీత విభావరి

నవతెలంగాణ-కొత్తగూడెం



పట్టణంలో శుక్రవారం సాయంత్రం "అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ" ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపకులు, సంగీతం టీచర్ అలిపిరెడ్డి ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి పాఠశాలలో సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత సినీ సంగీత నిర్వహకులు ఇళయరాజా సంగీతం సమకూర్చిన భక్తి సంగీతం "లలిత ప్రియ కమలం విరిసింది" సంగీత విభావరి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ యాంకర్స్ పాల్గొంటారని, సింగరేణి కళాశాలలోని 50 మంది విద్యార్థులు ప్రత్యే గీతాలాపన ఉంటుందన్నారు. ఈ అవకాశం పట్టణ ప్రజలు, సంగీత ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దండకారణ్యంలో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- బీజాపూర్ జిల్లా సరిహద్దు అడవుల్లో ఘటన

నవతెలంగాణ-చర్ల

చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సరిహద్దు అడవుల్లో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. డీఆర్‌జీ, కోబ్రా బెటాలియన్, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్ సిబ్బంది మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టు నెంబర్ వన్ బెటాలియన్‌కు పోలీసులకు మధ్య హోరాహోరీగా ఏడు గంటల పాటు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దులో భద్రతా బలగాలు భారీ ఆపరేషన్ కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో డీఆర్‌జీ కోబ్రా బెటాలియన్, ఎస్‌టిఎఫ్, సీఆర్పిఎఫ్ బెటాలియన్ ప్రాంతంలో దాడి చేశారు. భద్రతా బలగాలకు, మావోయిస్టుల మధ్య పలుచోట్ల ఎన్‌కౌంటర్‌లు జరిగినట్లు సమాచార

నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యం

- మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించారు
- మీకు ఎప్పుడూ రుణపడి ఉంటా
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-అశ్వాపురం





నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదకూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని దోసపాటి రంగారావు, భారతి వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మండలంలో వివిధ వ్యాధుల ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో వైద్య చికిత్స పొంది ఆర్థికంగా ఖర్చు చేసుకొని సీఎం సహాయ నిధికి దరఖాస్తులు చేసుకున్న 39 మంది బాధితులకు సుమారు రూ. 15 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నిరుపేదకూ అండగా నిలబడుతుందన్నారు. ఇందులో భాగంగానే పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చేందుకు సర్వేలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.

విహారయాత్ర బోట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం మండల పరిధిలోని తుమ్మలచెరువులో సందర్శకుల కోసం రెండు బోట్లను ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. తొలుత ఆయన ఆ బోట్లలో షికారు చేశారు. మండలంలో ప్రసిద్ధి చెందిన 11 వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తుమ్మల చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తుమ్మలచెరువు ప్రాంతాన్ని సందర్శించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెందేలా దోహదపడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మునుముందు రోజుల్లో ఈ చెరువు ప్రాంతంలో పర్యాటకులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వంతో పాటు జిల్లా ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి పర్యాటక రంగాన్ని ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందేలా తన శక్తివంచనమేరా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ యుగేందర్, పరందమయ్య, ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, తుక్కని మధుసూదన్ రెడ్డి, ఓరుగంటి రమేష్, బట్టా సత్యనారాయణ, బూరెడ్డి వెంటక రెడ్డి, మట్టా వీరభద్రారెడ్డి, కమటం నరేష్, సామకురి వెంకన్న, కొండబత్తుల ఉపేందర్, బచ్చు వెంకట రమణ, షారుక్ పాషా, వేముల విజయ్ పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రదానం

నవతెలంగాణ-కొత్తగూడెం

సంక్రాంతి పండుగ సందర్భంగా సింగరేణి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు కార్పొరేట్ మహిళా క్లబ్ సభ్యుల ప్రెసిడెంట్ హరిణి సత్యనారాయణ రావు బహుమతులు అందజేశారు. స్థానిక మహిళా క్లబ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో బొమ్మల కొలువు నిర్వహించారు. ఈ వేడుకల్లో సింగరేణి ఇఅండ్ ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణ పాల్గొని ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, గోదాదేవి కళ్యాణం, నంద గోకులం, బృందావనం, ప్రభల తీర్థము, భోగి మంటలు, గంగిరెద్దులు అంశాలపై సభ్యులు ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో సునీత వెంకటేశ్వర రెడ్డి, కళ్యాణి శ్రీనివాస్, ఏరియా సెక్రటరీలు మహిళా క్లబ్ సభ్యులు, ఎ.రవి కుమార్, ఇతర కేసిఓఎ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లచ్చిగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

- మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు కెచ్చల కల్పన

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా లచ్చిగూడెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర నాయకులు కెచ్చెల కల్పన అన్నారు. గురువారం పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ... మండలంలో ని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతాలలో ఉన్న దుమ్ముగూడెం, భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలంటే సుమారు 20 నుండి 25 కిమీ దూరం వెళ్లల్సి వస్తుందని అన్నారు. లచ్చిగూడెం కేంద్రంగా వైద్యశాల ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత గిరిజన గ్రామాలు పక్కనే ఉన్న చత్తీస్‌గఢ్ గిరిజన గ్రామాల ప్రజలకు వైద్యశాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో డివిజన్ నాయకులు సాయన్న, నరసింహారావు, సుజాత, సరళ, బాబురావు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టండి



- అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మడి నరసయ్య
- జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ- పాల్వంచ

రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకొని ఎంఎస్పి గ్యారెంటీ చట్టం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ ఈనాడు దేశం మొత్తం దారిద్ర పేదరికంతో విలువలు ఆడుతున్నారని ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి రైతులు పరిస్థితి దినంగా మారిందన్నారు. గ్రామాల్లో నివసిస్తున్న 40 శాతం గ్రామీణ ప్రజలు 50% మహిళలకు రెండు పూటలా తిండికి భద్రత లేదని వ్యవసాయంలో సంక్షేమ వల్ల చాలామంది ఉపాధి కోల్పోయి, యువకులు పల్లెలు వదిలి పట్టణాలకు బదులు దొరికే వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రూపాయలు రాష్ట్రంలో పూర్తిస్థాయి అమలు చేయాలని ఇంకా రాష్ట్రంలో 16 లక్షల మంది రైతులు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయకుండా పూర్తి స్థాయిలో ప్రకటించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్, నాయకులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, నోపా భాస్కర్, మాచర్ల సత్యం, ఈ.శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కల్పన, పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై గుర్తింపు సంఘం నాయకులు పర్యటన

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి ఏరియాలో కార్మిక నివాస ప్రాంతాలలో వారు సమస్యలను తెలుసుకునేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గుర్తింపు సంఘం మణుగూరు బ్రాంచ్ బృందం గురువారం స్థానిక పివి కాలనీలో పర్యటించింది. దీనిలో భాగంగా ఆర్డినరీ డి.క్వార్టర్స్ ఏరియాలను సందర్శించింది. గత సంవత్సరం వర్షాకాలంలో భారీ వర్షాలకు నీరు క్వార్టర్లలోనికి ప్రవేశించి అర్ధరాత్రి కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురి అయ్యాయి. వెంటనే పరిస్థితిని అర్థం చేసుకున్న ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ బృందం వరద ప్రభావిత క్వార్టర్లను సందర్శించిందన్నారు. యూనియన్ విన్నపం మన్నించి వరద బారిన పడిన ఆర్డినరీ డి క్వార్టర్స్ కు సంబంధించి డ్రైన్లు, సైడ్ కాలువలు, సివిల్ పనులు వెంటనే చేపట్టాలని జీఎం అధికారులకు ఆదేశాలను ఇచ్చారు. వారి ఆదేశం ప్రకారం ఆర్డినరీ డి క్వార్టర్స్ లలో పనులు జరుగుతున్నాయని బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య తెలిపారు. కార్మికుల సమస్యలను తెలిపిన వెంటనే తక్షణం స్పందించి సివిల్ వారికి ఆదేశాలు ఇచ్చి పనులు చేయిస్తున్న మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌కి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గుర్తింపు సంఘం తరపున, కార్మికుల కుటుంబాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కాలనీ పర్యటనలో ఫిల్టర్ బెడ్ ఏరియా కార్మికుల కుటుంబాలు స్ట్రీట్ లైటింగ్ గురించి సమస్యలు వెల్లడించారు. జీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ పర్యటనలో ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, కుమారస్వామి, రత్నం శివ, దండు విజయ్ ఎండి ఇమాముద్దీన్, ఎంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ఎస్.కె అజ్గర్ ఆశయాల సాధనకు పోరాడుదాం

- సంతాప సభలో న్యూడెమోక్రసీ నాయకుల పిలుపు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)



కామ్రేడ్ షేక్ అజ్గర్ ఆశయాల సాధనకు పోరాడుదామని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో గుండాల మండల నాయకులు కామ్రేడ్ అజ్గర్ సంతాప సభ, స్థూప ఆవిష్కరణ కార్యక్రమం గుండాల మండల కేంద్రంలో కామ్రేడ్ యాసారపు వెంకన్న అధ్యక్షతన చేపట్టారు. ఈ సంతాప సభకు ముందు గుండాల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఎస్.కె అజ్గర్ స్థూపాన్ని సీపీఐ ఆవునూరి మధు, గౌని ఐలయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 1991 సంవత్సరం నుండి విప్లవోద్యమంలో పనిచేసిన కామ్రేడ్ అజ్గర్ మరణం ఈ విప్లవోద్యమానికి తీరని లోటన్నారు. కామ్రేడ్ అజ్గర్ శత్రువుల దాడులు, అక్రమ కేసులు, నిర్బంధాలను ఎదుర్కొని ఈ విప్లవోద్యమంలో పనిచేశాడని, ఆయన త్యాగం మరువలేనిదని వారు కొనియాడారు. భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం కామ్రేడ్ బాటన్న, లింగన్న బాటలో ప్రయాణించిన వ్యక్తి కామ్రేడ్ అజ్గర్ అజ్ఞాత దళాలకు కొరియర్ గా వ్యవహరిస్తూ పార్టీ రహస్యాలను తన కడుపులో దాచుకొని చిరునవ్వునే చిరునామాగా మార్చుకొని, శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకొని ప్రయాణించిన వ్యక్తి అని చెప్పుకొచ్చారు. రాజ్యం పోలీస్ నిర్బంధాలను తట్టుకొని నిలబడ్డ వ్యక్తి ఎందరో అమరవీరులు తన కండ్ల ముందే మరణిస్తుంటే గుండె ధైర్యంతో తన సహచరులని ముందుకు నడిపిస్తూ విప్లవోద్యమంలో పనిచేశారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమానికి ముందుగా జెండా ఆవిష్కరణను సీనియర్ నాయకులు కామ్రేడ్ పెంటన్న ఆవిష్కరించగా, కామ్రేడ్ అజ్గర్ కు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య, జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటిఎఫ్) జాతీయ కన్వీనర్ మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, కోరం సీతారాములు, అరెం నరేష్, పర్శిక రవి, పూనెం రంగయ్య, బచ్చల సారయ్య, ఈసం మంగన్న, మాజీ జడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఈసం క్రిష్ణన్న, మానాల ఉపేందర్, బానోతు లాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి చిరంజీవి, మల్యాల మల్లేష్, పాయం ఎల్లన్న, తాటి రమేష్, కల్తి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అటనామస్ హోదా

- కేఎల్ఆర్ విద్యా సంస్థలకు ఓ మైలురాయి
- చైర్ పర్సన్ కాటిరెడ్డి నాగమణి

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కెఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటనామస్ హోదా గుర్తింపు లభించింది. రాబోయే ఐదు విద్యాసంస్థలకు ప్రదానం చేసినట్లు చైర్ పర్సన్ కాటిరెడ్డి నాగమణి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటనామస్ హోదా నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ పొందిన ఏకైక విద్యా సంస్థ కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలని చెప్పారు. భౌలజాతి కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు పొందడానికి దానికి అనుకూలమైన సిలబస్ బోధించడానికి ఈ అటనామస్ హోదా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ గుర్తింపు కేఎల్ఆర్ విద్యాసంస్థలకు ఒక మైలురాయి అని విద్యాదాత స్వర్గీయ డాక్టర్ కే.లక్ష్మారెడ్డికి నిజమైన నివాళి అని ఆయన కుమారుడు డైరెక్టర్ కె.సిద్ధార్థ రెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు పొందడంలో అధ్యాపక బృందం కృషిని కొనియాడుతూ విద్యాసంస్థలకు తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయోత్సవంలో డైరెక్టర్, హెచ్‌డీఓలు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



1104 డైరీ, క్యాలెండర్ బిచ్చన్నకి అందజేత

నవతెలంగాణ-మణుగూరు

1104 యూనియన్ 2025 డైరీ, క్యాలెండర్లను చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నకి, ఎస్ఈ పార్వతికి, డిఈ టెక్నికల్ సత్యన్నారాయణకి ఇతర అధికారులకు 1104 యూనియన్ జెన్కో కంపెనీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బిటిపిఎస్ రీజనల్ అధ్యక్షులు బి.హేమ్లు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రామ్, శ్రీనివాసరావు, సంగయ్య, వెంకన్న, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికల డిగ్రీ కళాశాలలో రంగోలి పోటీలు

- ఆకట్టుకుంటున్న ముగ్గులు...
- విద్యార్థినీలను అభినందించిన ప్రిన్సిపాల్ స్పందన

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని పెద్ద వాగు ప్రాజెక్టులో గల గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాల (దమ్మపేట)లో గురువారం రంగోలి పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన పర్యవేక్షణలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు (రంగవల్లులు) చిత్రీకరించారు. రంగోలి పోటీలలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆసక్తికరంగా ఉన్న ముగ్గులతో బీ.కామ్, సీఏ రెండో సంవత్సరం విద్యార్థిని టి.రామలక్ష్మి మొదటి బహుమతి, బీ.కామ్, సీఏ మూడో సంవత్సరం విద్యార్థిని జి.దీపిక రెండో బహుమతి, జి దీపిక, బీఏ రెండో సంవత్సరం విద్యార్థిని పి.నవ్య మూడో స్థానం బహుమతులను గెలుపొందారు. వీరిని ప్రిన్సిపాల్ స్పందన అభినందించారు. ఈ కార్యక్రమంలో అరుణ పాల్గొన్నారు.



ఎస్సైను సన్మానించిన కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు

ఈ నెల 12, 13 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

నూతనంగా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన వాసం శ్రీనాథ్ ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, ఎస్సైను శాలువాతో సత్కరించారు. నూతన యూత్ అధ్యక్షుడిగా శ్రీనాథ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఆళ్ళపల్లి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాయం యువసేన ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో ఈ టోర్నీ జరుగుతుందని చెప్పారు. ప్రథమ బహుమతి రూ.5000/-లు, ద్వితీయ బహుమతి రూ.3000/-లు, తృతీయ బహుమతి రూ.1500/-లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



చైర్మెన్ డీవీని సన్మానించిన పారిశుధ్య కార్మికులు

నవతెలంగాణ-ఇల్లందు

గత మూడు దశాబ్దాలుగా పొందని హక్కులు పొందామని పారిశుధ్య కార్మికులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. నాయిని కృష్ణ, సంజీవ్ సిహెచ్ కుమార్ బోయపాతుల వెంకన్న, భూలక్ష్మి భారతి, ఉమలు చైర్మెన్‌కు శాలువా కప్పి దండ వేసి స్వీట్ తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ 26 జనవరి, ఆగస్టు 15న ఇల్లందు మున్సిపాలిటీలో కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ అవార్డులు తీసుకున్నామన్నారు. పనికి సంబంధించి రాజీ లేకుండా వెంటబడి పని చేయించాడని అన్నారు. కార్మికుల హక్కులు సౌకర్యాలు కూడా అమలు చేశారని అన్నారు. హెల్త్ క్యాంపులు, బట్టలు, కొబ్బరినూనె, చెప్పులు, కరోనా కష్ట సమయంలో మాపనికి గుర్తింపుగా ఇల్లందు పట్టణ ప్రజలందరూ కూడా మాసేవలను గుర్తించి ఈ పాలకవర్గం హయాంలో మమ్ములను ప్రోత్సహించి ఈ ఐదు సంవత్సరాల కాలం గడిచినందుకు వారు మా పట్ల వ్యవహరించిన తీరుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. జనవరిలో పదవీకాలం ముగియడంతో చైర్మెన్‌ను సన్మానించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వారా రవి, అంకపాక నవీన్ మున్సిపల్ కార్మికులు సంధ్య, వరలక్ష్మి, బండారు లక్ష్మి, నాగమణి, వీరస్వామి, నాగరాజు, గొల్లమంద రాములు, అనిల్, ఉప్పరి కృష్ణ శ్రీధర్ రవి పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | జనవరి 10, 2025 | www.navatelangana.com



కంటి ఆపరేషన్ వాహనానికి జెండా ఊపి ప్రారంభించిన పర్యావరణ ప్రేమికులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మారుతి నర్సింగ్ కళాశాల వద్ద 42 మందికి కంటి చూపు ఆపరేషన్స్ కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రి హైదరాబాద్‌కి వెళ్ళే వాహనానికి పర్యావరణ ప్రేమికులు లయన్ డాక్టర్ గోళ్ళ భూపతి రావు, లయన్ జి.శివ శంకర్ రావులు జెండా ఊపి మాట్లాడారు. ఇప్పటివరకు 742 మందినీ కంటి ఆపరేషన్లు చేయుటకు పంపగా 736 మందికి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్స్ విజయవంతంగా నిర్వహించి అందరికీ కళ్లజోళ్లు కలెక్టర్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మారుతి నర్సింగ్ కళాశాల లయన్ క్లబ్, వాసవి క్లబ్ యూఎస్ఏ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంతో శ్రమించి విజయ వంతం చేయుటంలో తనదైన ముద్రను వేశారు. లయన్ డా.ఎస్ఎల్ కాంతారావు, అధ్యక్షులు రెడ్ క్రాస్ జిల్లా లయన్ వేగి సూర్యనారాయణ, స్టేట్ రెడ్ క్రాస్ కౌన్సిల్ మెంబర్ సీతారాం రెడ్డి, సెక్రటరీ, నర్సింగ్ స్టాఫ్, విద్యార్థినులు, కంటి ఆపరేషన్ కోసం వెళ్ళే వారి బంధువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ 742 మందికి నేత్రదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియ చేసారు.

షేక్ ఫాతిమా జయంతి వేడుకలు

నవతెలంగాణ-టేకులపల్లి

జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలేతో కలిసి విద్యా బోధన చేసిన భారతదేశపు మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 192వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్టు గురువారం కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి తెలిపారు. ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ ఆలీ, శంకర్ రావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, యాకూబ్ పాషా, వరలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-బూర్గంపాడు

శ్రీ సరస్వతి శిశుమందిర్ బూర్గంపాడు పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు, పేరెంట్స్‌కి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కార్యదర్శి ఇమడా బత్తుని వెంకటేశ్వర్లు, రిటైర్డ్ వెటర్నటీ అధికారి మలిశెట్టి భాస్కర రావు, పాల సంతోష్ రెడ్డి, మేడూరి సుబ్రహ్మణ్యం, ఓరుగంటి సురేష్ కుమార్, శ్రీనివాస రావు, పొదిల హిమ వంతు కుమార్, సూర్య కుమారి, ప్రభావతి, కిరణ్ మై, పాఠశాల ప్రధాన ఆచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్ళవారిగూడెం శివాలయంలో చోరీ

- హుండీ అపహరించి నగదు దోపిడీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండల పరిధిలోని మామిళ్ళవారిగూడెం శివాలయంలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. అందులోని హుండీని అపహరించి సమీపంలోని స్మశాన వాటికలో ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆలయ వ్యవహారాలు చూసే సింగలదేవి కనకం, చిందిరాల నాగేందర్‌లు స్థానిక పోలీస్ స్టేషన్ మౌఖిక ఫిర్యాదు చేసారు. పోలీస్ సిబ్బంది విచారణ చేపట్టారు. ఈ విషయం అయి ఎస్‌హెచ్ఓ ఎస్ఐ యయాతి రాజును వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈ ఆలయం హుండీ సంవత్సరానికి ఒక సారి లెక్కిస్తారు. ఈ లెక్కన హుండీలో సుమారు రూ.30 వేలు పై చిలుకు ఉండొచ్చని నిర్వాహకులు అభిప్రాయ పడుతున్నారు.

పర్ణశాలలో కోలాహలంగా రాములోరి తెప్పోత్సవం

- విద్యుత్ కాంతుల నడుమ విహరించిన సీతారామ లక్ష్మణ స్వాములు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పవిత్ర పర్ణశాల రామాలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన తెప్పోత్సవం కోలాహలంగా సాగింది. సాయంత్రం నాలుగు గంటలకు సీతారామ లక్ష్మణ స్వాములను పల్లకిపై ఆసీనులను చేసి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచాతో పవిత్ర గోదావరి నది తీరానికి తీసుకువచ్చారు. గోదావరి నదిలో స్వామివారు విహరించడానికి సిద్ధం చేసిన హంస వాహనం సంప్రోక్షణ అనంతరం హంస వాహనంపై స్వామివారిని కూర్చుండబెట్టి గోదావరి నదికి హారతులు ఇచ్చి పవిత్ర గోదావరి నదిలో పురోహితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారు ఐదుసార్లు విహంగ వీక్షణం చేశారు. ఈ సందర్భంగా గోదావరి నది తీరం మిరుమిట్లు గొలిపే బాణసంచాతోపాటు భక్తుల రామనామస్మరణతో మార్మోగింది. ఈ ఏడాది నిర్వహించిన తెప్పోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనే చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని శంకర్, తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, సీఐ బొడ్డు అశోక్, ఎస్సై వెంకటప్పయ్య, గణేష్, పర్ణశాల రామాలయ ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ఇరిగేషన్ ఏఈలు రాజ్ సుహాస్, సంపత్, గిర్దవార్లు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వేద పండితులు, పురోహితులు దామెర నరసింహచార్యులు, శేషం కిరణ్ కుమార్ చార్యులు, భార్గవచార్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రాక్షపల్లి దేవాలయం మందు వైకుంఠ ఏకాదశి వేడుకలు

- ఆలయధర్మ కర్త దాసరి శ్రీలక్ష్మిరెడ్డి

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్



రుద్రాక్షపల్లి దేవాలయ లందు వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుతున్నట్లు ఆలయల ధర్మ కర్త శ్రీ లక్ష్మీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలోని శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నందు ఎంతో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి వేడుకలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 10వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలు నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక పూజకార్యక్రమాలు, భక్తులకు ఉత్తర ద్వార దర్శనం, తీర్థ ప్రసాదంలు, అన్న ప్రసాదంలు, స్వామి వారికి భక్తితో కూడిన పాటలు, కోలాట ఊరేగింపు వంటి ప్రత్యేక కార్యక్రమంలు కలవన్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం, ఆశీస్సులతో సుఖ సంతోషాలను, అష్ట ఐశ్వర్యలను పొందాలని ఆమె భక్తులను కోరారు

యూటీఎఫ్ క్యాలెండర్, ప్యాకెట్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ- కల్లూరు

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, ప్యాకెట్ డైరీని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయ దయానంద్ పుల్లయ్య బంజర అంగన్వాడి సెంటర్ వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, తాసిల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, కే.విజయ్ కుమార్, మండల అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.సోమ్లా నాయక్, కోశాధికారి వి.శ్రీనివాస్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ జి.సుధీర్, కార్యదర్శి ఏ.రాజు, సీనియర్ నాయకులు ఏ.చక్రవర్తి, ముఖ్య కార్యకర్తలు టంగుటూరి రాంబాబు కోట వెంకటేశ్వరావు, బి.రామ్ నాయక్, షరీఫ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లండన్ యూనివర్సిటీలో ఎంఎస్ పట్టా అందుకున్న మచ్చ సంధ్యారాణి

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని రావినూతల గ్రామపంచాయతీ పరిధిలోని బోనకల్ స్టేషన్‌కు చెందిన మచ్చ సంధ్యారాణి లండన్‌లోని యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్ పట్టాను ఛాన్సలర్ నుంచి గురువారం అందుకున్నారు. బోనకల్ స్టేషన్‌కి చెందిన మచ్చ గురవయ్య, రమాదేవిల ఏకైక కుమార్తె సంధ్యారాణి. సంధ్యారాణి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో గల వెంకటేశ్వర హైస్కూల్‌లో ఒకటవ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదువుకుంది. నాలుగో తరగతి నుంచి పదవ తరగతి వరకు చింతకాని మండలం నాగులవంచలో గల గ్లోబల్ హైస్కూల్ నందు చదువుకుంది. ఇంటర్మీడియట్ విజయవాడలోని నారాయణ కాలేజీ నందు పూర్తి చేసింది. బీటెక్‌ను హైదరాబాదులోని విబిఐటి ఘట్కేసర్ నందు పూర్తి చేసింది. ఎమ్మెస్ కోసం లండన్‌లోని బర్మ్గ్ యూనివర్సిటీలో చేరింది. ఎమ్మెస్ పూర్తి కావడంతో సంధ్యారానికి బర్మి యూనివర్సిటీ ఛాన్సలర్ ఎమ్మెస్ పట్టాను అందజేశారు. ఎమ్మెస్ పట్టాను పొందిన సంధ్యారాణిని పలువురు స్నేహితులు ఫోన్లు చేసి అభినందించారు అదేవిధంగా తల్లిదండ్రులు గురవయ్య, రమాదేవి ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. కుమార్తె ఎంఎస్ పట్టా పొందటంతో గురవయ్య స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

అలల ఊయలపై భద్రాద్రి రాముడు..!

అపురూపం రాములోరి జలవిహారం

- సీతారాముల జలవిహారం ముగ్ధ మనోహరం
- అశేష భక్తజన సందోహం
- హైలెస్సో హైలెస్సా అంటూ ఆ చూడాముచ్చటైన జంట నదీ విహారం
- దక్షిణ అయోధ్య భద్రాచలం మురిసి మెరిసింది

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం మహా పుణ్యక్షేత్రం పుణ్య తీర్థం కూడా ముక్కోటి వేడుక తరతరాలుగా సాంప్రదాయ బద్ధంగా ఇక్కడ వైభవంగా జరుపుతారు. ఈ ఏడాది శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంకాల సంధ్యా సమయాన భద్రాచల పవిత్ర పావన గౌతమి నదీ తీరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి జలవిహారం వేడుక కనుల పండుగగా కమనీయంగా రమనీయంగా నిర్వహించారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల రామాలయంలో తొలుత వేద పండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజభజంత్రీల సందడి నడుమ పల్లకిపై శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని వేంచేయింపచేసి భక్తుల జయ జయ ద్వానాలతో ఊరేగింపుగా పవిత్ర గోదావరి నది తీరానికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపు హంస వాహనంపై శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని కూర్చుండబెట్టి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి హారతులు ఇచ్చారు. వేద మంత్రాలను పఠించారు. విద్యుత్ కాంతులు మిరుమిట్లు గొలుపుతుండగా గోదారమ్మ పులకిస్తుండగా శ్రీరామ జయరామ అంటూ భక్తులు నినదిస్తుండగా వేదగోష పరిమళాలు వెదజల్లుతుండగా ఆ చూడాముచ్చటైన అపురూప జంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారు జలవిహారం చేసిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. బాణాసంచా సందడి భక్తులను అలరించింది. పవిత్ర గోదావరి నది తీరంలో ఐదు సార్లు హంస వాహనంపై తిరుగుతూ వైకుంఠ రాముడు భక్తులకు సాక్షాత్కరించారు. మరోవైపు రకరకాల విద్యుత్ కాంతులతో బాణాసంచా కాల్చిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. గోదావరి ఇసుక తిన్నలపై కూర్చొని కనులారా ఈ వేడుక తిలకించిన భక్తజన హృదయాలు ఉప్పొంగాయి. శ్రీరామ..జయ రామ అంటూ భక్తులు చేసిన జయ జయ ద్వానాలు మిన్నంటాయి. గోదావరి తీరం అంతా జనసంద్రమైంది. గోదావరి తీరం వద్ద ప్రత్యేక ఆకర్షణగా ఈసారి అధికారులు తీసుకున్న చర్యలు భక్తులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాచలంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ స్వామివారి తెప్పోత్సవ వేడుకలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, దేవాలయ వేద పండితులు, ఉద్యోగులు,అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.







రాజేశ్వర రావు సేవలు మరువలేనివి

నవతెలంగాణ-మణుగూరు



మైనింగ్ రంగంలో అపారమైన అనుభవం, కార్మిక సంక్షేమం పట్ల అంకితభావం కలిగి సమిష్టి సృషి ద్వారా నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు గడువు కంటే ముందే సాధించడంలో గని మేనేజర్‌గా బి.రాజేశ్వర రావు పాత్ర మరువలేనిదని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి తెలిపారు. మణుగూరు ఓసీ నుంచి బదిలీ పై కొత్తగూడెం జెవిఆర్ ఓసీకి వెళుతున్న రాజేశ్వర రావును గని టీబీజీకేఎస్ నాయకులు మురళీ కృష్ణ, కటారి ప్రసాద్, నాయుడు సతీష్, లెక్కల శంకరయ్య, బీరయ్య, రమేష్‌లు పూల మాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ దిశ నిర్దేశం, గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసచారి తోడ్పాటు ద్వారా మణుగూరు ఓపెన్ కాస్ట్‌ను మోడల్ మైన్‌గా నిలిపేందుకు ఆయన కృషి మరువలేనిదని తెలిపారు. మణుగూరు ఓపెన్ కాస్ట్ అనుమతులు దగ్గర పడుతున్న సమయంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గని విస్తరణ కోసం ఆయన చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్, బంగారి పవన్ కుమార్, మురళీ కృష్ణ, బంగారి కటారీ ప్రసాద్, నాయుడు సతీష్, లెక్కల శంకరయ్య, బీరయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో హాస్టల్ సౌకర్యాలు

- కార్పొరేట్ విద్యానందిస్తున్న గ్రేస్ మిషన్ పాఠశాల
- బిషప్ ఎం.జాకబ్

నవతెలంగాణ-మణుగూరు



మండలంలోని వాగు మల్లారంలో గ్రేస్ పాఠశాల, ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో హాస్టల్ వసతులు కార్పొరేట్ స్థాయిలో ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యమైన విద్యనందిస్తున్నామని గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బిషప్ ఎం.జాకబ్ అన్నారు. గురువారం హాస్టల్ విద్యార్థినీ, విద్యార్థులకు సుమారు 630 మందికి వివిధ రకాల వస్తువులు దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు బ్లాంకెట్ షర్ట్, చీరలు, స్వీట్ ప్యాకెట్, ఐజెనిక్ కిట్ అందజేశారు. గ్రేస్ మిషిన్ స్కూల్ విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. చైర్మెన్ జాకబ్ మాట్లాడుతూ... ఏజెన్సీలో మారుమూల ప్రాంతంలో గత 32 సంవత్సరాలుగా ఉత్తమ విద్యనందిస్తూ, పేద కుటుంబాలకు విద్యను అందిస్తున్న ఏకైక సంస్థ గ్రేస్ మిషన్ పాఠశాల అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనందిస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా మన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానంలో ఉంచడం కోసం నిష్ణాతులైన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులతో పాఠశాలను బోధన నిర్వహిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నామన్నారు. ఆధునిక వసతులతో హాస్టల్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలాంటి వసతులను విద్యార్థులు ఉపయోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎల్ ప్రసాద్, మణుగూరు ఇన్‌చార్జి కే.పుల్లయ్య, వెంకటేశ్వరరాజు, జెట్టి సామెల్, ఐటీఐ కె.హరీష్, ఐటీఐ ప్రిన్సిపల్ సుదర్శన్ రావు, పాఠశాల ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు, గ్రేస్ సిబ్బంది రమేష్, కెఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అనుదినం జనస్వరంతో..! 'నవతెలంగాణ' పయనం...!!

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్
- 'నవతెలంగాణ' నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ

నవతెలంగాణ-సత్తుపల్లి



ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా అనుదినం జనస్వరంతో నవతెలంగాణ దినపత్రిక ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా తన పయనాన్ని సాగిస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. నవతెలంగాణ-2025 క్యాలండరును ఎమ్మెల్యే రాగమయి దయానంద్ గురువారం తన నివాసం వద్ద ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ నవతెలంగాణ పత్రిక ప్రస్థానం గురించి కొద్దిసేపు ముచ్చటించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలోనూ, శ్రామిక జనానికి అండగా నిలవడంలోనూ నవతెలంగాణ పత్రిక పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొనే నవతెలంగాణ పత్రిక సమాజానికి ఎంతో అవసరముందన్నారు. ప్రజల కోసం నిత్యం పరితపించే నవతెలంగాణ లాంటి పత్రికను ఆదిరించడం ద్వారా అది ప్రజోపకారమవుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. నవతెలంగాణ పత్రిక యాజమాన్య బాధ్యులకు, నవతెలంగాణ పాత్రికేయ బృందానికి ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ పత్రిక సత్తుపల్లి నియోజకవర్గ రిపోర్టర్ చీనేని బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజలరాణి, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, వినుకొండ కృష్ణ, పవన్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి శ్రీవారి ఆలయం ముస్తాబు

- కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనమునకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే స్వామివారి సేవలు తొలుత శ్రీవారికి పంచామృతాలతో సర్వాంగ అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి దర్శనం ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. పద్మావతి అలివేలుమంగ దేవేరులతో కలిసి స్వామివారికి 10:30ని నిత్య కళ్యాణం ప్రారంభ మవుతుందని తెలిపారు. ఉత్తర ద్వార దర్శనంనకు విచ్చేయు భక్తులు దేవాలయం యొక్క వెనుక భాగంలో ఉత్తర ద్వారం గుండా మాత్రమే దర్శనానికి రావాలని తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాద వితరణతో పాటు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

90 మంది పేదలకు దుప్పట్లు, చీరెలు పంపిణీ

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో యంగ్ మెన్ క్రిస్టియన్(వైఎంసిఏ) ఆధ్వర్యంలో 90 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలను సంస్థ జిల్లా అధ్యక్షుడు బిజీ క్లేమెంట్, గేరా కార్తీక్ గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ వైఎంసీఏ ద్వారా అనేక రకాల సేవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జి.టీ సుధాకర్, జోర్డన్, పిల్లి విజయపాల్, చిలుక రాజశేఖర్, అంతోటి గురువులు, జోసెఫ్ రామారావు, యూనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్షులు కందుల ఉపేందర్, కార్యదర్శి అవుట మధు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మి నారాయణ, స్థానిక సంఘకాపరి థామస్, పెద్దమాల బిందె వెంకన్న, పెద్ద ఎత్తున యువకులు మహిళలు పాల్గొన్నారు.

స్త్రీశక్తి టీ స్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కారేపల్లి



మహిళాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద విజేత మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి పథకం క్రింద రూ.1.35 లక్షలతో ఏర్పాటు చేసిన స్త్రీ టీ స్టాల్ ను, తోడితలగూడెంలో రూ.1.39 లక్షలతో ఏర్పాటుచేసిన నాటు కోళ్ళ పిల్లల పెంపకం ఫారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి కాంగ్రెసు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా రుణాలను అందించి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు.జీరో వడ్డీకే రుణాలను అందించాలని సంకల్పించినట్లు తెలిపారు. రైతు భరోసా నిధులు ఈనెల 26 నుండి అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, డీటీ లక్ష్మి, ఎంఈవో జయరాజు, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాష్, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాప్(టోనీ), అడ్డగోడ ఐలయ్య, బానోత్ దేవ్లానాయక్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో రాజీపడని వ్యక్తి సీతారామయ్య

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-వేంసూరు

విశ్రాంతి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తక్కెళ్ళపాటి సీతారామయ్య బుధవారం అనారోగ్యంతో ఖమ్మంలో మృతి చెందిన విషయం విదితమే. కాగా గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామయ్యకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. విధి నిర్వహణలో నిబద్ధతతో 1974 బేతుపల్లి కెనాల్ కాలువ డిజైన్ పట్టుదలతో పూర్తి చేయటం వలనే నేడు కరువు మండలమైన వేంసూరు మండలంలో అన్ని చెరువులకు నీటిని అందించగలుగుతున్నామనానరు. అటువంటి వారు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. మంత్రితో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు, సీపీఐ(ఎం) నాయకులు నివాళులర్పించారు

ఐకెపి ఎపిఎంగా కట్ట సురేంద్రబాబు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ- బోనకల్



మండల ఐకెపి ఎపిఎంగా కట్టా సురేంద్రబాబు గురువారం ఐకెపి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న యద్దనపూడి పద్మలత ఖమ్మంరూరల్ బదిలీ కాగా కామేపల్లిలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న కట్ట సురేంద్రబాబును బోనకల్ ఏపీఎంగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వెంటనే సురేంద్రబాబు మండల కేంద్రంలో గల ఐకెపి కార్యాలయంలో అధికార బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంగా తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అధికార బాధ్యతల స్వీకరించిన సురేంద్రబాబును పలువురు సీసీలు, ఐకెపి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆరోగ్యమ్మ జ్ఞాపకాలు మా మదిలో చిరస్మరణీయం

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- ఘనంగా మూడో వర్ధంతి

నవతెలంగాణ-సత్తుపల్లి

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాతృమూర్తి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అత్తగారైన డాక్టర్ మట్టా ఆరోగ్యమ్మ మూడో వర్ధంతిని వారి నివాసం వద్ద గురువారం ఘనంగా జరిపారు. ఆరోగ్యమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఆమె తనకు అత్తలా కాకుండా తల్లిని మరిపించేలా చూసుకొనేవారన్నారు. ఆమె మాతో పంచుకున్న జ్ఞాపకాలు మా మదిలో ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉండిపోతాయన్నారు. ఆమె స్ఫూర్తితోనే జనంతోనే మా పయనం సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజలరాణి, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, వినుకొండ కృష్ణ, గోలి శ్రీనివాసరెడ్డి, కె. ప్రభావతి పాల్గొన్నారు.

ఆరోగ్యమ్మ సమాధి వద్ద దయానంద్ నివాళులు

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గురువారం విరాట్‌నగర్ సమీపంలోని క్రైస్తవ స్మశాన వాటికలోని తన తల్లి ఆరోగ్యమ్మ సమాధిపై పూలుజల్లి నివాళులర్పించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. దయానంద్ వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.

'తిలక్' సేవలు అమూల్యమైనవి

- నవతెలంగాణ విలేకరికి ఘనంగా నివాళులర్పించిన జర్నలిస్టులు, యాజమాన్యం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హనుమకొండ జిల్లా కోశాధికారి, శాయంపేట నవతెలంగాణ విలేకరి బాల్నె తిలక్ సేవలు అమూల్యమైనవని, ఆయన మృతి ఫెడరేషన్‌కు, నవతెలంగాణ కుటుంబానికి తీరని లోటని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్కా దయాసాగర్, నవతెలంగాణ మొఫషియల్ ఇన్‌చార్జి గుత్తా వేణుమాధవ్‌రావు, ఫెడరేషన్ హన్మకొండ, వరంగల్ అధ్యక్షులు టీవీ రాజు, పోడేటి అశోక్ అన్నారు. గురువారం వరంగల్ జిల్లా శాయంపేటలో బాల్నె తిలక్ సంస్మరణ దినం సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. 20 ఏండ్లుగా నవతెలంగాణలో జర్నలిస్టుగా అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేసిన తిలక్ అకాల మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. నవతెలంగాణ అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారని, ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా తిలక్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. తిలక్ కుటుంబానికి నవతెలంగాణ పత్రిక ఎల్లవేళలా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.

తిలక్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిలక్ కుటుంబానికి నవతెలంగాణ పత్రిక సిబ్బంది సేకరించిన ఆర్థిక సాయాన్ని మేనేజర్ బి. దేవేందర్‌రావు, మొఫషియల్ ఇన్‌చార్జి గుత్తా వేణుమాధవ్‌రావు, స్టాఫ్ రిపోర్టర్ బొక్కా దయాసాగర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్, హన్మకొండ జిల్లా కార్యదర్శి పొలిమెర గోపాల్, ములుగు జిల్లా అధ్యక్షులు, ములుగు జిల్లా విలేకరి పిట్టల మధు, జయశంకర్-భూపాలపల్లి జిల్లా విలేకరి ఎర్రం సతీష్, నర్సంపేట నియోజకవర్గ విలేకరి పోడేటి అశోక్, నవతెలంగాణ సిబ్బంది జె.మహేష్, జి.శ్రీనివాస్, ప్రశాంత్, పాషా, కె. ప్రభాకర్, ఎస్ రంగారావు, జి రాజిరెడ్డితోపాటు తదితర విలేకర్లు పాల్గొన్నారు.

చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- చెరువుల ఆక్రమణలు పరిశీలన
- ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం



నవతెలంగాణ-శంషాబాద్

చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లవానికుంట, ధర్మోజికుంటలో ఇటీవల అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు ఇటీవల ఆ చెరువులను సందర్శించారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆగకపోవడంతో మళ్లీ మీడియాలో కథనాలు వచ్చాయి. దీనికి స్పందించిన హైడ్రా కమిషనర్ గురువారం ఆక్రమణలు జరిగిన ఆ రెండు చెరువులను స్వయంగా పరిశీలించారు. చెరువులో నిర్మిస్తున్న అక్రమ ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలను గురించి స్థానిక అధికారులను అడిగి వివరాలు సేకరించారు. 111 జీవో పరిధిలోని చెరువులు కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేస్తుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ అక్రమ నిర్మాణాలు చేపట్టేవారు ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టబోమని కమిషనర్ స్పష్టం చేశారు. పరిశీలించిన వారిలో ఆయనతోపాటు ఇరిగేషన్ అధికారి మౌనిక, ఆర్ఐ కృష్ణ, తదితరులు ఉన్నారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించిన జిల్లా జడ్జి

- విద్యార్థులను చితకబాదిన ఘటనపై విచారణ



నవతెలంగాణ-కొండపాక

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సిద్దిపేట జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతి రెడ్డి గురువారం సందర్శించారు. పాఠశాలలో బుధవారం విద్యార్థులను పీడీ చితకబాదడం, ఆస్పత్రిలో చికిత్స చేయించిన విషయాన్ని తెలుసుకొని పాఠశాలను సందర్శించినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన సంఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పీడీ వ్యవహరించిన తీరును విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అరగంట ఆలస్యమైనందుకు తమను పీడీ కొట్టాడని తెలిపినట్టు వివరించారు. ఇది మొదటిసారి జరిగిందని, మాకు పీడీ వాసు అవసరం లేదని విద్యార్థులు తేల్చి చెప్పినట్టు జడ్జి తెలిపారు. అదేవిధంగా హాస్టల్ పరిసరాలను జడ్జి పరిశీలించారు. స్నానాల గదులు, మరుగుదొడ్ల కంపు కొడుతున్నాయని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలవనున్నట్టు చెప్పారు. సంఘటన వివరాలను విద్యార్థుల నుంచి దరఖాస్తు ద్వారా స్వీకరించారు.

అత్యవసర విచారణకు సుప్రీం నో

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


ఫార్ములా ఈ-రేస్ అక్రమాలపై ఏసీబీ నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో గురువారం కేటీఆర్ న్యాయవాది చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఈ కేసు విచారణను ఈనెల 15న చేపడతామని తేల్చి చెప్పింది. ఈ నెల 7వ తేదీ(మంగళవారం) తెలంగాణ హైకోర్టు తనపై దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేటీఆర్ అదే రోజు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్ రావు సుప్రీంకోర్టులో మొత్తం 430 పేజీలతో కూడిన పిటిషన్ దాఖలు చేశారు. తమ క్వాష్ పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టులో ఊరట దక్కలేదని, అందువల్లే రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 ప్రకారం ఈ పిటిషన్‌ను దాఖలు చేస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. తన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టులో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయమని కోరితే అందుకు న్యాయస్థానం అంగీకరించలేదని తెలిపారు. అందువల్ల హైకోర్టు తీర్పును రద్దు చేసేలా తగిన ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. కాగా ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బుధవారం కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్ రావు రిజిస్ట్రార్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని ప్రొసీడింగ్స్ ప్రకారం రిజిస్ట్రార్ సీజేఐకు నివేదించగా.. ఈ అభ్యర్థన ఆధారంగా సీజేఐ ఈ కేసు విచారణను ఈ నెల 15వ తేదీకి కేటాయిస్తూ జాబితాలో లిస్ట్ చేశారు. అయితే... గురువారం ఈ విషయాన్ని మరోసారి కేటీఆర్ తరపు సీనియర్ న్యాయవాది రాజీవ్ షిడ్ ఖర్, న్యాయవాది మోహిత్ రావు సీజేఐ బెంచ్ ముందు మెన్షన్ చేశారు. నేడు(శుక్రవారం, 10వ తేదీ) విచారించాలని కోరారు. అయితే దీనిపై స్పందించిన సీజేఐ... అత్యవసర విచారణకు నిరాకరించారు. ఇప్పటికే కేసు విచారణను 15వ తేదీకి కేటాయించినట్టు స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో తెలంగాణ తరపు స్టాండింగ్ కౌన్సిల్ సైతం పిటిషనర్ విజ్ఞప్తిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన సీజేఐ... 15వ తేదీనే విచారణ చేపడతామని ఇరువర్గాలకు స్పష్టం చేశారు. కాగా... శుక్రవారం న్యాయమూర్తుల కీలక సమావేశం ఉందని కేటీఆర్ తరపు అడ్వొకేట్ మీడియాకు తెలిపారు. ఈ సమావేశం కారణంగా శుక్రవారం సుప్రీంకోర్టులోని టాప్ 5 కోర్టుల విచారణ జాబితాలో తక్కువ కేసులు ఉన్నట్లు చెప్పారు. మధ్యాహ్నం తర్వాత ఈ బెంచ్‌లు కూర్చునే అవకాశం లేదన్నారు. అందువల్ల 10వ తేదీన తమ పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని సుప్రీంకోర్టు వెల్లడించిందని మోహిత్ రావు వివరించారు.

బాలికా ఆత్మరక్షణ విద్యకు బాలారిష్టాలు

అమలుకు నోచని రాణి లక్ష్మిబాయ్ ఆత్మరక్షా ప్రశిక్షణ్

- అమలుకాని సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం
- 2025 ఫిబ్రవరితో ముగుస్తున్న శిక్షణా కాలం

ఆరంభానికి ముందే అవాంతరాలు



5748 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ

నవతెలంగాణ - రామగుండం

కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ సమగ్రశిక్ష పథకం కింద ప్రవేశపెట్టిన 'రాణి లక్ష్మిబాయ్ ఆత్మరక్షా ప్రశిక్షణ్'కు ఆరంభంలోనే అవాంతరాలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేలా ఆత్మరక్షణ విద్య పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికి సంబంధించిన సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ డీఈవోలకు ప్రొసీడింగ్స్ పంపించింది. విద్యాశాఖ నుంచి స్కూల్ జనరల్ ఫండ్ నిధులు బదిలీ అయ్యి ప్రధానోపాధ్యాయుల ద్వారా చెక్కుల రూపంలో కరాటే శిక్షకులకు చెల్లించేలా నిబంధనలు రూపొందించారు. ఈ కరాటే శిక్షణ ఫిబ్రవరి వరకే పూర్తవ్వాల్సి ఉన్నా ఇంతవరకు ప్రారంభించనేలేదు.

2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా 5748 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. సెప్టెంబర్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 వరకు మూడు నెలల్లో వారానికి 3 సెషన్ల వారీగా శిక్షణ ఇవ్వాలి. ఇప్పటికే ఈ ఆత్మరక్ష విద్యా శిక్షణ ప్రారంభమై చివరి దశకు చేరుకోవాల్సి ఉన్నా పెద్దపల్లి జిల్లా రామగుండం ఉమ్మడి మండలంలో ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ప్రధానోపాధ్యాయులను దీనిపై వివరణ అడిగితే డీఈవో నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే మొదలు పెట్టాలని చెబుతున్నారు.

ఆగస్టులోనే ఆదేశాలు..

రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ నుంచి గత ఆగస్టులోనే జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రొసీడింగ్స్ అందించారు. అయినా శిక్షణ ప్రారంభించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పు పడుతున్నారు. పెద్దపల్లి జిలాల్లో ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున 199 పాఠశాలలకు రూ.17.85 లక్షల నిధులు సమగ్ర శిక్ష నుంచి కేటాయింపు జరగాలి. ఈ క్రమంలో ప్రావీణ్యులైన శిక్షకులను ఎంపిక చేసుకొని విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇవ్వాల్సి ఉంది. గత విద్యా సంవత్సరంలో శిక్షణ ఇచ్చిన వారి వివరాలనే ఈసారి జిల్లా విద్యా అధికారి అనుమతి కోసం పంపి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేచి చూస్తున్నట్టు తెలుస్తోంది. శిక్షణకు తక్కువ సమయం మిగిలి ఉండటంతో కరాటే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారో లేదోననే సందేహం విద్యార్థినుల్లో నెలకొంది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

రాణి లక్ష్మిబాయ్ ఆత్మరక్షా ప్రశిక్షణ్‌పై ఆదేశాలు ఆలస్యంగా వచ్చాయి. నిధుల మంజూరు కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. గతంలో అర్హులైన శిక్షకులు లేక కరాటే తరగతులు సరిగా నిర్వహించలేదు. అర్హత కలిగిన సరైన శిక్షకులను ఎంపిక చేసుకోవాలని అన్ని పాఠశాలలకూ చెప్పాం.

- మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి

శిక్షకుల వివరాలు పంపించాం..

జిల్లా విద్యాశాఖ నుంచి స్ప్రెడ్ షీట్లు అందాయి. కరాటే శిక్షకుల వివరాలు విద్యాశాఖ అధికారికి పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే శిక్షణా తరగతులు ప్రారంభిస్తాం.

- ఏకాంబరం ఎంఈవో, అంతర్గాం

ఏకాగ్రతతో ఏదైనా సాధించగలం

- స్పిక్ మాకే వ్యవస్థాపకులు డాక్టర్ కిరణ్ సేథ్
- శ్వాస అభ్యాసాన్ని ప్రతి విద్యార్థి వద్దకు ఓ ఉద్యమంలా తీసుకెళ్లాలి
- 'గీతం' విద్యార్థులకు ఉద్బోధన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఏకాగ్రతతో సాధన చేస్తే ఎటువంటి లక్ష్యాలనైనా సులువుగా సాధించవచ్చని, మనకు వారసత్వంగా సంక్రమించిన ఉచ్వాస, నిశ్వాస పద్ధతులను రోజువారీ, అంతరాయం లేకుండా ఆచరించాలని స్పిక్ మాకే వ్యవస్థాపకులు, ఐఐటీ ఢిల్లీ పూర్వ ఆచార్యులు డాక్టర్ కిరణ్ సేథ్ గీతం విద్యార్థులకు ఉద్బోధించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'వారసత్వ ప్రతిధ్వనులు'పై గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని గీతం యూనివర్సిటీలో విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆధునిక అభ్యాస, పరిశోధనా పద్ధతులను ఏకీకృతం చేస్తూ పూర్వీకులు వారసత్వంగా ఇచ్చిన జ్ఞాన సంపదను అర్థం చేసుకోవడం, విలువైనదిగా భావించడం, ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పాశ్చాత్య పరిశోధనా పద్ధతుల పట్ల సమతుల్య దృక్పథం ప్రాముఖ్యతను వివరిస్తూ, మన దేశం ప్రపంచానికి అందించే లోతైన వారసత్వాన్ని గుర్తిస్తూనే, పశ్చిమ దేశాల్లోని ఉత్తమమైన వాటిని నేర్చుకోవాలని సూచించారు. మన వారసత్వం ఔచిత్యాన్ని గురించి ఆలోచించడానికి విద్యార్థులు సమయాన్ని కేటాయించాలని, సాంస్కృతిక మూలాల నుంచి విడిపోవడానికి దారితీసే ఆచారాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్న ఈ ప్రపంచంలో, డాక్టర్ సేథ్ ఏకాగ్రత, బుద్ధిని పెంపొందించడానికి ఆచరణాత్మక శ్వాస వ్యాయామాలను (ఉచ్వాస, నిశ్వాసాలు) సాధన చేయించారు. కళల ద్వారా లోతుగా ప్రభావితమైన ఐన్ స్టీన్, స్వామి వివేకానంద, రామానుజం వంటి విజయవంతమైన వ్యక్తుల ఉదాహరణలను ఉటంకిస్తూ, డాక్టర్ సేథ్ శాస్త్రీయ సంగీతం, అభిజ్ఞా వికాసం మధ్య సమాంతరాలను కూడా చూపించారు. ఈ శ్వాస అభ్యాసాన్ని దేశంలోని ప్రతి విద్యార్థి వద్దకు ఓ ఉద్యమంలా తీసుకెళ్లాలని సూచించారు. తొలుత గీతం యూనివర్సిటీ (హైదరాబాద్) అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ వీఆర్ శాస్త్రి తదితరులు డాక్టర్ కిరణ్ సేథ్‌ను స్వాగతించి సత్కరించారు.

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట

స్పిక్ మాకే సౌజన్యంతో గురువారం నిర్వహించిన 'లెదర్ పప్పెట్రీ థియేటర్' (తోలు బొమ్మలాట) గీతం విద్యార్థులను విశేషంగా ఆకర్షించి, వారిలో నూతనోత్తేజాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లాలోని నిమ్మలకుంటకు చెందిన సింధే హనుమంతరావు నేతృత్వంలోని కళాకారుల బృందం ఈ సంప్రదాయ ప్రదర్శనను గణేశుని ప్రార్థనతో ఆరంభించి, రామాయణంలోని సుందరకాండను ప్రదర్శించింది. ఈ ఆకర్షణీయమైన ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

వృత్తిదారులను ఆదుకునేందుకు కృషి

- బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్
- ఎస్‌వీకెలో 'రజక వృత్తి ఆధునీకరణ-ఉపాధి కల్పన'పై సదస్సు



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణలో వృత్తిదారులందరినీ ఆదుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన 'రజక వృత్తి ఆధునీకరణ, ఉపాధి కల్పన' అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తుల ఆధునీకరణ-ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. వృత్తులను అభివృద్ధి పరిచి ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేయబోతుందని చెప్పారు. చేతివృత్తుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో అభిమానంతో ఉన్నారని, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీ కమిషన్ సభ్యులు బాల లక్ష్మి మాట్లాడుతూ.. రజకుల ఆత్మగౌరవం, విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రజక వృత్తులపై జరుగుతున్న కుల వివక్ష, అవమానాలను అరికట్టడానికి తగిన రక్షణ చట్టాలు అవసరమని చెప్పారు. వృత్తుల ఆధునీకరణ, ఉపాధి కల్పనకు తగిన ప్రణాళికలు, బీసీ కమిషన్ ద్వారా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

రజక ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య తీర్మానం ప్రవేశపెడుతూ.. రజక వృత్తిదారులకు రుణాలు అందించాలని, ఉపాధి కల్పనకు మేకనైజ్ లాండ్రీలు ఏర్పాటు చేయాలని, ఉచిత విద్యుత్ పాత బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి.రమణ, ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలకృష్ణ, సి.మల్లేష్, మరియాల గోపాల్, జ్యోతి ఉపేందర్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఎస్.సుభద్ర చిట్యాల మంజుల, పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.

వీడిన హత్య మిస్టరీ

- కత్తితో పొడిచి, మర్మాంగాలు పిసికి హత్య
- ఆరుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- సూర్యాపేట డీఎస్పీ రవి వివరాలు వెల్లడి



నవతెలంగాణ-చివ్వెంల

తెల్లవారితే కొత్త సంవత్సరం అనగా.. అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్‌ను వెంబడించి దారుణంగా హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సూర్యాపేట డీఎస్పీ రవి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 31న అర్ధరాత్రి సమయంలో మండలంలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన ధరావత్ శేషును అదే తండాకు చెందిన దీపక్ తన కుటుంబ సభ్యులతో కలిసి హత్య చేశాడు. కొంతకాలంగా ధరావత్ శేషు, ధరావత్ వెంకన్న, ఏఎస్ఐగా పనిచేస్తున్న ధరావత్ శ్రీను మధ్య వ్యవసాయ భూమి వద్ద గెట్టు పంచాయితీ జరుగుతోంది. ఈ విషయంపై 2017లో గొడవలు జరిగి పరస్పరం కేసులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో శేషును చంపాలని వెంకన్న కొడుకు దీపక్ మనసులో పెట్టుకున్నాడు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న శేషు గత నెల 31న విధులు ముగించుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో లక్ష్మణ్ నాయక్ తండా దగ్గరలోని ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి అక్కడ ధరావత్ దీపక్, అతని స్నేహితులు ధరావత్ రాజేష్, ధరావత్ సురేశ్, జర్పుల ప్రవీణ్ కూర్చొని మద్యం తాగుతూ అరుస్తున్నారు. దాంతో శేషు మోటార్ సైకిల్ ఆపి వారి వద్దకెళ్లాడు. గతంలో ఉన్న భూమి తగాదాలు మనసులో పెట్టుకున్న దీపక్.. ఇన్నాళ్లకు దొరికావురా అంటూ తన స్కూటర్‌లో ఉన్న కత్తి తీసి శేషును పొడిచాడు. అక్కడ ఉన్న రాజేష్, సురేశ్, ప్రవీణ్ పరారయ్యారు. ఆ సమయంలో దీపక్ తన తండ్రి వెంకన్న, తల్లి సుజాతను కూడా పిలిచాడు. అయితే, తీవ్రంగా గాయపడిన శేషు భయంతో పరిగెత్తి తండాలోని చివరన ఉన్న వాంకుడోత్ రంగా ఇంట్లోకి వెళ్లి దాచుకున్నాడు. దీపక్, తండ్రి వెంకన్న, తల్లి సుజాత ఆ ఇంట్లోకి వెళ్లి శేషును పట్టుకొని కత్తితో గొంతు కోసి, కడుపులో పొడిచి, మర్మాంగాలు పిసికారు. దాంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై శేషు భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. హత్య అనంతరం నిందితులు పరారీలో ఉన్నారు. గురువారం కోటి నాయక్ తండాలో బంధువుల ఇంట్లో తలదాచుకున్న నిందితులు ధరావత్ దీపక్, వెంకన్న, సుజాత, ధరావత్ రాజేష్, ధరావత్ సురేశ్, జర్పుల ప్రవీణ్‌ను పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ధరావత్ శ్రీను పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి నాలుగు సెల్ ఫోన్స్, మూడు మోటార్ సైకిల్స్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సూర్యాపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ వి.మహేష్ సిబ్బంది జి.వెంకన్న, యస్. గోవర్ధన్, కె.సుధీర్, యం.వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.

ముంచుకొస్తున్న ఆహార కొరత..?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావం చూపిస్తాయి" అని డీజీ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. అదే విధంగా భూతాప ప్రభావంతో హిమాలయాలతోపాటు దిగువన మైదానాల్లో నివసిస్తున్న కోట్లాది మంది నీటి కొరతతో ఇబ్బందిపడతారని భూశాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల ప్రభావంపై మృత్యుంజయ్, రవిచంద్రన్‌లు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక అంశాలు వెల్లడించారు.

ముందస్తు అంచనాలు కష్టమే..

"మనుషుల మాదిరిగానే చేపలు కూడా చల్లని నీటికి ప్రాధాన్యం ఇస్తాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ అవి తీరం నుంచి దూరంగా వెళ్లిపోతాయి. ఈ పరిణామం చేపల వేటపై, దానిపై ఆధారపడిన వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది" అని రవిచంద్రన్ పేర్కొన్నారు. వాతావరణ మార్పుల్లో అస్థిరత కారణంగా వాతావరణ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. తక్కువ విస్తీర్ణంలో, స్వల్ప వ్యవధిలోనే అనేక వాతావరణ సంఘటనలు ఏర్పడుతున్నాయన్నారు. భవిష్యత్తులో నీటి లభ్యత తగ్గుతుందన్న ఆయన.. భారత్, చైనా దేశాల్లో కోట్లాది మందికి ఇది ఆందోళనకర అంశమన్నారు.

140కోట్లకుపైగా జనాభా కలిగిన భారత్‌లో వరి, గోధుమలు ప్రధాన ఆహారం. సగానికిపైగా పౌరులకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఈ ఆహార ధాన్యాలు చౌక ధరలో లభిస్తుంటే..మిగతా సగం జనాభా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళారీ వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోకపోవటంతో..ధరలు ఎగిసిపడుతున్నాయి.. దేశంలో 2023-24లో గోధుమ ఉత్పత్తి 113.9 మిలియన్ టన్నులుగా ఉంది. ఇది ప్రపంచ ఉత్పత్తిలో 14శాతం. వరి ఉత్పత్తి 137 మిలియన్ టన్నులు. అయితే, నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్ ప్రకారం, 2100 నాటికి గోధుమ దిగుబడిలో 6-25శాతం తగ్గుదల కనిపించే అవకాశముంది. వరి దిగుబడి 2050 నాటికి 7శాతం, 2080నాటికి 10శాతం తగ్గుతుందని అంచనా వేసింది.

భద్రాచలంలో వైభవంగా ముగిసిన తెప్పోత్సవం

- సీతా లక్ష్మణ సమేతుడై హంస వాహనంపై విహారం
- మిరుమిట్లు గొల్పిన గోదారి.. వేలాదిగా సందర్శకుల వీక్షణ
- నేటి తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి / భద్రాచలం రూరల్

ముక్కోటి ఉత్సవాల్లో గోదారి అలలపై రామయ్య అలరించాడు. సీతా లక్ష్మణ సమేతంగా హంస వాహనంపై విహరించాడు. అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి భద్రాచలంలో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. మిరుమిట్లు గొలిపే కాంతుల్లో శ్రీరాముడు జలవిహారం గావించాడు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంలో నదిలో ఐదుసార్లు తెప్పోత్సవం నిర్వహించగా.. విద్యుత్ దీపాల అలంకరణతో కన్నుల పండువగా దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలతో భద్రాద్రి భక్తి పారవశ్యంలో మునిగి తేలింది. సకల రాజలాంఛనాల నడుమ ప్రధాన ఆలయంలోని లక్ష్మణ సమేత సీతారాములను అర్చకులు పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. వైకుంఠ ఏకాదశికి ముందు రోజు సాయంత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామికి పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. భక్త రామదాసు చేయించిన ఏడువారాల నగలతో సీతారాములను అలంకరించారు. తెప్పోత్సవం సందర్భంగా ఉత్సవం జరుగుతున్నంతసేపు సందర్శకుల దర్శనాలను నిలిపివేశారు. కండ్లు మిరుమిట్లు గొలిపే విధంగా బాణాసంచా కాల్చారు. ఆకాశంలో తారా జువ్వలు అంబరాన్ని అంటేవిధంగా చూపరులకు కనువిందు చేశాయి. ఈ వేడుకను కనులారా తిలకించేందుకు వేలాదిగా సందర్శకులు తరలివచ్చారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నేతృత్వంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌తో కలిసి భద్రాచలం ఏఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్ భద్రతా చర్యలు చేపట్టారు. మొత్తం 1200 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారంలో స్వామివారు దర్శనమిస్తారు. దాదాపు గంటపాటు సందర్శకుల సందర్శనార్థం స్వామివారిని ఉత్తర ద్వారంలో ఉంచుతారు.

హంస వాహనాధీశుడై..

రాములోరితో గోదావరికి విడదీయ లేని బంధం ఉంది. రామావతార పరమార్థాలైన దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ కార్యాలకు నాంది పలికింది గోదావరి తీరమేనని పండితుల భావన. వనవాసంలో ఎక్కువ సమయం భద్రాచలం సమీపంలోని పర్ణశాల గోదావరి తీరంలోనే శ్రీరాముడు గడిపారని చెబుతుంటారు. గోదావరి పుణ్యనదిలో నిర్వహించే తెప్పోత్సవం ఎంతో విశేషమైనది. పాలు, నీళ్లను వేరుచేసే స్వభావమున్న హంసపై విహరించటం అంటే చెడును వదిలి మంచిని స్వీకరించాలనే తత్వాన్ని ఇది ఉపదేశిస్తుంది.

మైక్రోసాఫ్ట్‌లో కోతలు..!

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. తమ కంపెనీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారిలో కొంత మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు మైక్రోసాఫ్ట్ వర్గాలు వెల్లడించాయని అంతర్జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో టెక్, ఐటి రంగంలోని ఉద్యోగుల్లో మళ్లీ ఆందోళన మొదలయ్యింది.

మైక్రోసాఫ్ట్‌లో మెరుగైన పనితీరు కనబరిచిన ఉద్యోగులను ప్రోత్సహిస్తామని, కొత్త విషయాలు నేర్చుకునేందుకు, వృత్తి జీవితంలో ఎదిగేందుకు తోడుంటామని.. కానీ పని చేయని వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మెరుగైన పనితీరు చూపించే వారి సంఖ్యను పెంచుకునే ప్రయత్నంలో భాగంగా కొంత మందిపై వేటు వేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపాయి. కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో సుమారు 1 శాతం మందిని తొలగిస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థ 2023లోనూ దాదాపు 10,000 మంది ఉద్యోగులను రోడ్డున పడేసింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 5 శాతంగా ఉంది. గత సంవత్సరం 2024లోనూ గేమింగ్ విభాగం నుంచి సుమారు 2000 మందికి ఉద్వాసన పలికింది.

ఆర్థిక ఒత్తిళ్లు, మాంద్యం భయాలు, సరికొత్త టెక్నాలజీ అమలు వ్యూహాల నేపథ్యంలో ఈ 2025లోనూ గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో లేఆఫ్స్ ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమ ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో పని చేస్తున్నామని గతంలో పలువురు టెకీలు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదన తెలియజేశారు. మందగమనం, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య ఇతర టెక్ కంపెనీల్లోనూ తొలుగింపులు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.



పీరియడ్ ట్రాకర్ యాప్

ఋుతు చక్రం... ఏముంది ప్రతి నెలా వచ్చేదేగా అని చాలా మంది సులువుగా తీసుకుంటారు. కానీ తమ ఆరోగ్యంపై దీని ప్రభావం ఎంతో ఉంటుందనే విషయాన్ని మహిళలు గుర్తించలేకపోతున్నారు. పీరియడ్స్ సరిగ్గా వస్తున్నాయా లేదో, నొప్పి వుంటే ఎంత తీవ్రంగా ఉంటుంది. అసలు ఎందుకు వస్తుంది. తనలో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై అస్సలు దృష్టి పెట్టడం లేదు. అలాంటి వన్నీ ట్రాక్ చేసేందుకు పీరియడ్ ట్రాకర్ యాప్‌ను సృష్టించారు ఇరా గుహా. అంతే కాదు అంతకు ముందు మెన్‌స్ట్రుల్ కప్‌లను కూడా పరిచయం చేశారు. పేద, గ్రామీణ మహిళలు, బాలికలకు కూడా ఇవి అందుబాటులో ఉండేలా వినూత్నమైన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.



ఇరా గుహా ఏప్రిల్ 2021లో హార్వర్డ్ ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా పేటెంట్ పొందిన అసన్ మెన్‌స్ట్రువల్ కప్‌ను ప్రారంభించింది. మెడికల్-గ్రేడ్ సిలికాన్‌తో తయారు చేయబడిన ఈ మెన్‌స్ట్రువల్ కప్ ప్రత్యేకమైన రిమూవల్ రింగ్‌ని కలిగి ఉంటుంది. ఇతర కప్పుల కంటే దీన్ని ఉపయోగించడం చాలా సులభం. ప్రతి అసన్ కప్ 10 ఏండ్ల పాటు పునర్వినియోగం చేసుకోవచ్చు. అంతేకాదు ఇది సుమారు 6,500 శానిటరీ నాప్‌కిన్‌లకు ప్రత్యామ్నాయంగా ఉంటుంది. 'ఒకటి కొనండి, ఒకటి విరాళంగా ఇవ్వండి' అంటూ విక్రయించే ఈ కప్ పేద మహిళలకు కూడా అందుబాటులో ఉంది. ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన స్త్రీలకి దీన్ని ఉచితంగా ఇస్తున్నారు

ఋుతు చక్రాలను ట్రాక్ చేయడం

ఇప్పటి వరకు అసన్ లక్ష కప్పులకు పైగా విక్రయించబడింది. ఆసియా, ఆఫ్రికా, యూకే, ఈయూ వంటి 12 దేశాలలో అందుబాటులో ఉంది. మెన్‌స్ట్రువల్ కప్‌తో పాటు అసన్ ఇటీవలే పీరియడ్ ట్రాకర్ యాప్‌ను కూడా విడుదల చేసింది. యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. మహిళలు, బాలికలు వారి ఋుతు చక్రాలను ట్రాక్ చేయడంలో, అనారోగ్య సమస్యలను గుర్తించడంలో ఇది సహాయపడుతుంది. గత ఏడాది అసన్ కార్టియర్ ఉమెన్స్ ఇనిషియేటివ్ ప్రైజ్ ఫర్ సోషల్ ఇంపాక్ట్, ఇన్నోవేట్ యూకే అన్‌లాకింగ్ పొటెన్షియల్ అవార్డులను అందుకుంది.

స్త్రీ ఆరోగ్య సూచిక

ఒక మహిళ పిల్లలను కనాలనే నిర్ణయం తీసుకునేటపుడు పీరియడ్స్ రెగ్యులర్‌గా ఉందా, పీరియడ్స్ నొప్పి గురించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అలాగే పిల్లలు పుట్టిన తర్వాత కూడా చాలా తక్కువ మంది మాత్రమే మెనోపాజ్ గురించి మాట్లాడుతారని గుహ అంటున్నారు. 'పీరియడ్ యాప్ స్పేస్‌లో ప్రతి ఒక్కటి సంతానోత్పత్తికి సంబంధించి రూపొందించబడింది. గర్భధారణ సమయం, అండం విడుదల వంటివి ఎలా ట్రాక్ చేయాలో తెలుసుకోవచ్చు. అసన్‌లో మేము మహిళలకు వారి పీరియడ్ మొత్తం వారి ఆరోగ్యానికి సంబంధించిన విషయంగా చెప్పదలచుకున్నాం' అని ఆమె జతచేస్తున్నారు. ఇది ఋుతు చక్రానికి సంబంధించిన అన్ని అంశాలను కవర్ చేస్తుంది. పీరియడ్స్ సమయంలో వారి మనోభావాలు, లక్షణాలను ట్రాక్ చేయడానికి సహకరిస్తుంది.

ఎప్పుడైనా తొలగించుకోవచ్చు

ఈ యాప్ నుండి వినియోగదారులు తమ ఖాతాలను ఎప్పుడైనా తొలగించుకోవచ్చు. యాప్‌లోని ఎన్విరాన్‌మెంటల్ ట్రాకర్ మహిళలు తమ పీరియడ్ ప్రొడక్ట్‌ల కార్బన్ పాదముద్రను ట్రాక్ చేయడానికి వీలు కల్పిస్తుంది. 'మీరు ప్యాడ్‌లు లేదా టాంపాన్‌ల నుండి కేవలం అసన్ కప్‌కి మాత్రమే కాకుండా, క్లాత్ ప్యాడ్‌లు, పీరియడ్ లోదుస్తులు ఎలా ఇతర వేటికైనా మారినట్లయితే మీ కార్బన్ పాదముద్రను ట్రాక్ చేయవచ్చు. మీరు ల్యాండ్‌ఫిల్‌లకు వెళ్లడం, డబ్బు ఆదా చేయడం, కార్బన్ ఉద్గారాలను నివారించడంలో ఎంత వరకు సహకరిస్తున్నారో ఇది మీకు తెలియజేస్తుంది' అని ఆమె వివరిస్తున్నారు.

మహిళల నేతృత్వంలోని జట్టు

సాఫ్ట్‌వేర్ డిజైనర్లు, ఫ్రంట్-ఎండ్ డెవలపర్‌ల నుండి బ్యాక్ ఎండ్ డెవలపర్‌ల వరకు ఈ యాప్‌ను డెవలప్ చేసిన టీమ్ అంతా మహిళలే. దీన్ని రూపొందించేటప్పుడు పాల్గొన్న ప్రతి వ్యక్తి తమ గురించి తాము ఆలోచించారని, అందుకే అందరి ఉపయోగానికి వీలుగా సరళంగా, సహజంగా మారుస్తున్నారని గుహ చెప్పారు. ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ యాప్ ఇప్పటికే 1,000 డౌన్‌లోడ్‌లను దాటింది. వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. కప్ కొనుగోలు చేసిన ప్రతి కొత్త వినియోగదారుకు యాప్‌కి డౌన్‌లోడ్ లింక్‌తో ఇమెయిల్ పంపబడుతుంది. భవిష్యత్తులో ఆరోగ్య సందేహాలకు సమాధానమివ్వడానికి యాప్‌కి ఏఐ చాట్‌బాట్‌ను జోడించాలని గుహ భావిస్తున్నారు.



అసన్ సామాజిక అంశం

భారతదేశంతో పాటు అంతర్జాతీయంగా బ్రాండ్ వృద్ధి చెందిందని గుహ పంచుకున్నారు. అలాగే మెన్‌స్ట్రువల్ కప్ వ్యాపారం రెండు కీలక రంగాలపై దృష్టి సారిస్తుంది. లాభాపేక్షతో కూడిన D2C వ్యాపారం, సామాజిక ప్రభావం అంశం. 'మేము Shopify, Amazonలో భారతదేశం, యూకే, ఇయూలో విక్రయిస్తాం. మేము అమెజాన్ సస్టైనబిలిటీ యాక్సిలరేటర్‌లో భాగమయ్యాము. మేము కప్పును క్రిమిరహితం చేయడానికి మెన్‌స్ట్రువల్ కప్ క్లెన్సర్‌ని ప్రారంభించాం. అలాగే ఒక లూబ్రికెంట్‌ను కూడా ప్రారంభించాం. తద్వారా టీనేజ్‌లు కప్పును చొప్పించడాన్ని సులభతరం చేసాము. ఈ లైన్‌లో కూడా ఇతర ఉత్పత్తులను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని పంచుకున్నారు.

గ్రామీణ మహిళలు ఖర్చు పెట్టలేరు

అసన్ ఇప్పటికీ 'ఒకటి కొనండి, ఒకటి విరాళం ఇవ్వండి' అనే విధానానికి కట్టుబడి ఉంది. అయితే ప్రపంచవ్యాప్తంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన లక్షలాది మంది మహిళలు, బాలికలు ఉన్నందున ఇది సరిపోదని గుహా చెప్పారు. 'మేము అధిక శాతం మహిళా కార్మికులు ఉన్న ఫండర్లు, లాభాపేక్ష లేని సంస్థలు, తయారీ సంస్థల నుండి కొన్ని ఇన్‌బౌండ్ అభ్యర్థనలను పొందాము. రాయితీ ధరలకు కప్పును విక్రయిస్తున్నాము. ఇందులో భాగంగా విద్య, శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తాము' అని ఆమె జతచేస్తున్నారు. బెంగుళూరులోని కనకపురలో, అసన్ యాప్‌ను ప్రారంభించిన సమయంలో 10 గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఇప్పుడు 100 గ్రామాల్లో 30,000 కంటే ఎక్కువ మంది మహిళలు, బాలికలు దీనిని ఉపయోగిస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మెన్‌స్ట్రువల్ కప్ దత్తత కార్యక్రమంగా మారింది. ఎందుకంటే గ్రామాలలో మహిళలు శానిటరీ ప్యాడ్‌ల కోసం డబ్బు ఖర్చు చేయరు. కనుక వారికి సహకరించాలని గుహ ఈ కృషి చేస్తున్నారు. మలావిలో 5,000 కంటే ఎక్కువ అసన్ కప్పులను పంపిణీ చేసింది. సైన్యంతో ఒక ప్రాజెక్ట్‌లోకి ప్రవేశించిన జాంజిబార్‌లో 2,000 కప్పులను పంపిణీ చేసింది. వారు త్వరలో యూఎస్, ఫ్రాన్స్, జర్మనీలలో ప్రారంభించాలని చూస్తున్నారు.



ఇవి ఎంత ప్రమాదమో...

ప్రస్తుతం యువత మేకప్ వేసుకుంటే చాలు అందంగా ఉంటామని భావిస్తున్నారు. అందుకోసం వాడే బ్యూటీ ప్రొడక్ట్స్ కారణంగా కొంతమంది ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కండ్లు, కళ్లరెప్పల కోసం వాడే బ్యూటీ ప్రొడక్ట్స్‌లో హాని కలిగించే వాటి గురించి ఒకసారి పరిశీలిద్దాం.

నేటి తరం యువత కంటి మేకప్ మీద దృష్టి పెడుతున్నారు. కళ్ళు అందంగా పెద్దవిగా



కనిపించాలని పలు రకాల ప్రొడక్ట్స్ వాడతారు. ఈ బ్యూటీ ప్రొడక్ట్స్ కళ్లకు హానిచేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో ఉపయోగించే కొన్ని రసాయనాల కారణంగా కంటిచూపు దెబ్బతినడంతో పాటు పలు రకాల ఇన్ఫెక్షన్స్ కూడా కలిగే అవకాశం ఉంది.

మనం ఉపయోగించే పలు రకాల ఐ మేకప్ ఉత్పత్తుల్లో ఫైన్ పౌడర్ ఐడ్ గ్లిట్టర్ లాంటి పదార్థాలు మన కనురెప్ప మీద గ్రంధులను మూసివేసి ఇన్ఫెక్షన్స్ కలిగిస్తాయి. ఈ మేకప్ ఉత్పత్తుల కారణంగా కంటి పై హానికరమైన బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల కంటి ఉపరితలంపై పలు రకాల సమస్యలు తలెత్తుతాయి. కొందరిలో ఇది తీవ్రమైన కంటి ఇన్ఫెక్షన్ కి కూడా దారితీస్తుంది.

ఐలేషస్ పొడుగుగా అందంగా కనిపించాలి అనే ఉద్దేశంతో చాలామంది ఎక్కువగా మస్కారా వంటివి వాడుతారు. అయితే వీటివల్ల వెంట్రుకలు జోడించబడడంతో పాటు చర్మం దగ్గర ఇరిటేషన్ కూడా కలుగుతుంది. పైగా మస్కార వాడిన తరువాత సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే బ్యాక్టీరియా ఫాం అవుతుంది.

ప్రస్తుతం చాలామంది కాంటాక్ట్ లెన్సెస్‌ను ఎక్కువగా వాడుతున్నారు. అవి సరిగ్గా శుభ్రం చేయనట్లయితే కంటి లోపల ఇన్ఫెక్షన్ పెరిగే ప్రమాదం ఉంది. దీని కారణంగా దృష్టి పోయే అవకాశం కూడా ఉంది అంటున్నారు నిపుణులు. అందుకే మీరు వాడే లెన్స్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి మూడు నెలలకు కాంటాక్ట్ లెన్సెస్ మారుస్తూ ఉండాలి.

తిరుపతి ఘటనలో ఇద్దరిపై వేటు

తిరుపతి: తిరుపతిలోని వైకుంఠ ద్వారా దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. తొక్కిసలాట ఘటనపై టీటీడీ పరిపాలన భవనంలో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం" అని వివరించారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం

తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు టీడీపీ ద్వారా రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని అన్నారు. ఈ ఘటనలో తిమ్మక్క, ఈశ్వరమ్మ అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయని, వారికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని తెలిపారు. అలాగే గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని అన్నారు. ఈ ఘటనతో బాధలో ఉన్నప్పటికీ వారిలో స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం ఉందని, 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని ఆయన చెప్పారు.

తిరుమల పవిత్రతను కాపాడుతాం

తిరుమల పవిత్రతను కాపాడుతామని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఈ తొక్కిసలాట ఘటన వార్త తెలిసి ఎంతో బాధపడ్డా. తిరుపతిలో ఎలాంటి దుర్ఘటనలు జరగకూడదని ఓ భక్తుడిగా కోరుకుంటా. ఘటనాస్థలిని పరిశీలించి ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించా. తిరుమల దివ్యక్షేత్రం పవిత్రత కాపాడే బాధ్యత తీసుకుంటా. ఇక్కడ రాజకీయాలు చేయడానికి వీల్లేదు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్లు ఇవ్వడం గతంలో లేని సంప్రదాయం. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచారు. ఎందుకు పెంచారో తెలియదు. మొదటి నుంచి ఉన్న సంప్రదాయలను మార్చడం మంచిది కాదు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలి. ఏ ఆలయంలోనూ అపచారం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పవిత్ర దినాల్లో దర్శనాలు సాఫీగా చేయించాల్సిన బాధ్యత అధికారులదే" అని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు టీటీడీ పరిపాలనా భవనంలో.. టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవోతో సమీక్ష నిర్వహించారు.

యూజీసీ ముసాయిదా నిబంధనలు ఉపసంహరించాలి

(మొదటిపేజీ తరువాయి)



హక్కులపై ప్రత్యక్ష దాడిగా పొలిట్‌బ్యూరో విమర్శించింది. వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే అధికారం గవర్నర్-ఛాన్సలర్ నియమించే ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీకి కట్టబెట్టడాన్ని పైగా ఈ కమిటీకి గవర్నరే చైర్‌పర్సన్‌గా ఉండటాన్ని పొలిట్ బ్యూరో ప్రశ్నించింది. ప్రస్తుతం కొన్ని ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో వైస్‌ఛాన్సలర్ల నియామకంలో గవర్నర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్న సమయంలో ఈ నిబంధన తీసుకుని రావడాన్ని గుర్తు చేసింది. ఈ సెలక్షన్ కమిటీలో ఎవర్ని నియమిస్తారనే విషయం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదని, ఈ నిబంధనతో గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో తనకు నచ్చిన వైస్‌ఛాన్సర్లలను నియమించుకోవచ్చునని పొలిట్‌బ్యూరో తెలిపింది. ఈ ముసాయిదా ద్వారా విద్య అనేది ఉమ్మడి జాబితా అనే రాజ్యాంగ నిబంధనను కేంద్రం ఉల్లంఘించిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అన్ని ప్రజాస్వామిక వర్గాలు ఈ ప్రమాదకరమైన నిబంధనను ఐక్యంగా వ్యతిరేకించాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

"భూభారతి"కి గవర్నర్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

నవీన్ మిట్టల్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ భారతి-24 చట్టాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తెచ్చి, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని తెలిపారు. భూ నిపుణులు, మేధావులు, రైతులు, న్యాయవాదులతో పాటు ప్రజలందరి అభిప్రాయాల ను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. "రెవెన్యూ చట్టం -2020తో రాష్ట్రంలోని సామాన్య ప్రజలు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. చట్టం వచ్చి మూడేండ్లు గడిచినా గత సర్కార్ విధివిధానాలను రూపొందించలేదు. భూ సమస్యలేని గ్రామం తెలంగాణలో లేదు. గత పాలకులు వ్యక్తిగత స్వార్థం, స్వీయ ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారు. పదేండ్లుగా కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. గ్రామాల్లో రెవెన్యూ పాలనను చూడడానికి ప్రతి గ్రామానికి ఒక అధికారిని నియమించబోతున్నాం. ఇందుకు సంబంధించిన కసరత్తు కొలిక్కివచ్చింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోంది. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం నిబద్ధతతో పనిచేయాలి, రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష. ప్రజలు కేంద్రబిందువుగా మా ప్రభుత్వ నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని సామన్య ప్రజలకు రెవెన్యూ సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమిష్టిగా పనిచేయాలి" అని పొంగులేటి అన్నారు. చట్టానికి ఆమోదముద్ర వేసిన గవర్నర్, తీసుకురావడానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

7 గంటలు..50 ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించినవారిలో ఉన్నారు. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ విషయంలో క్యాబినెట్ అనుమతిని తీసుకున్నారా? అందుకు అయ్యే వ్యయానికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి ముందస్తు అనుమతిని తీసుకున్నారా? అని కూడా ఏసీబీ ప్రశ్నించినట్టు తెలిసింది.

మొదటి సెషన్‌లో గ్రీన్‌కో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న మీరు.. రెండో సెషన్‌లో ఆ కంపెనీ తప్పుకున్నాక హెచ్ఎండీఏ భాగస్వా మ్యం చేసే సమయంలో క్యాబినెట్ అనుమతిని పొందారా? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ-కార్ రేసింగ్ నిర్వహణ కోసం ఎఫ్ఈఓ విదేశీ కంపెనీతో ఎలాంటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు? అందుకోసం రూ.55 కోట్లను హెచ్ఎండీఏ నిధుల నుంచి సదరు కంపెనీకి బదిలీ చేయాలని అరవింద్ కుమార్‌కు ఆదేశాలిచ్చారా? అని కూడా ఏసీబీ ప్రశ్నించినట్టు తెలిసింది. ఒక విదేశీ కంపెనీకి ఇంత పెద్ద మొత్తంలో మన కరెన్సీని బదిలీ చేసే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతులు తీసుకోవాలని మీకు తెలియదా? అనే ప్రశ్నకు.. ఆ వ్యవహారాలను అధికారులు చూసుకుంటారని తాను భావించినట్టు కేటీఆర్ తెలిపారని సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌ను ప్రోత్సహించటం వలన హైదరాబాద్ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతుందనీ, దానితో పాటు దానికి అనుబంధంగా ఈ-కార్ల తయారీకి హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని భావించానని ఈ సందర్భంగా కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. గ్రీన్‌కో కంపెనీ నుంచి రూ.47 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఏ విధంగా సేకరించారని ప్రశ్నించగా.. ఈ కంపెనీ నుంచి ఇతర రాజకీయ పార్టీలు కూడా బాండ్ల రూపంలో నిధులు పొందాయని కేటీఆర్ తెలిపినట్టు సమాచారం. అయితే, ఈ-ఫార్ములా కార్ రేసింగ్ కోసం ప్రభుత్వ నిధులను వెచ్చించి, తద్వారా ఎలక్టోరల్ బాండ్లను పొందారా? అని ఏసీబీ అధికారులు తిరిగి ప్రశ్నించారని తెలిసింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణకు బిడ్డింగ్‌లకు పిలిచారా? ఇందుకు ఆ సమయంలో క్యాబినెట్ అనుమతిని తీసుకున్నారా? అని మరో ఏసీబీ అధికారి కేటీఆర్‌ను అడిగినట్టు తెలిసింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ పూర్తిగా మీ స్వంత నిర్ణయమా? ప్రభుత్వ ధనాన్ని వెచ్చించే విషయంలో క్యాబినెట్ సమిష్టి నిర్ణయం తీసుకుంటుంది కదా? మీరు ఆ నిబంధనలు పాటించలేదా? అని మరో అధికారి కేటీఆర్‌ను పూర్తిగా ప్రశ్నించినట్టు సమాచారం.

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నుంచి గ్రీన్‌కో కంపెనీ ఎందుకు తప్పుకున్నది? దాని స్థానంలో హెచ్ఎండీఏను భాగస్వామ్యం చేయటం కూడా మీ స్వంత నిర్ణయమేనా? అని ఏసీబీ అధికారుల ప్రశ్నించగా.. ఏం చేసినా హైదరాబాద్ ప్రతిష్టను పెంచటానికే చేశానని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఉదయం పది గంటల నుంచి ప్రారంభమైన కేటీఆర్‌ను ప్రశ్నించే ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. మధ్యలో గంటన్నరపాటు భోజన విరామమిచ్చారు. కేటీఆర్ ఇచ్చిన ప్రతి సమాధానాన్నీ రికార్డు చేసిన అధికారులు.. ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించిన ఒప్పంద పత్రాలు, లిఖిత ఆదేశాలు, ఐఓబీ బ్యాంకు నుంచి ఎఫ్ఈఓకు పౌండ్ల రూపంలో బదిలీ అయిన రూ.55 కోట్లకు సంబంధించిన పత్రాలను కొన్నింటినీ ఏసీబీ అధికారులు తమ ఎదుట పెట్టుకొని కేటీఆర్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. అదేసమయంలో, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణలో జరిగిన కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగానికి సంబంధించి ప్రస్తుత హెచ్ఎండీఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన ఫిర్యాదుతో పాటు అరవింద్ కుమార్ విచారణలో తేలిన అంశాలను కూడా దృష్టిలో ఉంచుకొని కేటీఆర్‌పై దాదాపు 50కి పైగా ప్రశ్నలను సంధించారని సమాచారం. కాగా, కొన్ని సందర్భాల్లో ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైందనీ, ఇందులో తాను ఎలాంటి పొరపాట్లకు పాల్పడలేదనీ, రాజకీయ ఒత్తిడితోనే కేసు పెట్టారని కేటీఆర్.. అధికారుల ముందు వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

నేడు బీఎల్ఎన్ రెడ్డి విచారణ

చివరిలో తమకు మరిన్ని అనుమానాలున్నాయనీ, కొన్ని పత్రాలను పరిశీలించాక అవసరమైతే తిరిగి విచారణకు పిలుస్తామని ఏసీబీ అధికారులు కేటీఆర్‌కు చెప్పారని సమాచారం. కేటీఆర్ ప్రతీ వ్యాఖ్యలను రికార్డు చేసిన అధికారులు.. ఆయన నుంచి చివరగా సంతకం కూడా తీసుకున్నట్టు తెలిసింది. ఈ కేసులో మూడో నిందితుడైన హెచ్ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ నేడు(శుక్రవారం) విచారించనున్నది.

జీహెచ్ఎంసీ ఆఫీసు వద్ద కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రూ.1,100 కోట్లు వెంటనే విడుదల చేయాలంటూ జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని బల్దియా హెడ్ ఆఫీస్ ముందు గురువారం ధర్నా చేశారు. చేసిన పనులకు బిల్లులు అందక అప్పుల పాలవుతున్నామని, తట్టుకోలేక పలువురు కాంట్రాక్టర్లు గుండెపోటుతో మరణించారని, ఇలా అయితే చిన్న కాంట్రాక్టర్లు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల ఐక్యత వర్ధిల్లాలని, కమిషనర్ బయటకు రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను.. బిల్లులు చెల్లించాలంటూ ఓ కాంట్రాక్టర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇతర కాంట్రాక్టర్లు అడ్డుకొని రక్షించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అప్రమత్తమైన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు కార్యాలయం లోపలికి రాకుండా గేట్లు మూసేసి వారిని అడ్డుకున్నారు. దాంతో గేటు వద్దే బైటాయించిన కాంట్రాక్టర్లు కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రస్తుత కమిషనర్ ఇలంబర్తి తమను పట్టించుకోవడం లేదని, కనీసం తమ సమస్యలను వినడానికి కూడా సిద్ధంగా లేరని ఆరోపించారు. గతంలో పనిచేసిన కమిషనర్లు తమతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చూశారన్నారు. పోలీసులను మోహరించి తమను అరెస్టులు చేయించాలని కమిషనర్ చూస్తున్నారని, ఇది సరైనది కాదంటూ వాపోయారు. అనంతరం కాంట్రాక్టర్లను తన ఛాంబర్‌కు పిలిపించుకున్న కమిషనర్ సమస్యపై చర్చించారు. సంక్రాంతి పండుగ లోపు రూ.500 నుంచి 600 వంద కోట్లు విడుదల చేస్తామని కమిషనర్ చెప్పినట్టు కాంట్రాక్టర్లు తెలిపారు. అయితే, 20వ తేదీ వరకు ఆ నిధులు విడుదల చేయకపోతే సమ్మె బాట పడతామని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

(మొదటిపేజీ తరువాయి)

రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతరతో పేల్చేశారు. ఈ ఘటనలో ఎనిమిది మంది సైనికులు, డ్రైవర్ అక్కడిక్కడమే చనిపోయిన విషయం విదితమే. దండకారుణ్యంలో ఎదురుకాల్పులతో రక్తమోడుతున్న తీరుతో అడవిబిడ్డల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదు?

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో హెచ్ఎండీఏ అప్పటి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వాహకులకు నిధులను పంపించే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) నుంచి ముందుగా అనుమతిని పొందారా? అని ఈడీ అధికారులు సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. సివిల్ సర్వెంట్‌గా ప్రభుత్వ నిధుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియదా? లేదా అవసరం లేదనుకుంటున్నారా? అని అర్వింద్ కుమార్‌ను ఈడీ అధికారులు నిలదీసినట్టు సమాచారం. హెచ్ఎండీఏకు చెందిన నిధులను విదేశీ కంపెనీకి చెల్లించేందుకు మీరు ఎవరి అనుమతిని తీసుకున్నారు? అని ప్రశ్నించగా.. తనకు అప్పటి పురపాలక మంత్రి కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకే తాను ఈ డబ్బులను విదేశీ కంపెనీకి బదిలీ చేశానని అరవింద్ కుమార్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఈ విషయంలో ఫెమా చట్టాన్ని మీరు ఉల్లంఘించారు కదా? అని ఈడీ ప్రశ్నించినట్టు సమాచారం. దాదాపు ఆరు గంటల పాటు సాగిన విచారణలో ఈడీ అధికారులు పలు కోణాల నుంచి ప్రశ్నించారని తెలిసింది. కాగా, ఈనెల 16న కేటీఆర్‌ను విచారించటానికి ఈడీ అధికారుల రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

రేవంత్ రాసిచ్చిన ప్రశ్నలనే అడిగారు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

"ఫార్ములా-ఈ కార్ రేస్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి నాలగు ప్రశ్నలు రాసి పంపించారు. వాటినే తిప్పితిప్పి ఏసీబీ అధికారులు అడిగారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గురువారం తన విచారణ పూర్తయ్యాక ఏసీబీ కార్యాలయం నుంచి సాయంత్రం వెలుపలికి వచ్చిన కేటీఆర్ అక్కడున్న మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైందనీ, కేవలం రాజకీయ లబ్ధి కోసమే రేవంత్‌రెడ్డి ఈ కేసు పెట్టించారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి నాలుగు ప్రశ్నలు రాసిస్తే, దాని ఆధారంగా నలభై ప్రశ్నలు చేసి అధికారులు తనను ప్రశ్నించారనీ, అసలు ఈ కేసు ఏమిటో వారికే అర్థం కావటం లేదని అన్నారు. అధికారులు వేసిన ప్రశ్నలకు తన అవగాహన మేరకు సంతృప్తికరమైన సమాధానాలిచ్చానని కేటీఆర్ తెలిపారు. "వారికి(కంపెనీ) పైసలిచ్చాం, ఆ పైసలు మా దగ్గరున్నాయని వారు చెప్తున్నారు. ఇంకా ఇందులో కరప్షన్ ఎక్కడిది" అని ఎఫ్ఈఓ కంపెనీకి చెల్లించిన డబ్బులపై కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా, ఈ కేసులో తేలేది ఏమీ లేదనీ, ఏసీబీ ఎన్ని సార్లు పిలిచినా.. విచారణకు సహకరిస్తానని అన్నారు.

పోలీసు అధికారిపై కేటీఆర్ ఆగ్రహం

ఏసీబీ కార్యాలయం ముందు మీడియాతో కేటీఆర్ మాట్లాడుతుండగా.. ఇక్కడ మాట్లాడకూడదని పోలీసు అధికారులు అభ్యంతరం తెలిపారు. అందుకు ఆగ్రహించిన కేటీఆర్.. 'మీడియాపై మీ దౌర్జన్యమేమిటి? మాట్లాడితే మీకేం నొప్పి అవుతుంది' అని అక్కడి అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. దానికి అధికారి బదులిస్తూ... 'మీ పార్టీ కార్యాలయానికి వెళ్లి మాట్లాడుకోండి. ఇది మీడియా పాయింట్ కాదు' అని సమాధానమివ్వటంతో కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నవచిత్రం

'డాకు మహారాజ్' అద్భుతంగా ఉంటుంది



ప్రగ్యా జైస్వాల్

బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 12న రిలీజ్ కానుంది. బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సినిమా విడుదల సందర్భంగా కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మీడియాతో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు.

● ఇందులో నేను కావేరి పాత్ర పోషించాను. నటనకు ఆస్కారం ఉన్న మంచి పాత్ర ఇది. డీ గ్లామరస్ రోల్ చేశాను. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. ఈ పాత్రను దర్శకుడు బాబీ డిజైన్ చేసిన తీరు బాగుంది. ఈ పాత్ర నటిగా నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. కావేరి పాత్రతో పాటు ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది.

● పుట్టినరోజు ప్రతి ఏడాది వస్తుంది. కానీ బాలకృష్ణ సినిమా అనేది ఒక సెలబ్రేషన్ లాంటిది. ఆయనతో కలిసి నేను నటించిన సినిమా నా బర్త్ డేకి విడుదల కావడం అదృష్టం. ఇది నా పుట్టినరోజుకి ఒక పెద్ద బహుమతిగా భావిస్తున్నాను. అలాగే నేను నటించిన సినిమా సంక్రాంతిలాంటి పెద్ద పండక్కి రావడం కూడా ఎంతో సంతోషంగా ఉంది.

● బాలకృష్ణతో 'అఖండ, డాకు మహారాజ్, అఖండ-2' ఇలా వరుస సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. కోవిడ్ సమయంలో ఎవరూ పెద్దగా సినిమాలు చేయ లేదు. అలాంటి సమయంలో బోయపాటి శ్రీను 'అఖండ' కథ చెప్పి, అంత గొప్ప సినిమాలో నన్ను భాగం చేశారు. ఆ సినిమా ఘన విజయం సాధించి, నా సినీ కెరీర్‌ని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'డాకు మహారాజ్' లాంటి మరో మంచి సినిమాలో బాలకృష్ణతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఇది కూడా ఘన విజయం సాధిస్తుంది.

● బాబీ అద్భుతమైన దర్శకుడు. ఆయన ఈ కథ చెప్పినప్పుడే ఇది మంచి చిత్రం అవుతుందని నమ్మాను. నేను ఊహించిన దానికంటే గొప్పగా ఈ చిత్రాన్ని రూపొందించారు. బాలకృష్ణని చాలా కొత్తగా చూపించారు. విజువల్స్ కూడా అద్భుతంగా ఉంటాయి. మన సినీ పరిశ్రమలో ఉన్న గొప్ప సంగీత దర్శకులలో తమన్ ఒకరు. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో ఆయన సంగీతం మరింత గొప్పగా ఉంటుంది. ఈ చిత్రానికి పాటలతో పాటు నేపథ్య సంగీతం కూడా అద్భుతంగా ఇచ్చారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నాగవంశీ గొప్ప నిర్మాత. అందరిని స్వేచ్ఛగా పని చేసుకోనిస్తారు.



'నిన్ను.. నన్ను కన్న ఆడదిరా'..

ఆడవారి విలువను, గొప్పతనాన్ని తెలియజేసేలా, అలాగే వారిపై జరుగుతున్న లైంగిక దాడులు వంటి అంశాలతో దర్శకుడు రమణారెడ్డి 'నిన్ను..నన్ను కన్న ఆడదిరా..' అనే పాటను రూపొందించారు.
మహిళలందరికీ మంచి జరగాలనే మంచి లక్ష్యంతో ఈ పాటలో సర్వమతాల వారికి ప్రాధాన్యత ఇస్తూ తెరకెక్కించారు. ఈ పాట లాంచ్ సందర్భంగా నటుడు అలీ మాట్లాడుతూ,'ఈ పాట చేయడానికి ముఖ్య కారణం మనం ప్రస్తుతం బయట చూస్తున్న పరిస్థితులు. క్యాన్సర్ కంటే దారుణంగా ఈ రేప్ అనే వ్యాధి వ్యాపిస్తోంది. నాకు ఈ పాట వినగానే 'యమలీల' సినిమాలో పాట గుర్తొచ్చింది. దర్శకుడు రమణా రెడ్డి ఇక్కడ నుండి అమెరికా వెళ్లి, మన దేశానికి ఏమైనా చేయాలనుకుని తిరిగి వచ్చి, ముందుగా ఈ పాటతో మొదలు పెట్టాడు. పాట విన్న వెంటనే నేను ఈ పాటని మన రాష్ట్రానికి, ఆడవారికి డెడికేట్ చేయాలి అనుకున్నాం. అందుకే ఈ పాట పూర్తిగా అన్ని ఛానెల్స్, ఆడియో కంపెనీలకు ఉచితం. ఈ పాటలో అన్ని మతాల వారు ఒక మెసేజ్‌తో ఇస్తే ఇంకా బాగా వెళ్తుంది. అందుకే ఈ విధంగా చిత్రీకరణ చేశారు. అలాగే ఈ పాటలో నటించేందుకు ముంబై నుండి వచ్చినందుకు హీరోయిన్ కామ్నా గారికి థ్యాంక్స్' అని చెప్పారు.
'కామంతో కళ్ళు మూసుకునిపోయి మృగంలా ప్రవర్తించే వారిలో మార్పు రావాలి. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇప్పటికే దీన్ని అరికట్టడానికి ప్రభుత్వం తరపున ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ పాట ఒక మంచి తొలి అడుగులా కనిపిస్తుంది. ఇలాంటి పాట చేసిన దర్శకుడు రమణారెడ్డిని అభినందిస్తున్నాను. ఈ పాట వల్ల సమాజంలో మార్పుని ఆశిస్తున్నాను' అని మంత్రి సీతక్క అన్నారు.



ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే 'హత్య'

'మధ' వంటి సైకలాజికల్ థ్రిల్లర్‌తో అందరినీ మెప్పించిన దర్శకురాలు శ్రీ విద్య బసవ 'హత్య' అనే మరో థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు.
ఈ చిత్రం ఈనెల 24న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాను మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుక గురువారం జరిగింది. నటుడు రవివర్మ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది.
ఈ సందర్భంగా దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, "మధ' తరువాత థ్రిల్లర్ జోనర్‌లోనే రెండో సినిమా కూడా చేస్తున్నాను. ఇది అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. చాలా హార్డ్ వర్క్, ఎఫర్ట్స్ పెట్టి స్క్రీన్ ప్లే రాసుకుని చేసిన సినిమా ఇది. ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేసిన నటీనటులు ధన్య బాలకృష్ణ, రవివర్మ, పూజా రామచంద్రన్ సహా అందరికీ థ్యాంక్స్. నరేష్ అద్భుతమైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి. అనిల్ ఎడిటింగ్ సినిమాను మరింత క్యూరియస్‌గా మార్చింది. మా నిర్మాత ప్రశాంత్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



రవివర్మ, శ్రీ విద్య బసవ, పూజా రామచంద్రన్

"మధ' సినిమా టీజర్ చూడగానే నేను శ్రీవిద్యకు కాల్ చేశాను. నేను కూడా సినిమాలో భాగం అవుతానని అన్నాను. చాలా చిన్న పాత్ర ఉందని చెప్పింది. నాకు నేనుగా వెళ్లి ఆ సినిమాలో యాక్ట్ చేశాను. అప్పుడు ఆమెతో ప్రారంభమైన ఆ జర్నీ ఇప్పుడు ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేలా చేసింది. రొటీన్‌కు భిన్నమైన రోల్‌ను శ్రీవిద్య నన్ను లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేసింది. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్. శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. సినిమా అందరినీ ఎంగేజ్ చేసే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఆడియెన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుంది' అని నటుడు రవివర్మ చెప్పారు.
నటి పూజా రామచంద్రన్ మాట్లాడుతూ, 'ఇందులో నాది కీ రోల్. సినిమానంత మార్చేసే చాలా ముఖ్యమైన పాత్రలో నటించాను. చాలా కాలం తర్వాత ఇటువంటి డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ శ్రీవిద్యకి థ్యాంక్స్. రవివర్మ అద్భుతమైన నటుడు. శ్రీవిద్య ఎక్సలెంట్ డైరెక్టర్. తను ఇండస్ట్రీలో ఇంకా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరుకుంటున్నాను. అందరి దగ్గరి నుంచి బెస్ట్ ఔట్‌పుట్‌ను రాబట్టుకుంది. అభిరాజ్ ప్రతీ ఫ్రేమ్‌ను బ్యూటీఫుల్‌గా క్యాప్చర్ చేశారు. నరేష్ తన మ్యూజిక్‌తో సినిమాను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లారు' అని తెలిపారు.

ఇంతింతై వటుడింతై...

దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు

జాతీయాదాయంపై సంపన్నుల పెత్తనం

పేదల దరి చేరని అత్యవసర సేవలు



న్యూఢిల్లీ : దేశంలో ఆదాయ అసమానతలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని ఓ కార్యాచరణ పత్రం తెలిపింది. పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) అనే సంస్థ రూపొందించిన ఈ పత్రాన్ని ఇటీవలే విడుదల చేశారు. సమ్మిళిత వృద్ధి, సామాజిక-ఆర్థిక సమానత్వం కోసం సమర్థవంతమైన విధానాలను రూపొందించడానికి ఆదాయ పంపిణీని కచ్చితత్వంతో లెక్కించాల్సిన అవసరాన్ని ఈ పత్రం గుర్తు చేసింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ వంటి సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. వ్యక్తులు, కుటుంబాల మధ్య ఆదాయ అసమానతలను నిర్ధారించడానికి ఉపయోగించిన గణాంక పద్ధతి 'గినీ కోఎఫీషియంట్' ప్రకారం అసమానతల సూచీ 1953-55 మధ్య 0.371గా ఉంటే 2022-23లో 0.410గా ఉంది.

సమాజంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆ పత్రం తెలిపింది. 2015-16, 2020-21 మధ్యకాలంలో దేశంలో ఆదాయ అసమానతలకు సంబంధించిన గినీ సూచిక 0.395 నుండి 0.528కి పెరిగిందని ప్రైస్ సంస్థ సీఈఓ, కార్యాచరణ పత్రం రూపకర్త రాజేష్ శుక్లా తెలిపారు. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారు. కానీ భారతీయ కుటుంబ సర్వేలు మాత్రం సంపన్నుల వాటా జాతీయాదాయంలో 7.3 శాతమేనని చెబుతున్నాయి.

దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదాయంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అంటే మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉన్నదని అవి చెబుతున్నాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్య తరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. 1953-55లో 41.5 శాతంగా ఉన్న వాటా 2022-23లో కేవలం 27.3 శాతానికి తగ్గిపోయింది. ఇక జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయంలో 15.8 (2020-21) నుండి 25.5 (1961-65) శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కోవిడ్ సమయంలో ఈ సూచీ 22.8 శాతం మధ్య కొనసాగి మెరుగుదల కనబరచింది.

భారతీయ కుటుంబ సర్వేలు, వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ డాటాబేస్ అంచనాలను పరిశీలిస్తే దేశీయ, అంతర్జాతీయ సర్వేల మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అర్థమవుతోంది. అయినప్పటికీ ఈ రెండు సర్వేలు ఇచ్చిన ముగింపు మాత్రం ఒకేలా ఉంది. దేశంలో అత్యధిక ఆదాయం పొందుతున్న వారి చేతిలోనే సంపద పోగుపడుతోంది. జనాభాలో అట్టడుగున ఉన్న 10 శాతం ప్రజలు మాత్రం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ఆదాయ అసమానతలు అధికంగా ఉన్న దృష్ట్యా స్థిరమైన, సమ్మిళిత ఆర్థిక వ్యూహాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని కార్యాచరణ పత్రం సూచించింది.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

19న సీఐటీయూ, వ్యకాస,రైతు సంఘాల ఆధ్వర్యంలో సదస్సులు : జి.నాగయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐక్య ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య చెప్పారు. సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాల్లో 19న జరిగే సదస్సులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘం సంయుక్త సమావేశం నిర్వహించారు. అందులో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ..1982 తమిళనాడులో రైతాంగం హక్కుల కోసం జరిగిన కార్మిక, కర్షక, రైతాంగ ప్రదర్శనపైన ఆనాటి ప్రభుత్వం విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో పదిమంది నాయకులు అక్కడికక్కడే చనిపోయారనీ, వారిలో నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు రైతులు, ముగ్గురు కార్మికులు ఉన్నారని వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో బెనారస్‌లో కార్మిక వర్గం ప్రదర్శనపైన ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 19న కాల్పులు జరిపించి నిర్బంధం ద్వారా ఉద్యమాన్ని అణిచివేయాలని చూసిందని చెప్పారు.



నేడు అధికారంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చి నిర్బంధ శ్రమ దోపిడీకి పూనుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తున్న తీరును ఎండగట్టారు. వ్యవసాయ మార్కెట్లను, విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించే దిశగా మోడీ సర్కారు ముందుకెళ్తున్నదని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా రైతులకు గిట్టుబాటు ధర చెల్లిస్తామనే హామీని మోడీ సర్కారు బుట్టదాఖలు చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఆన్‌లైన్ పేమెంట్ మాస్టరు ఆధార్ కార్డు అనుసంధానం పేరుతో కూలీల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులను పూర్తిగా తగ్గించిందని దీనివల్ల పెద్ద ఎత్తున పని దినాలు పడిపోయాయన్నారు.

ఆటలు




కమిన్స్‌కు గాయం?

చాంపియన్స్ ట్రోఫీకి దూరం

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. శ్రీలంకతో రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌కు పాట్ కమిన్స్ అందుబాటులో లేడు. పితృత్వ సెలవు కోసం గతంలోనే క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నుంచి అనుమతి తీసుకున్నాడు. కానీ భారత్‌తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పాట్ కమిన్స్ చీలమండ గాయం బారిన పడినట్టు సమాచారం. చీలమండ గాయం నుంచి కోలుకునేందుకు సమయం పడుతుంది. దీంతో ఫిబ్రవరిలో ఆరంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీలో కమిన్స్ ఆడే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు ఆసీస్‌కు సారథ్యం వహించి టైటిల్ అందించిన కమిన్స్.. ఆ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్‌లో పెద్దగా ఆడలేదు. పని ఒత్తిడితో వన్డే ఫార్మాట్‌లో కనిపించలేదు. ఈ సమయంలో స్మిత్, మార్ష్ ఇంగ్లీశ్‌లు కెప్టెన్సీ వహించారు. చాంపియన్స్ ట్రోఫీలో ఫిబ్రవరి 22న ఇంగ్లాండ్‌తో ఆసీస్ తొలి మ్యాచ్ ఆడనుంది. చాంపియన్స్ ట్రోఫీకి జట్టును ఎంపిక చేసేందుకు జనవరి 12న గడువు ముగియనుంది. దీంతో పాట్ కమిన్స్ లేకుండా ఆసీస్ జట్టును ఎంపిక చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో కమిన్స్ 167 ఓవర్లు బౌలింగ్ చేశాడు.

జకోవిచ్‌కు కఠిన డ్రా!

క్వార్టర్స్‌లోనే అల్కరాజ్‌తో ఢీ



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పది సార్లు చాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)కు కఠిన డ్రా ఎదురైంది. మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోనే మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్‌తో తలపడే అవకాశం ఉంది. డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సినర్ క్వార్టర్స్‌లో డీ మినయ్యూర్‌ను ఎదుర్కొనే వీలుంది. మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నం.1 సబలెంక ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో హ్యాట్రిక్‌పై కన్నేసి బరిలోకి దిగుతోంది. మార్టినా హింగిస్ తర్వాత వరుసగా మూడు సార్లు గ్రాండ్‌స్లామ్స్ సాధించిన రికార్డు సాధించేందుకు సబలెంక ఎదురుచూస్తోంది. కొకొ గాఫ్, నవొమి ఒసాక, ఇగా స్వైటెక్, ఎమ్మా రాడుకానులు మహిళల సింగిల్స్ టైటిల్ రేసులో నిలిచారు.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

- ప్రణయ్, గాయత్రి జోడీ పరాజయం
- మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్



కౌలాలంపూర్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ కొత్త ఏడాదిలో సరికొత్త జోష్ చూపిస్తున్నారు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్, చిరాగ్‌లు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో మలేషియా జోడీ నూర్ మహ్మద్, టాన్ వీలపై వరుస గేముల్లో గెలుపొందారు. 43 నిమిషాల్లోనే ముగిసిన పోరులో సాత్విక్, చిరాగ్‌లు 21-15, 21-15తో చెలరేగారు. నేడు సెమీఫైనల్లో బెర్త్ కోసం మలేషియా జోడీతోనే తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. లక్ష్యసేన్ ఇదివరకే నిరాశపరచగా.. హెచ్.ఎస్ ప్రణయ్ ప్రీ క్వార్టర్స్‌లో తేలిపోయాడు. చైనా షట్లర్ షి ఫెంగ్ (7) చేతిలో మూడు గేముల్లో పోరాడి ఓడాడు. 8-21, 21-15, 21-23తో ప్రణయ్ ఆఖరు వరకు గట్టి పోటీ ఇచ్చాడు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రిలు 21-15, 8-21, 19-21తో మూడు గేముల మ్యాచ్‌లో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కపిల ధ్రువ్, తనీశ క్రాస్టో జంట 13-21, 20-21తో తేలిపోగా.. సతీశ్ కుమార్, ఆద్య జంట సైతం 10-21, 17-21తో నిరాశపరిచింది. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ 18-21, 1-21తో మూడో సీడ్ చైనా షట్లర్ చేతిలో ఓటమి చెందింది. దీంతో మెన్స్ డబుల్స్ మినహా అన్ని విభాగాల్లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది.

హర్యానా, రాజస్థాన్ ముందంజ

తమిళనాడు, బెంగాల్ ఇంటిబాట



వడోదర (గుజరాత్) : విజయ్ హజారే ట్రోఫీలో హర్యానా, రాజస్థాన్‌లు ముందంజ వేసి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచుల్లో ఓడిన తమిళనాడు, బెంగాల్ జట్లు ఇంటిముఖ పట్టాయి. హర్యానాతో మ్యాచ్‌లో బెంగాల్ 72 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. తొలుత హర్యానా 50 ఓవర్లలో 9 వికెట్లకు 298 పరుగులు చేసింది. పార్థ్ వాట్స్ (62), నిశాంత్ సింధు (64) సహా సుమిత్ కుమార్ (41 నాటౌట్) రాణించారు. బెంగాల్ పేసర్ మహ్మద్ షమి (3/61) మూడు వికెట్లతో రాణించాడు. ఛేదనలో బెంగాల్ చతికిలి పడింది. 43.1 ఓవర్లలో 226 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ అభిషేక్ (57) అర్ధ సెంచరీ సాధించినా.. ఇతర బ్యాటర్లు నిరాశపరిచారు. మరో మ్యాచ్‌లో తమిళనాడుపై రాజస్థాన్ 19 పరుగుల తేడాతో గెలుపొందింది. అభిజిత్ తోమర్ (111), మహిపాల్ (60) మెరుపులతో తొలుత రాజస్థాన్ 47.3 ఓవర్లలో 267/10 పరుగులు చేసింది. ఛేదనలో తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ జగదీశన్ (65), విజయ్ శంకర్ (49) రాణించినా తమిళనాడు విజయానికి చేరువ కాలేదు. శనివారం, ఆదివారం క్వార్టర్‌ఫైనల్ మ్యాచులు జరుగుతాయి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886